


ESTD: 1999 www.voodayam.com

# వుదయం

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6 :28
సహార్ (ఉదయం) 5 :13

హైదరాబాద్ | 28-02-2026 శనివారం | సంపుటి : 26 | సంచిక : 349 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on



# ఆధారాలు లేవు

లిక్కర్ స్కాం కేసులో కవితకు క్లీన్‌చిట్

కేజ్రీవాల్, సిసోడియా సహ 23 మంది విడుదల

ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు

కన్నీళ్ల పర్యంతమైన కేజ్రీవాల్



## తగిన ఆధారాలు, ప్రాథమిక సాక్ష్యాలు కూడా లేకుండా ఆరోపణలు నమోదు చేశారు సిబిఐ చార్జిషీట్‌లో మెరిట్ లేదు

"నాపై తప్పుడు ఆరోపణలు పెట్టారు. మోదీ, అమిత్ షా కలిసి కుట్ర చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేసేందుకు కేంద్రం ప్రయత్నించింది. నేను, సిసోడియా, మా పార్టీ నేతలంతా నిజాయితీ పరులు. సత్యం జయించింది" అని వ్యాఖ్యానించారు. ఈ తీర్పుతో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కూడా సంబంధిత భారీ ఊరటనే ఇచ్చింది. ఆమెపై కూడా ఇదే కేసులో ఆరోపణలున్నాయి. నిందితురాలిగా జైలుకు కూడా వెళ్లాల్సి వచ్చింది. కానీ సాక్ష్యాలు లేవని కోర్టు అభిప్రాయం వ్యక్తం చెయ్యడంతో.. ఇప్పుడు ఆమెకు బిగ్ రిలీఫ్ లభించింది.

– కేజ్రీవాల్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఎఎంఎస్) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఆప్ చీఫ్ కేజ్రీవాల్ సహా కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. లిక్కర్ కేసులో క్లీన్ చిట్ ఇస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును వెలువరించింది. అరవింద్ కేజ్రీవాల్, సిసోడియాతో పాటు కవితకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ లిక్కర్ కేసులో ఐదు నెలల పాటు కవిత జైల్లో ఉన్నారు. అయితే వారిపై వచ్చిన అభియోగాలపై తగిన ఆధారాలు లేవని రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం పేర్కొంది. ఆధారాలు లేకుండా ఇరికించారని సీబీఐపై కోర్టు ఆగ్రహం ఆగ్రహం వ్యక్తం చేసింది. 23 మంది తప్పు చేశారని సాక్ష్యాధారాలు లేవని స్పష్టం చేసింది.

ఈ కేసులో 23 మందిని రౌస్ అవెన్యూ కోర్టు డిశ్చార్జ్ చేసింది. కుల్దీప్ సింగ్, అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కవిత కల్వకుంట్ల, నరేందర్ సింగ్, విజయ్ నాయర్, అభిషేక్ బోయినపల్లి, అరుణ్ రామచంద్ర పిళ్ళై, మూత గౌతం, సమీర్ మహేంద్రు, అమన్దీప్ సింగ్ దాల్, అర్జున్ పాండే, గోరంట్ల బుచ్చిబాబు, రాజేష్ జోషి, దామోదర్ ప్రసాద్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ కుమార్ సింగ్, చంప్రీత్ సింగ్ రాయట్, దుర్గేష్ పాఠక్, అమిత్ అరోరా, వినోద్ చౌహాన్, ఆశీష్ చాంద్ మథుర్, శరత్ చంద్రా రెడ్డిలను డిశ్చార్జి చేశారు.

మిగతా 2లో


# భాగ్యనగరానికి భారీ కేటాయింపులు?

రాష్ట్ర బడ్జెట్‌లో పెద్ద పద్దు

రూ. 4వేల కోట్లతో భారీ ప్రాజెక్టులు

గ్రేటర్ ఎన్నికల నాటికి కొత్తగా మారనున్న హైదరాబాద్ ముఖచిత్రం

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి) :** మూడు కార్పొరేషన్లు.. 300 వార్డులతో ఏర్పాటయ్యే మహా నగరంపై రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. నగరాభివృద్ధికి భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పలు కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. రాష్ట్రంలో కొన్ని హామీల అమలుతో పాటు అభివృద్ధిపై సత్వర నిర్ణయాలు తీసుకుంటున్న రేవంత్ రెడ్డి.. తాజాగా హైదరాబాద్ మహానగరంలో ఉన్న మూసీ నది పరీవాహక ప్రాంతాన్ని పర్యాటకులను ఆకర్షించే విధంగా చేయాలనే నిర్ణయించింది. డిసైడ్ అయ్యారు. తొలి ప్రాధాన్యతగా మూసీ నది పరీవాహక ప్రాంతాన్ని ఉపాధి, ఆర్థికాభివృద్ధి మండలంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. మూసీ వెంట బ్రిడ్జిలు, కమర్షియల్, షాపింగ్ కాంప్లెక్సులు, అమ్యూజ్‌మెంట్ పార్కులు, హాకర్ జోన్లు, పాత్ వేలను ప్రభుత్వ, ప్రైవేటు పార్ట్నర్ షిప్ విధానంలో నిర్మించే విధంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులను కోరారు. దీంతో రానున్న గ్రేటర్ ఎన్నికల నాటికి హైదరాబాద్ ను కొత్తగా చూపించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పలు కీలక ప్రాజెక్టులను పూర్తి చేసి.. వాటిని చూపించుకుని రాబోయే రోజుల్లో హైదరాబాద్ ఎలా ఉంటుందనే కోణంలో ఓట్లు అడుగాలని ప్లాన్ చేస్తున్నారు. ఇద్దరు మంత్రులకు ప్రత్యేక బాధ్యతలు ఇచ్చినా.. సీఎం మాత్రం నిత్యం పర్యవేక్షణ చేస్తూనే ఉన్నారు.



### రహదారులకు కొత్త దశ

హైదరాబాద్ నగరాన్ని సమగ్రంగా మార్చేలా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. పలు విభాగాల్లో భారీ ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.4 వేల కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులతో నగర రూపురేఖలు మారనున్నాయి. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ప్రధాన రహదారుల సంరక్షణకు కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్‌డో దశను అమలు చేయనున్నారు. రూ.3,145 కోట్లతో 1,142 కిలోమీటర్ల మేర ప్రధాన మార్గాలను ఐదేళ్ల పాటు అభివృద్ధి చేస్తారు. దెబ్బతిన్న రోడ్లను పూర్తిగా తొలగించి కొత్తగా బీటీ, సీసీ రహదారులు వేయడం, గుంతలు లేని సాఫ్ట్ డ్రైవింగ్ అనుభూతి కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

మిగతా 2లో

## భరోసా వాయిదాలు

# రైతు కళ్లు కాయలు

- పంట పెట్టుబడి సాయం అన్నదాతల ఎదురుచూపులు
- సాయం కోసం 67 లక్షల మంది రైతుల నిరీక్షణ
- డిజిటల్ మ్యాపింగ్, శాటిలైట్ ఇమేజ్ చిక్కుల్లో సర్కార్
- రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిన వరినాట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో రైతు భరోసా పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. పంట పెట్టుబడి సాయం ఎప్పుడు అందుతుందోనని రైతులు... నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వలేని స్థితిలో వ్యవసాయ అధికారులు కొట్టిమిట్టాడుతున్నారు. ఇప్పటికే దాదాపు రాష్ట్రమంతా వరి నాట్ల పనులు పూర్తయ్యాయి. విత్తనాలు, నాట్లు, పురుగుమందులు, ఎరువుల కోసం రైతులు సొంత డబ్బుల్ని వాడుకున్నారు. కొందరు పంట పెట్టుబడిని అప్పుల ద్వారా సమకూర్చుకున్నారు. ప్రభుత్వం విడుదల చేస్తే ఆ డబ్బును అప్పులు తీర్చుకోవచ్చని భావిస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ప్రకటన రాకపోవడంతో డైలమాలో పడ్డారు. సంక్రాంతి గిఫ్టుగా అందుతుందని తొలుత లీకులు వచ్చాయి. ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలు పూర్తికాగానే అందుతాయన్న వార్తలు వెలువడ్డాయి. కానీ అది 'అందని ద్రాక్ష'గానే మిగిలిపోయింది. తాజాగా మూడు రోజుల క్రితం జరిగిన కేబినెట్ భేటీలో రైతు భరోసా అంశం ప్రధాన ఎజెండా ఉంటుందని అందరూ భావించారు. కానీ మిగిలిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన మంత్రివర్గం... పెట్టుబడి సాయం నిధుల అంశాన్ని విస్మరించింది. దీంతో అసలు రైతు భరోసా నిధులు ఎప్పుడు విడుదల చేస్తారోననే ఆందోళన అన్నదాతల్లో మొదలైంది.



### డిజిటల్ మ్యాపింగ్, శాటిలైట్ ఇమేజ్ చిక్కులు

సాగులో ఉన్న భూములకే రైతు భరోసా సాయాన్ని అందించేందుకు సర్కార్ వ్యూహాత్మకంగా ముందుకువెళ్తున్నది.

మిగతా 2లో

# మళ్లీ పెడదోవ పట్టొద్దు

- జనజీవన స్రవంతిలోకి వచ్చి ఏదైనా చేసుకోండి
- ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది
- శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించం
- ఇల్లు, ఉద్యోగం, జీవనభృతిపై ఆలోచన చేస్తాం
- మీ లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తా

'మావో' అగ్రనేతలతో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి)** మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చిన తర్వాత చట్ట పరిధిలో ఏ పనైనా చేసుకోవచ్చని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కానీ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే.. ఇతర వర్గాలను భయభ్రాంతులకు గురి చేస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తే మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని మందలించారు. ఏళ్ల క్రితం అడవిబాట పట్టి వివిధ కారణాలతో ఇటీవల లొంగిపోయిన మావోయిస్టులకు సంబంధించి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేస్తానని చెప్పారు. ఇటీవల తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ముందు లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు తిప్పిరి తిరుపతి (@దేవ్ జీ), మల్ల రాజిరెడ్డి( @సంగ్రామ్), పుల్లూరి ప్రసాదరావు( @చంద్రన్న), పోతుల కల్పన(@సుజాత), బడే చొక్కారావు (@దామోదర్), నూనె నర్సింహా రెడ్డి (@గంగన్న) శుక్రవారం సచివాలయంలో సీఎంతో భేటీ అయ్యారు. దాదాపు గంటన్నరకు పైగా సుదీర్ఘంగా వారితో చర్చించిన సీఎం రేవంత్ రెడ్డి కీలక అంశాలు చర్చించారు.

మిగతా 2లో

## హోటళ్లకు రేటింగ్స్ సర్టిఫికేషన్

వంట గదుల్లో సిసి కెమెరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం



2

# కెనడా ప్రధాని భారత పర్యటన



**ముంబై, ఫిబ్రవరి 27 (వుదయం) :** కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ శుక్రవారం ముంబై చేరుకుని, మార్చి 2 వరకు కొనసాగే భారతదేశ అధికారిక పర్యటనను ప్రారంభించారు. భారత్‌కు ఇది కార్నీ మొదటి అధికారిక పర్యటన. అమెరికాతో దెబ్బతిన్న సంబంధాల ప్రభావాన్ని ఎదుర్కోవడం, భారత్, చైనా, మధ్యప్రాచ్యంలోని దేశాలతో సంబంధాలను మరింతగా పెంచుకోవడం కెనడా లక్ష్యం. కనుక, ద్వైపాక్షిక సంబంధాలను పునర్నిర్మించుకోవడం, వాణిజ్యాన్ని పెంచుకోవడం కార్నీ పర్యటన లక్ష్యం. ఆయన సోమవారం న్యూఢిల్లీకి వెళ్లే ముందు వ్యాపార నాయకులతో సంభాషించనున్నారు, న్యూఢిల్లీలో ఆయన ప్రధాని నరేంద్ర మోడీని కలవనున్నారు. కెనడా పౌరుడి హత్యలో భారతదేశ ప్రమేయం ఉందని

మిగతా 2లో

## విడాకులకు పిటిషన్ దాఖలు చేసిన టివికె అధినేత విజయ్ భార్య సంగీత స్వర్ణలింగం



2

## ఉద్యోగుల పెండింగ్ బిల్లుల విడుదల

రూ. 745 కోట్లు రిలీజ్ చేసిన ప్రభుత్వం






## డిఎంకెలో చేరిన జయలలిత విధేయుడు మాజీ సిఎం పన్నీరు సెల్వం

**చెన్నై, ఫిబ్రవరి 27 (వుదయం) :** తమిళనాడు రాజకీయాలలో చోటు చేసుకున్న ఒక ముఖ్యమైన రాజకీయ పరిణామంలో, మాజీ ముఖ్యమంత్రి ఒ. పన్నీర్‌సెల్వం (ఒపిఎస్) శుక్రవారం పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో అధికారికంగా ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె)లో చేరారు. ఈ చర్య రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక ప్రధాన మలుపుగా మారుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

మిగతా 2లో

## రేపటి నుంచి వాట్సాప్, టెలిగ్రామ్ లకు కొత్త నియమాలు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (వుదయం బ్యూరో) :** మార్చి 1 నుండి, సిమ్ బైండింగ్ అనే కొత్త నియంత్రణ అవసరం కారణంగా భారతదేశంలోని వినియోగదారులకు వాట్సాప్, టెలిగ్రామ్ వంటి మెసేజింగ్ యాప్‌లను మునుపటిలాగా అందుబాటులోకి రావు. టెలికమ్యూనికేషన్స్ విభాగం (డిఒటి) జారీ చేసిన ఆదేశాల ప్రకారం, మొబైల్నం బర్ తాలూకు సిమ్ కార్డ్ భౌతికంగా ఉండి, పరికరంలో యాక్టివ్‌గా ఉంటేనే కమ్యూనికేషన్ వేదికలు పనిచేస్తాయి. సిమ్ తొలగించినప్పటికీ లింక్ చేసిన పరికరాల్లో యాప్‌లు పనిచేస్తూనే ఉండే ప్రస్తుత వ్యవస్థ నుండి ఇది ఒక పదునైన మార్పును సూచిస్తుంది. సైబర్ భద్రతను బలోపేతం చేయడం, మోసాలను నిరోధించడం ఈ చర్య లక్ష్యం అని ప్రభుత్వం చెబుతోంది. కొత్త నియమం గురించి వినియోగదారులు ఏం అర్థం చేసుకోవాలి? కొత్త చట్రం కింద, ఖాతాను నమోదు చేయడానికి ఉపయోగించిన సిమ్ హ్యాండ్ సెట్‌లో చొప్పించబడిందో లేదో మెసేజింగ్ అప్లికేషన్‌లు నిరంతరం ధృవీకరించాల్సి ఉంటుంది.

మిగతా 2లో

## కోల్‌కతాలో భారీ భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 5.5 తీవ్రత నమోదు

పరుగులు పెట్టిన ప్రజలు

**కోల్‌కతా, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి) :** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో భారీ భూకంపం సంభవించింది. శుక్రవారం మధ్యాహ్నం 1:22 గంటల సమయంలో రిక్టర్ స్కేల్‌పై 5.5 తీవ్రత నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (ఎన్‌సీఎస్) తెలిపింది. భూకంప కేంద్రం బంగ్లాదేశ్‌లో ఉన్నట్లు పేర్కొంది. పది కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు వెల్లడించింది. భారత్–



బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలోని పలు జిల్లాలపై భూకంపం ప్రభావం ఉన్నట్లు వివరించింది.కాగా, కోల్‌కతాలోని పలు ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించాయి. పలు ఇళ్లల్లోని సామాన్లు, ఫ్యానులు ఊగిపోయాయి. భయాందోళన చెందిన జనం ఇళ్లు, భవనాలు, కార్యాలయల నుంచి బయటకు పరుగులుతీశారు. కోల్‌కతాలో భూకంపం వల్ల ఎంత నష్టం జరిగింది అన్నది ఇంకా తెలియలేదు. ఈ భూకంపానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## చిలుకూరు ప్రధాన అర్చకులు సౌందర రాజన్ మృతి



**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఎఎంఎస్) :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఉన్న చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సౌందర రాజన్ శుక్రవారం పరమపదించారు.ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్టర్ గా పదవి విరమణ పొందిన తరువాత ఆలయంలో ఉంటూ ఆలయ అభివృద్ధికి కృషి చేసిన ఆయన చిలుకూరు బాలాజీ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. వీసాల దేవుడిగా నామకరణం వచ్చే విధంగా కృషి చేశారు. సౌందర రాజన్ మృతితో ఈరోజు, రేపు రెండు రోజులు ఆలయాన్ని మూసి వేసే అవకాశం ఉందని తెలిసింది .

వుదయం www.voodayam.com

# ఉద్యోగుల పెండింగ్ బిల్లుల విడుదల

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి) :** ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను ప్రజా ప్రభుత్వం ఒక్కొక్కటీగా అమలు చేస్తోంది. ప్రధానంగా ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు సర్కార్ గ్రీన్ ఛానల్ లో నిధులను విడుదల చేస్తున్నది. తాజాగా ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం రూ.745 కోట్లు విడుదల చేసింది. ఫిబ్రవరి మాసానికి సంబంధించిన బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు శుక్రవారం నిధులు విడుదల చేశారు. ఉద్యోగులకు ప్రతినెల రూ. 700 కోట్లకు తగ్గకుండా పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. అ హామీ మేరకు గత జూన్ నెలాఖరులో రూ .183 కోట్లు విడుదల చేసింది. గత సంవత్సరం ఆగస్టు నుంచి ప్రతి నెల కనీసంగా రూ .700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది. విడుదలైన బిల్లులో గ్రాట్యూటీ, జీపిఎఫ్, సరెండర్ లీవ్, అడ్వాన్సులు ఉన్నాయి.

**గ్రామపంచాయతీలకు రూ. 389 కోట్లు విడుదల...**

గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త వెల్లడించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్థిక శాఖ అధికారులు రూ. 389 కోట్లు విడుదల చేశారు.

# హోటళ్లకు రేటింగ్స్.. సర్టిఫికేషన్

మున్సిపల్ సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ నిర్దేశం
హోటళ్లలోని వంటగదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు
వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు
అనుసంధానం చేయాలి
తనిఖీల కోసం ప్రత్యేక మానిటరింగ్ వింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి) :**

హైదరాబాద్ కోర్ రీజియన్ పరిధిలోని హోటళ్లలోని వంటగదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. హోటల్స్‌కు రేటింగ్, సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని పరిశీలించాలన్న ఆయన ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్డ్ ఎక్విప్ మెంట్ వినియోగించాలని ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం సచివాలయంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. శానిటేషన్, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్న సీఎం.. మున్సిపల్ అధికారులు మార్క్ చేసిన చోటనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించాలన్నారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న అన్ని స్ట్రీట్ లైట్స్‌కు ప్రత్యేక నెంబర్ ఇచ్చి డ్యాష్ బోర్డుకు కనెక్ట్ చేయాలన్నారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యూర్ పరిధిలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నగరంలోని సిగ్నల్ జంక్షన్స్, సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలన్నారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# ఆధారాలు లేవు క్లీన్ చిట్

మొదటి పేజీ తరువాయి..

ఢిల్లీ లిక్కర్ స్కాం (ఎక్సైజ్ పాలసీ కేసు)లో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా సహా అందరు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికీ భారీ ఊరట లభించింది. శుక్రవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు స్పెషల్ జడ్జి జితేంద్ర సింగ్ ముఖ్యమైన తీర్పు వెలువరించారు. ఈ కారణంగా.. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కూడా ఈ కేసులో బిగ్ రిలీఫ్ లభించింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ సీబీఐ నిర్లక్ష్యాన్ని కోర్టు స్పష్టంగా చెప్పింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్ షీట్‌లో మెరిట్ లేదు, ఆరోపణలకు సరైన సాక్ష్యాలు లేవు, కుట్ర ఆధారాలు ఏమీ లేవు అని కోర్టు చెప్పింది. ఛార్జ్ షీట్ వాల్యూమినస్ (పెద్దది) అయినా అందులో అనేక లోపాలు, గ్యాప్స్ ఉన్నాయని, సాక్షుల స్టేట్‌మెంట్లు లేదా ఇతర సబ్‌స్టాంషియల్ ఎవిడెన్స్ లేకుండా ఆరోపణలు చేశారని కోర్టు తీవ్రంగా విమర్శించింది. దీంతో ప్రైమా ఫేసి కేసు కూడా లేదని తేల్చి చెప్పి, కేజ్రీవాల్, సిసోడియా సహా మొత్తం 23 మంది ఆరోపితులను డిస్‌చార్జ్ (విముక్తి) చేసింది.

**ఈ కేసు ఏంటి..?**

2021–22 ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలో అక్రమాలు, దక్షిణ లాబీ నుంచి రూ.100 కోట్ల కిక్‌బ్యాక్‌లు తీసుకుని కొన్ని సంస్థలకు లాభాలు ఇచ్చారని సీబీఐ ఆరోపించింది. ఏఏపీ నేతలు దీనికి కుట్రలో ఉన్నారని చెప్పింది. కానీ కోర్టు ఆరోపణలను సపోర్ట్ చేసే ఎలాంటి మెటీరియల్ లేదని స్పష్టం చేసింది. తీర్పు వచ్చిన వెంటనే కేజ్రీవాల్ కన్నీళ్లు పెట్టుకున్నారు. భావోద్వేగం చెందిన కేజ్రీవాల్ "నాపై తప్పుడు ఆరోపణలు పెట్టారు. మోదీ, అమిత్ షా కలిసి కుట్ర చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేసేందుకు కేంద్రం ప్రయత్నించింది. నేను, సిసోడియా, మా పార్టీ నేతలంతా నిజాయితీ పరులు. సత్యం జయించింది" అని వ్యాఖ్యానించారు. ఈ తీర్పుతో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కూడా సంబంధిత భారీ ఊరటనే ఇచ్చింది. ఆమెపై కూడా ఇదే కేసులో ఆరోపణలున్నాయి. నిందితురాలిగా జైలుకు కూడా వెళ్లాల్సి వచ్చింది. కానీ సాక్ష్యాలు లేవని కోర్టు అభిప్రాయం వ్యక్తం చెయ్యడంతో.. ఇప్పుడు ఆమెకు బిగ్ రిలీఫ్ లభించింది.

# మళ్లీ పెడదోవ పట్టొద్దు

మొదటి పేజీ తరువాయి..

రాజకీయ ఎజెండాపైన మాజీ మావోయిస్టులు చర్చలు జరిపారు. తాము జనజీవన స్రవంతిలో వచ్చేందుకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి, ఐజీ సుమతిలకు దేవ్‌జీ.. కృతజ్ఞతలు చెప్పారు. భేటీకి ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సరెండర్ పాలన బాగుందని ప్రశంసలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే.. జైళ్లలో ఉన్న మావోయిస్టులను కలుస్తామని.. ఆ తర్వాత లొంగుబాట్లపై అందరం కలిసి తెలంగాణ ప్రజలకు బహిరంగ లేఖ రాస్తామని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ సిద్ధాంతం సరైన దారి కాదని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. అయితే లొంగిపోయిన మావోయిస్టులకు ఇచ్చే రివార్డ్ పాలసీని రూ.కోటికి పెంచాలని కోరినట్లు తెలిపారు. అంతేకాకుండా 5 ఎకరాల స్థలం కూడా ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. కానీ ఐదెకరాలు ఇవ్వడం సాధ్యం కాదని ప్రభుత్వం చెప్పినట్లు పేర్కొన్నారు. అదే సమయంలో లొంగిపోయిన వారికి.. ఇల్లు, ఉద్యోగం, జీవనభృతిపై సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని దేవ్‌జీ తెలిపారు. కాగా మార్చి 31వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా మావోయిస్టులను లేకుండా చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టి.. అడవుల్లోని మావోయిస్ట్‌లను ఏరివేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే మావోయిస్ట్ ప్రభావిత రాష్ట్రాలు కూడా నక్సల్స్‌ను లొంగిపోవాలని సూచిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఇటీవల చాలా మంది మావోయిస్ట్‌లు.. తెలంగాణ ప్రభుత్వం ముందు లొంగిపోయారు. ఇందులో మావోయిస్ట్ పార్టీ మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ , నూనె నరసింహారెడ్డి, మల్లా రాజిరెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు ఉన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు, వేం నరేందర్ రెడ్డి.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఐజీ సుమతి పాల్గొన్నారు.

# విడాకులకు దాఖలు చేసిన టివికె అధినేత విజయ్ భార్య



**చెన్నై, ఫిబ్రవరి 27 (వుదయం) :** పాతికేళ్లకు పైగా వైవాహిక జీవితం తర్వాత, నటుడు విజయ్ భార్య సంగీత సోర్నలింగం విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. ప్రముఖ ఛానెల్ ఇండియా టుడే ప్రకారం, ప్రత్యేక వివాహ చట్టం, 1954లోని నిర్దిష్ట నిబంధనలపై చట్టపరమైన చర్యలు ఆధారపడి ఉంటాయి. ఈ చట్టం వివాహేతర సంబంధాలు, క్రూరత్వం వంటి కారణాల వల్ల జీవిత భాగస్వామి నుంచి విడాకులు కోరేందుకు ఈ చట్టం అనుమతిస్తుంది.

విడాకులకు దరఖాస్తు చేసిన విజయ్ భార్య సంగీత సోర్నలింగం పిటిషన్ ప్రకారం, విజయ్ ఒక మహిళా నటితో వివాహేతర సంబంధంలో ఉన్నాడని సంగీత ఆరోపించింది. 2021లో, విజయ్ ఒక నటితో వివాహేతర సంబంధంలో ఉన్నాడని సంగీత కనుగొన్నట్లు పిటిషన్ పేర్కొంది. ఆ సంబంధం కొనసాగదని విజయ్ హామీ ఇచ్చిన తర్వాత కూడా అది ఎటువంటి పశ్చాత్తాపం లేకుండా కొనసాగిందని కూడా పిటిషన్ పేర్కొంది.

ప్రత్యేక వివాహ చట్టంలోని సెక్షన్ 27(1)(ఎ) - 27(1)(డి) కింద వివరించిన విధంగా, సంగీత విడాకులు కోరిన కారణాలకు ఇవి ముఖ్యమైనవిగా మారాయి. జీవిత భాగస్వామి వివాహేతర సంబంధం కలిగి ఉన్నట్టు లేదా మోసం చేసినట్లు లేదా మరొక భార్యతో క్రూరంగా ప్రవర్తించినట్లు తేలితే ఈ చట్టం విడాకులకు అనుమతిస్తుంది. కొనసాగుతున్న విచారణలో ఆమె పిటిషన్ ఈ చట్టపరమైన కారణాలను ఉదహరించింది. ఈ విషయం ప్రస్తుతం జిల్లా కోర్టు ముందు ఉంది. తీర్పు ఇంకా వెలువడలేదు. విజయ్ కుటుంబం గురించి సంగీత, విజయ్ ఆగస్టు 1999లో వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు– జేసన్ సంజయ్, దివ్య షాషా. వారు అప్పట్లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాలు రెండింటి ప్రకారం వివాహం చేసుకున్నారు, అతని భార్య అతనితో అరుదుగా కొన్ని కార్యక్రమాలలో కనిపించేది. విజయ్, అతని కొత్త సినిమా గురించి మరిన్ని వివరాలు అతడి చివరి సినిమా జన నాయగన్ విడుదలపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఈ అంశం బయటకు వచ్చింది. ఈ సినిమా చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. జన నాయగన్ ముందుగా జనవరి 9న థియేటర్లలోకి రావాల్సి ఉంది.

ఈ ఏడాది తమిళనాడు ఎన్నికల్లో తన తమిళగ వెట్రీ కజగం (టీవీకే) పార్టీతో పోటీ చేసే ముందు దీనిని విజయ్ చివరి సినిమాగా భావించారు. అయితే, ఈ సినిమా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)వద్ద సర్టిఫికేషన్ చిక్కుల్లో ఇరుక్కుంది. ఈ నెల ప్రారంభంలో, చెన్నైలో జరిగిన వైఎస్ సునీల్ రెడ్డి కుమారుడు సాహిల్, వేదిక వివాహానికి ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో, ఆయన వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో కలిసి కనిపించారు.

# రైతు కళ్లు కాయలు

మొదటి పేజీ తరువాయి..

ఇందులో భాగంగా రెండు నెలల క్రితమే సాగులో ఉన్న భూముల లెక్క తేల్చే పని మొదలుపెట్టింది. ఇందుకోసం శాటిలైట్ ఇమేజ్, డిజిటల్ మ్యాపింగ్ పద్ధతులను ఎంచుకున్నది. సమగ్రమైన డేటాను వ్యవసాయ శాఖకు అందిస్తే దానికి అనుగుణంగా రైతుభరోసా నిధులు విడుదల చేస్తుంది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం భూముల 'డిజిటల్ సర్వే' ప్రక్రియ చేపట్టాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఒకటిన్నర నెల రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తికావాలని స్పష్టత ఇచ్చింది. ఒకవైపు డిజిటల్ సర్వే మరోవైపు శాటిలైట్ ఇమేజెస్, మ్యాపింగ్ కారణంగా సాగుభూముల లెక్క అగమ్యగోచరంగా మారింది. 'సాగులో ఉన్న భూములకే' రైతు భరోసా సాయం అని ప్రభుత్వం నిబంధన పెట్టిన కారణంగా లెక్కలు తేలేదెన్నడో..సాయం అందేదెన్నడో.. అనే అసంతృప్తి రైతుల్లో వ్యక్తమవుతున్నది. మరోవైపు.. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి 'డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రాం' కింద దేశంలో అన్ని రాష్ట్రాల్లో భూముల డిజిటల్ సర్వే జరగాల్సి ఉందన్నారు. ఇప్పటికే యూపీ, బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఈ సర్వే పూర్తయిందన్న ఆయన తెలంగాణలోనూ వీలైనంత తొందరగా పూర్తిచేయాలన్నారు. అయితే రాష్ట్రంలో దాదాపు కోటిన్నర ఎకరాల మేర సాగుభూములున్నాయి. కేంద్రం సూచన ప్రకారం 45 రోజుల్లో పూర్తి చేయడం సాధ్యమేనా అనే అనుమానాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు వ్యక్తం చేశారు. భూముల సర్వే కోసం రెవెన్యూ సిబ్బందితో పాటు సర్వేయర్ల కొరత సర్కారును వెంటాడుతోంది. క్షేత్రస్థాయిలో కేవలం 3, 800 మంది మాత్రమే వ్యవసాయ విస్తరణ అధికారులున్నారు. ఇందులో 1800 మంది మహిళలు. రాష్ట్రంలోని 10,877 గ్రామాలను ఒక్కో అగ్రికల్చర్ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ పర్యవేక్షిస్తున్నారు. అయినా మరో 7,077 గ్రామాలు మిగులుతాయి.

**ఖజానాలో కాసుల కటకట..**

భూముల డిజిటల్ సర్వే పూర్తి చేయాలంటే 45 రోజులు అవసరమనే ప్రాక్టికల్ ఇబ్బంది ఒకవైపు.. సాగుభూముల్ని గుర్తించడానికి శాటిలైట్ ఇమేజెస్ తప్పనిసరి అనే నిబంధన మరోవైపు.. వీటన్నింటి కారణంగా రైతుభరోసా సాయం ఎప్పుడనేది అధికారులకు సైతం స్పష్టత లేకుండాపోయింది. ప్రభుత్వం వద్ద నిధులలేమితో తాత్సారం చేస్తున్నదనే విమర్శలూ లేకపోలేదు. గత సీజన్‌కు తొమ్మిది రోజుల్లోనే సుమారు 67 లక్షల మంది రైతులకు రూ. 8,284 కోట్ల మేర నిధులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. సుమారు 1.38 కోట్ల ఎకరాలకు ఈ సాయం అందింది. ఈసారి 'సాగుభూములకే' అనే షరతు పెట్టడంతో ఆ లెక్క తేలేదాకా నిధుల విడుదల సాధ్యం కాకపోవచ్చు. ఆ గణాంకాలు వచ్చేంతవరకు ఎంతమంది లబ్ధిదారులు, ఎన్ని ఎకరాల భూమికి, ఎంత మొత్తం అనే అంశాలపై స్పష్టత రాకపోవచ్చు. గత సీజన్‌లో ఇచ్చినట్లుగానే ఈసారి కూడా ఎలాంటి షరతుల్లేకుండా ఇవ్వాలని రైతు సంఘాలు ప్రభుత్వానికి ఇప్పటికే విజ్ఞప్తి చేశాయి.

## నిధులు విడుదల చేయకపోతే ఆందోళనలు : కేంద్రమంత్రి బండి సంజయ్



ఎన్నికల ముందు హామీలు ఇచ్చి వాటిని ఎగ్గొట్టడంలో సీఎం రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌ను మించిపోయారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు హామీలివ్వడం.. తర్వాత మాట తప్పడం కాంగ్రెస్ నేతలకు వెన్నతో పెట్టిన విద్య విమర్శించారు. యాసంగి మొదలై రెండు నెలలు గడిచినా రైతు భరోసా నిధులు జమ చేయకపోవడమేంటని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం కరీంనగర్ లో మీడియాతో మాట్లాడిన తర్వాత... సీఎం రేవంత్ కు సంజయ్ బహిరంగ లేఖ రాశారు. ఇందులో కీలక అంశాలు ప్రస్తావించారు.

రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికలు అయిన వెంటనే వేస్తామని ఫిబ్రవరి 4న మిర్యాలగూడ సభలో మీరే ప్రకటించారు. మీరిచ్చిన మాటను మీరే విస్మరిస్తే ఎలా? అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 67 లక్షల మందికి పైగా రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. మూడో విడతతో కలిపి రూ.27 వేల కోట్ల బకాయిలివ్వాలన్నారు.

9 రోజుల్లో రూ.9వేల కోట్లు వేశామని గత 9 నెలలుగా ప్రగల్భాలు చెప్పుకోవడం తప్ప రైతులకు ఒరగబెట్టిందేంటి? అని చురకలంటించారు. తక్షణమే రైతు భరోసా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# డిఎంకెలో చేరిన జయలలిత విధేయుడు మాజీ సిఎం పన్నీరు సెల్వం



మొదటి పేజీ తరువాయి..

తన కుమారుడు, మద్దతుదారులతో కలిసి అన్నా అరివాలయం చేరుకున్న ఒపిఎస్, అక్కడ డీఎంకే సభ్యత్వ పత్రంపై సంతకం చేసి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలిశారు. స్టాలిన్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. దశాబ్దాల తన రాజకీయ జీవితంలో, అన్నాడీఎంకేలో బ్రాంచ్ సెక్రటరీ నుండి కోఆర్డినేటర్ వరకు ప్రతి పదవిని నిర్వహించిన నాయకుడి అధికారిక ప్రవేశాన్నిసూచిస్తూ, స్టాలిన్ ఆయనకు డీఎంకే జెండాను బహూకరించారు.

**దక్షిణ జిల్లాలకు వ్యూహాత్మక ప్రాముఖ్యత...**

ముఖ్యంగా ముక్కులథోర్ సమాజం గణనీయమైన ఉనికిని కలిగి ఉన్న దక్షిణ జిల్లాల్లో, డిఎంకె లోకి ఒపిఎస్ ప్రవేశం అపారమైన వ్యూహాత్మక విలువను కలిగి ఉందని రాజకీయ క్రియాశీలత గురించి తెలిసిన వారు అంటున్నారు. ఒపిఎస్ ఈ సమాజానికి ప్రతినిధిగా విస్తృతంగా కనిపిస్తారు, డిఎంకెతో ఆయన పొత్తు ఈ ప్రాంతంలో పార్టీ మద్దతును బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. దక్షిణాదిలోని మధురై, రామనాథపురం, తిరునల్వేలి, తేని, శివగంగ, విరుదునగర్, పరమకుడి వంటి అనేక జిల్లాల్లో ముక్కులథోర్ సమాజం గణనీయమైన జనాభాను కలిగి ఉంది. కన్యాకుమారి మినహా, ఈ ప్రాంతాలలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని 40 ఏళ్లు పైబడిన ఓటర్లలో ఒపిఎస్‌కి గణనీయమైన మద్దతు ఉంది.

**లోక్‌సభ ఎన్నికల నుంచి పాఠాలు...**

గత లోక్‌సభ ఎన్నికల్లో ముక్కులథోర్ సమాజపు ఓట్లను కూడగట్టుకోవడానికి ఒపిఎస్, టిటివి దినకరన్ ఇద్దరినీ బిజెపి తన వైపుకు తిప్పుకునప్పుడు ఒపిఎస్‌కున్న ప్రాముఖ్యత స్పష్టంగా కనిపించింది. ఈ వ్యూహం దక్షిణ జిల్లాల్లో ఎఐఎడిఎంకెని మూడవ స్థానానికి నెట్టివేసింది. మధురై, తేని, తిరునల్వేలి, కన్యాకుమారి మరియు రామనాథపురం వంటి జిల్లాల్లో బిజెపి రెండవ స్థానాన్ని దక్కించుకుంది. బిజెపి కోసం ప్రతి జిల్లాలోనూ ఒపిఎస్ విస్తృతంగా ప్రచారం చేశారు. పార్టీ ఆ ప్రాంతంలో ఆ మాత్రం రాణించడానికి కీలక అంశంగా ఆయన మారారు. సమాజ మద్దతును సమీకరించడంలో ఆయన సామర్థ్యం ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది.

**ప్రస్తుత రాజకీయ లెక్కలు...**

అసెంబ్లీ ఎన్నికలు కొన్ని నెలల దూరంలో ఉన్నందున, దక్షిణ తమిళనాడులో రాజకీయ దృశ్యం వేగంగా పునర్వ్యవస్థీకరణకు గురవుతోంది. ముక్కులథోర్ ఓట్లను ఏకీకృతం చేయడానికి ఎఐఎడిఎంకె నాయకుడు ఎడప్పాడి కె. పళనిస్వామి ఇటీవల టిటివి దినకరన్‌ను కూటమిలో చేర్చుకోవడానికి అంగీకరించారు. అయితే, ఒపిఎస్ డిఎంకెలోకి వెళ్లడం ఇప్పుడు అధికార పార్టీకి సమాజంలో బలాన్ని ఇస్తుంది. అదనంగా, శశికళ పార్టీ ఇప్పటికే పళనిస్వామికి వ్యతిరేకంగా మారింది, ఇది దక్షిణ ప్రాంతంలో ఎన్నికల గణితాన్ని మరింత క్లిష్టతరం చేయనుంది.
సమయం, ఎన్నికల ప్రభావం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్చి 1న మధురై పర్యటనకు రెండు రోజుల ముందు ఒపిఎస్ చేరిక సమయం చాలా కీలకమైంది. మధురై జిల్లాలో ముక్కులథోర్ జనాభా గణనీయంగా ఉంది. రాజకీయ విశ్లేషకులు డిఎంకెలో ఒపిఎస్ ఉనికి అధికార పార్టీ వైపు ఆ సమాజం మద్దతును మళ్లించడానికి సహాయపడుతుందని, మోడీ పర్యటన నుంచి బిజెపి– ఎఐఎడిఎంకె కూటమి పొందాలని ఆశిస్తున్న ప్రయోజనాన్ని తటస్థీకరించవచ్చని భావిస్తున్నారు. ఒపిఎస్ ఇప్పుడు డిఎంకె వర్గంలో ఉండటంతో, అధికార పార్టీ దక్షిణ జిల్లాల్లో తన స్థానాన్ని బలోపేతం చేసుకున్నట్లు కనిపిస్తోంది, సమాజ సమీకరణాలు నిర్ణయాత్మక పాత్ర పోషించగల తీవ్రమైన ఎన్నికల పోటీకి వేదికను సిద్ధం చేసింది.






# తెలంగాణ సాంస్కృతికంగా బలపడాలి

- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- సాంస్కృతిక అవగాహన లేనిదే సమాజం అభివృద్ధి సాధ్యం కాదు
- సంప్రదాయ కళలపై ఆసక్తి, కళాకారులకు గౌరవం భేష్
- ఘనంగా 'జీఐ ఆన్ వీల్స్' కార్యక్రమం ప్రారంభోత్సవం

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి) :**

తెలంగాణ యువ రాష్ట్రంగా సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేసుకోవడం అవసరమని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ వెల్లడించారు. సంస్కృతి సమాజానికి ఆత్మస్వరూపం అన్న ఆయన సాంస్కృతిక అవగాహన లేకుండా సమాజం అభివృద్ధి సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో సంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచడంతో పాటు కళాకారులకు గౌరవాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా 'జీఐ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని గవర్నర్ శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడారు. జీఐ గుర్తింపు పొందిన కళారూపాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జీఐ ఉత్పత్తుల ప్రాచుర్యం, మార్కెటింగ్, విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ఈ చర్యల ద్వారా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని వివరించారు.

## రేపటి నుంచి వాట్సాప్, టెలిగ్రామ్‌లకు
# కొత్త నియమాలు

మొదటి పేజీ తరువాయి..

సిమ్ తీసివేసినా, మార్చినా లేదా నిష్క్రియంగా మారినా, అసలు సిమ్‌ను తిరిగి చొప్పించి ప్రామాణీకరించే వరకు ఖాతా పనిచేయడం ఆగిపోవచ్చు. అతిపెద్ద మార్పులలో ఒకటి లింక్ చేసిన పరికరాలను ప్రభావితం చేస్తుంది. వెబ్, డెస్క్‌టాప్ యాక్సెస్ వంటి లక్షణాలు వినియోగదారులను క్రమానుగతంగా లాగ్ అవుట్ చేయగలవు, క్యూఆర్ కోడ్‌లు లేదా ఒటిపి ప్రామాణీకరణ ద్వారా తాజా ధృవీకరణ అవసరం. ఆఫీస్ సిస్టమ్‌లు, హోమ్ ల్యాప్‌టాప్‌లతో సహా బహుళ పరికరాల్లో ఒకే ఖాతాపై ఆధారపడే వినియోగదారులకు, ఇది రోజువారీ వినియోగాన్ని గణనీయంగా మార్చగలదు. భద్రత మొదట అంటున్న ప్రభుత్వం, అంతరాయాన్నిపట్టి చూపుతున్న పరిశ్రమ నిష్క్రియాత్మక లేదా మోసపూరితంగా పొందిన మొబైల్ నంబర్‌లతో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలను అరికట్టడానికి ఈ చర్య రూపొందించినట్టు డిఓటి చెప్తోంది. ఖాతాలను యాక్టివ్ సిమ్‌కు ఖచ్చితంగా ముడిపెట్టడం ద్వారా, అధికారులు ట్రేసబిలిటీని మెరుగుపరచడం, కమ్యూనికేషన్ వేదికల దుర్వినియోగాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. గడువు స్థిరంగా ఉందని, ప్రస్తుతం పొడిగింపు పరిశీలనలో లేదని అధికారులు సంకేతాలిచ్చారు. అయితే, పరిశ్రమ వాటాదారులు, డిజిటల్ హక్కుల పరిశీలకులు కార్యాచరణ సవాళ్ల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. తరచుగా ప్రయాణించేవారు, సిమ్ కార్డులను మార్చుకునే వినియోగదారులు, బహుళ పరికరాల్లో ఖాతాలను నిర్వహించే చిన్న వ్యాపారాలు పదేపదే ధృవీకరణ అడ్డంకులను ఎదుర్కోవలసి రావచ్చు. భద్రతను కఠినతరం చేయడమే దీని ఉద్దేశ్యం అయినప్పటికీ, పని, కమ్యూనికేషన్ కోసం సజావుగా, బహుళ–పరికర ప్రాప్యతపై ఆధారపడే లక్షలాది మందికి ఈ నియమం అసౌకర్యాన్ని కలిగిస్తుందని విమర్శకులు వాదిస్తున్నారు.

## భాగ్యనగరానికి
# భారీ కేటాయింపులు?

మొదటి పేజీ తరువాయి..

ట్రాఫిక్ ఒత్తిడి ఎక్కువగా ఉండే కారిడార్లపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ అమలు తర్వాత ప్రయాణ సమయం తగ్గి, ఇంధన వినియోగం కూడా తగ్గే అవకాశం ఉంది.

**మంజీరా నీటి మార్గానికి పటిష్ఠ పునాది..**

1960–80 దశకాల్లో వేసిన పాత పైపులైన్లు దెబ్బతినడంతో నీటి సరఫరాలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పుడు రూ.772 కోట్లతో 1,500 మిల్లీమీటర్ల వ్యాసం గల మైల్డ్ స్టీల్ పైపులైన్ వేయనున్నారు. కలబ్‌గూర్ నుంచి హైదర్‌నగర్ వరకు ఈ లైన్ ద్వారా రోజుకు 45 ఎంజీడీల మంజీరా నీటిని పంపింగ్ చేస్తారు. పాత పైపుల వల్ల లీకేజీలు, ఒత్తిడి తగ్గడం వంటి సమస్యలు ఉండేవి. కొత్త లైన్ వల్ల నీటి నష్టం తగ్గి, సరఫరా స్థిరంగా ఉంటుంది. భవిష్యత్ జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్ట్ రూపొందించారు.

**ఉస్మాన్‌సాగర్ మార్గం పునరుద్ధరణ..**

నగర తాగునీటిలో కీలక భాగస్వామ్యంగా ఉన్న ఉస్మాన్‌సాగర్ నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ల వరకు 1920లో నిర్మించిన కాండ్యూట్ ప్రస్తుతం బలహీనంగా మారింది. రూ.280 కోట్లతో 16 కిలోమీటర్ల మేర కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తారు. గ్రావిటీ ఆధారంగా రోజుకు 25 ఎంజీడీల నీరు తరలించే సామర్థ్యం ఉన్నా, లీకేజీల కారణంగా ఇప్పుడు 19 ఎంజీడీలకే పరిమితమైంది. కొత్త వ్యవస్థతో నీటి నష్టం తగ్గి పూర్తి సామర్థ్యంతో సరఫరా జరిగేలా చేయనున్నారు. మరోవైపు కోకాపేట నియోపొలిస్ ప్రాంతంలో భారీ రిజర్వాయర్ నిర్మాణానికి రెండు ఎకరాల భూమి కేటాయించారు. ఇది నగర పశ్చిమ భాగంలో వేగంగా పెరుగుతున్న నివాస సముదాయాలకు కీలక వనరుగా మారనుంది. భవిష్యత్ పట్టణ విస్తరణను దృష్టిలో పెట్టుకుని నిల్వ సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నంగా ఈ రిజర్వాయర్ పనిచేస్తుంది. దీనితో నీటి ఒత్తిడి సమస్యలు తగ్గే అవకాశం ఉంది.

**హెచ్ఎండీఏ విస్తరణ, జంతు సంరక్షణలో ఆధునికత..**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోకి నవాబ్‌పేట, మోమిన్‌పేట మండలాల్లోని నాలుగు గ్రామాలను చేర్చాలని నిర్ణయించారు. దీనివల్ల ఆ ప్రాంతాల్లో ప్లాన్డ్ డెవలప్‌మెంట్‌కు మార్గం సుగమం అవుతుంది. రోడ్లు, నీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు వేగంగా చేరే అవకాశం ఉంది. అలాగే గోపన్‌పల్లిలో అత్యాధునిక జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. జీహెచ్ఎంసీ స్థలం అందిస్తే, రాంకీ ఫౌండేషన్ నిర్మాణ బాధ్యతలు తీసుకుంటుంది. ఆల్ ఫర్ యానిమల్స్ ఫౌండేషన్ నిర్వహణ చూస్తుంది. వీధి కుక్కలు, గాయపడిన జంతువులకు చికిత్స, సంరక్షణ అందించే విధంగా కేంద్రం రూపుదిద్దుకుంటుంది. మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అమలైతే హైదరాబాద్ మౌలిక వసతుల పరంగా మరింత బలపడుతుంది. మెరుగైన రహదారులు, నిరంతర తాగునీరు, విస్తరించిన పట్టణ పరిపాలన, జంతు సంక్షేమంపై దృష్టి అన్నీ కలిపి నగర జీవన ప్రమాణాలను పెంచనున్నాయి. పట్టణ వృద్ధికి ముందస్తు ప్రణాళికలు అమలు చేయడం ద్వారా హైదరాబాద్ వచ్చే దశాబ్దాల్లో మరింత ఆధునిక, సుస్థిర మహానగరంగా రూపాంతరం చెందే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## కెనడా ప్రధాని
# భారత పర్యటన

మొదటి పేజీ తరువాయి..

మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించిన తర్వాత భారత్, కెనడా మధ్య సంబంధాలు ఇటీవలి సంవత్సరాలలో క్షీణించాయి. ఈ ఆరోపణలను న్యూఢిల్లీ పదే పదే ఖండించింది. ట్రూడో మాదిరిగా కాకుండా, కార్నీ పంజాబ్‌ను సందర్శించరు. ఇది సిక్కు వేర్పాటువాద రాజకీయాలతో దగ్గరి సంబంధం ఉన్న ప్రాంతం. విశ్లేషకులు దీనిని భారత ప్రభుత్వంతో ఘర్షణను నివారించడానికి చేపట్టిన ఒక చర్యగా భావిస్తున్నారని రాయిటర్స్ నివేదిక తెలిపింది. కార్నీ పద్ధతి మరింత ఆచరణాత్మక విదేశాంగ విధానాన్ని ప్రతిబింబిస్తోందని నిపుణులు అన్నారు. డోనాల్డ్ ట్రంప్ సుంకాలు, విలీన బెదిరింపుల సమయంలో వాషింగ్టన్‌తో ఉద్రిక్తతలు పెరిగాక రూపుదిద్దుకున్న విధానమిదని వారంటున్నారు. వ్యాపార నాయకులు ఈ పర్యటనను ప్రతీకాత్మకం కాదని, వాణిజ్యం, పెట్టుబడిపై దృష్టి పెట్టారని అభివర్ణించారు.భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య ఇటీవల జరిగిన వాణిజ్య ఒప్పందం తర్వాత ఈ పర్యటన చేశారు. కెనడాతో కూడా ఇలాంటి ఒప్పందం చేసుకుంటారేమోనన్న ఆశలను రేకెత్తిస్తోంది. చర్చలలో దీర్ఘకాలిక యురేనియం సరఫరా ఒప్పందం, ఇంధనం, కృత్రిమ మేధస్సు, విద్య, సంస్కృతి వంటి రంగాలలో చిన్న ఒప్పందాలు ఉండవచ్చని భారత అధికారులు గతంలో సూచించారని రాయిటర్స్ నివేదిక పేర్కొంది. అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, కెనడా వాణిజ్యాన్ని వైవిధ్యపరచడానికి, వాటితో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి చేస్తున్న విస్తృత ప్రయత్నంలో భాగంగా భారతదేశ పర్యటన తర్వాత, కార్నీ ఆస్ట్రేలియా, జపాన్‌లకు వెళ్లనున్నారు.



# జాతీయం-అంతర్జాతీయం



# కేజ్రీవాల్, శిశోడియా నిర్దోషులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఉదయం) :** నేను అవినీతి పరుడిని కాను, నేను అత్యంత నిజాయితీ పరుడిని అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అర్వింద్ కేజ్రివాల్ కళ్లనీళ్ల పర్యంతరం అవుతూ శుక్రవారం నాడు పేర్కొన్నారు. ఈ రోజు ఉదయం ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఢిల్లీ ఎక్సైజ్ లేదా మద్యం విధానం కేసులో పేరున్న 23 మందిని మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రిమనీష్ సిసోడియా, తెలంగాణ రాజకీయ నాయకురాలు కె కవిత, ఆప్ నేత విజయ్ నాయర్‌ను ప్రత్యేక న్యాయమూర్తి జితేందర్ సింగ్ డిశ్చార్జ్ (విడుదల) చేసిన తర్వాత అర్వింద్ కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక న్యాయమూర్తి జితేంద్ర సింగ్ ఈ కేసులో తీర్పు చెప్పారు. ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) దర్యాప్తు చేసింది.

**కేజ్రీవాల్ ఏం అన్నారు?**

తీర్పును ప్రకటించిన తర్వాత, కేసులో నిందితులందరినీ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. సత్యమే జయిస్తుందని మేం ఎప్పుడూ చెప్తూనే వచ్చాం. భారతీయ న్యాయవ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉందని ఆయన అన్నారు. అమిత్ షా, మోడీజీ కలిసి ఆప్‌ను అంతం చేసేందుకు అతిపెద్ద రాజకీయ కుట్ర పన్నారని ఆప్ అధిపతి విలేకరులకు చెప్పారు. ఆప్‌కు చెందిన ఐదుగురు ప్రముఖ నాయకులను ఖైదు చేశారని, సిట్టింగ్ ముఖ్యమంత్రిని అతడి ఇంటి నుంచి బయటకు లాగిన తర్వాత జైల్లో ఉంచారని కేజ్రీవాల్ పేర్కొన్నారు. కేజ్రీవాల్ అవినీతిపరుడు కాదు. నా జీవితంలో నేను సంపాదించింది నిజాయితీనే. నేను సంపూర్ణ నిజాయితీపరుడిని. కేజ్రీవాల్, మనీష్ శిశోడియా, ఆప్ నిజాయితీపరులని నేడు కోర్టు పేర్కొంది అని కళ్ల నీళ్లు తుడుచుకుంటూ కేజ్రీవాల్ చెప్పారు.

కేజ్రీవాల్‌తో పాటుగా నిర్దోషిగా ప్రకటించిన శిశోడియా మాట్లాడుతూ, సత్యమేవ జయతే. నేడు నేను బాబా సాహెబ్ అంబేడ్కర్ దార్శనిక ఆలోచనలు, ఆయన రూపొందించిన రాజ్యాంగంపై గర్వపడుతున్నాను. మొత్తం మోడీ పార్టీ, వారి ఏజెన్సీలు మేము అవినీతిపరులమని రుజువు చేయడానికి ఎన్నో యత్నాలు చేసినప్పటికీ, నేడు అర్వింద్ కేజ్రీవాల్ మనీష్ శిశోడియా అత్యంత నిజాయితీపరులని రుజువైంది అని అన్నారు. ఈ ప్రపంచంలో, ఎవరు ఎంత శక్తివంతులైనప్పటికీ, శివశక్తి కంటే ఎదగలేరు. సత్యం ఎప్పుడూ గెలుస్తుంది అని సునీతా కేజ్రీవాల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌పై పోస్ట్ చేశారు.

**నిజానికి విడుదల అంటే ఏమిటి**

విడుదల అనేది కేవలం అపరాధం లేదా నిర్దోషిత్వంపై తీర్పును సూచించదు; ఇది విచారణను పూర్తిగా ముగించడం. ఇది విచారణ ప్రారంభమయ్యే ముందు జరుగుతుంది ఏదైనా సాక్షిని విచారించే ముందు లేదా కోర్టులో ఏదైనా సాక్ష్యాన్ని పరీక్షించే ముందు, అని కాశ్మీర్‌కు చెందిన న్యాయవాది హబీల్ ఇక్బాల్ అన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది అనాస్ తన్వీర్ మాట్లాడుతూ, ప్రాథమిక కేసును వేయడానికి తగినంత ఆధారాలు లేనందున అభియోగాలు మోపడానికి ముందే ఒక వ్యక్తిని విడుదల చేయవచ్చు అని అన్నారు.



**వాదనలు**

సిబిఐ 2022లో తన మొదటి ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. దాని తర్వాత అనేక అనుబంధ ఛార్జిషీట్‌లు వచ్చాయి. ఇప్పుడు రద్దు చేసిన ఎక్సైజ్ విధానాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి "దక్షిణ లాబీ" రూ. 100 కోట్లు చెల్లించిందని సిబిఐ తెలిపింది. మొత్తం మీద, మొత్తం 23 మంది నిందితులపై ఛార్జిషీట్ దాఖలు చేయబడింది. వాదనల సందర్భంగా, నేరపూరిత కుట్ర నేరాన్ని పూర్తిగా పరిగణించాలని, విచారణ సమయంలో తగినంత సాక్ష్యాలను పరిశీలించాలని సిబిఐ పేర్కొంది. సిబిఐకి ప్రాతినిధ్యం వహిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ డి పి సింగ్, న్యాయవాది మను మిశ్రా, నిందితులందరిపై అభియోగాలు మోపడానికి తగిన ఆధారాలు ఉన్నాయని వాదించారు. కాగా, తన క్లయింట్‌ను ఆరోపించిన కుట్రతో ముడిపెట్టగల నేరారోపణ ఆధారాలు ఏవీ లేవని కేజ్రీవాల్ తరపు సీనియర్ న్యాయవాది ఎన్ హరిహరన్ వాదించారు. తొలి చార్జిషీట్‌లో లేదా మునుపటి మూడు అనుబంధ చార్జిషీట్‌లలో కేజ్రీవాల్ పేరు లేదని హరిహరన్ వాదించారు.

**సరళంగా చెప్పాలంటే, ఒక కేసు తప్పనిసరిగా నాలుగు ప్రధాన దశలను కలిగి ఉంటుంది:**

ఎఫ్ ఐఆర్ లేదా ఫిర్యాదు నమోదు; పోలీస్/దర్యాప్తు ఏజెన్సీ కోర్టులో దాఖలు చేసిన ఛార్జిషీట్ ప్రాథమిక ఆరోపణలలో తగినంత నిజం ఉందో లేదో నిర్ధారించడానికి కోర్టు ఛార్జిషీట్‌ను (కొన్నిసార్లు చలాన్ అంటారు) పరిశీలిస్తుంది; విచారణ కోసం అభియోగాలను రూపొందించాలా వద్దా అని నిర్ణయిస్తుంది. తీర్పు దిశగా విచారణ జరుగుతుంది, ఇది దోషిగా నిర్ధారించబడటం లేదా నిర్దోషిగా విడుదల కావడానికి దారి తీస్తుంది. కేజ్రీవాల్ కేసులో, కోర్టు మూడవ దశలోనే విచారణను నిలిపివేసింది. కొత్త ఆధారాలు బయటపడితే లేదా ఉన్నత న్యాయస్థానంలో దిగువ కోర్టు ఉత్తర్వును సవాలు చేయడానికి కారణాలు ఉంటే, ప్రాసిక్యూషన్‌ను తిరిగి అభియోగాలు దాఖలు చేయకుండా డిశ్చార్జ్ ఉత్తర్వు నిరోధించదు.

**తర్వాత ఏం జరుగనుంది?**

రౌజ్ అవెన్యూ కోర్టు తీర్పును సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని సీబీఐ నిర్ణయించింది. నేరపూరిత కుట్ర, మోసం, సాక్ష్యాలను మాయం చేయడం, అవినీతి నిరోధక చట్టం వంటి చట్టపరమైన సెక్షన్ల కింద సీబీఐ ఆగస్టు 2022లో కేసు నమోదు చేసింది. మొత్తం మూడు ఛార్జిషీట్లు దాఖలు చేసింది, రెండవ ఛార్జిషీట్‌లో కేజ్రీవాల్ పేరును నిర్దిష్టంగా పేర్కొన్నారు. రద్దు చేసిన మద్యం విధానాన్ని ప్రభావితం చేయడానికి దక్షిణ లాబీ రూ.100 కోట్లు చెల్లించిందని ఏజెన్సీ ఆరోపించింది. వాదనల సందర్భంగా, విచారణలో సాక్ష్యాలను పరీక్షించాలని ప్రారంభం కాకముందే కొట్టివేయకూడదని సిబిఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ డిపి సింగ్ వాదించారు. సిబిఐ సమర్పించిన అన్ని ఆధారాలను కోర్టు నిశితంగా పరిశీలించిందని, ఆరోపణలో ఒక్కటి నేరారోపణ స్థాయిలో ఉందని చెప్పలేము అని కేజ్రీవాల్ తరపున వాదించిన సీనియర్ న్యాయవాది హరిహరన్ ఒక వార్తా సంస్థ కు చెప్పారు. కోర్టు సీబీఐ అధికారులపై శాఖాపరమైన విచారణకు కూడా సిఫార్సు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రత్యేక కేసును కొనసాగిస్తోంది, ప్రధాన కేసుతో ముడిపడి ఉన్న హవాలా బదిలీలు, షెల్ కంపెనీలను పరిశీలిస్తోంది. కేజ్రీవాల్‌ను మార్చి 2024లో ఇడి అరెస్టు చేసింది, తరువాత సిబిఐఏ అరెస్టు చేసింది, సుప్రీంకోర్టు రెండు కేసుల్లో బెయిల్ మంజూరు చేసే ముందు, ఆయన ఐదు నెలలకు పైగా జైలు జీవితం గడిపారు.

## ఒక దశలోనే తమిళనాడు ఎన్నికలు ఉండవచ్చు : ఇసిఐ

**చెన్నై, ఫిబ్రవరి 27 (ఉదయం) :** తమిళనాడులో రాబోయే అసెంబ్లీ ఎన్నికలను రాజకీయ పార్టీలతో సమగ్ర సంప్రదింపుల తర్వాత ఒకే దశలో నిర్వహించవచ్చని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ శుక్రవారం సూచించారు. రాజకీయ భాగస్వాములు అందరూ ఒకే దశలో ఎన్నికలు జరపడానికి అనుకూలంగా ఉన్నారని, తగిన పరిశీలన తర్వాత కమిషన్ తుది నిర్ణయం తీసుకుంటుందని విలేకరులతో మాట్లాడుతూ ఆయన అన్నారు. భారత ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సన్నద్ధతను అంచనా వేశారు. జిల్లా కలెక్టర్లు, సీనియర్ పోలీసు అధికారులు, అమలు అధికారులు లాజిస్టిక్స్, భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణపై కమిషన్‌కు వివరించారు. తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లను ఆయన సత్కరించారు. ప్రజాస్వామ్య పండుగగా ఆయన అభివర్ణించిన కార్యక్రమంలో యువత భాగస్వామ్యాన్ని పెంచడంలో కమిషన్ నిబద్ధతను పునరుద్ఘాటించారు. అభ్యర్థులు ఇసిఐ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్లు దాఖలు చేయవచ్చని ఆయన అన్నారు. ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన నామినేషన్లు మొత్తం ఓటర్లకు కనిపిస్తాయి. అయితే, చట్టం ప్రకారం, అభ్యర్థులు నిర్ణీత సమయంలోపు రిటర్నింగ్ అధికారి ముందు ఫారమ్‌లను భౌతికంగా కూడా సమర్పించవచ్చు, అని ఆయన అన్నారు, ట్రాఫిక్ అంతరాయాలు వంటి చిన్న అసౌకర్యాలు ప్రజాస్వామ్య ప్రక్రియకు ద్వితీయమనిఅన్నారు.

**యువ ఓటర్లు, మీడియా అవగాహనను వ్యాప్తి చేయాలని విజ్ఞప్తి**

18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓటర్లను ఉద్దేశించి మీడియా అవగాహన ప్రయత్నాలను బలోపేతం చేయాలని కుమార్ కోరారు. బీహార్‌లో అధిక ఓటర్ల ఓటింగ్‌ను ప్రస్తావిస్తూ, తమిళనాడులోని రాజకీయంగా అవగాహన ఉన్న ఓటర్లుఅత్యధిక పోలింగ్ శాతాన్ని నమోదు చేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం



చేశారు. బీహార్‌లో మాదిరిగానే అర్హులైన యువ ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేయడానికి పెద్ద సంఖ్యలో వస్తారని మేం ఖచ్చితంగా అనుకుంటున్నాం. తమిళనాడు యువత అంతా ఈ ప్రజాస్వామ్య ఉత్సవంలో పాల్గొనడానికి ముందుకు రావాలని నేను మళ్ళీ మీడియా ద్వారా, అభ్యర్థిస్తున్నాను, అని కుమార్ అన్నారు. చట్టపరమైన నిబంధనలను స్పష్టం చేస్తూ, చట్టం ప్రకారం, ఆధార్ చట్టం సెక్షన్ 9 ప్రకారం, ఆధార్ కార్డు నివాసం లేదా పౌరసత్వానికి రుజువు కాదు. ఇది మీ పేరు గుర్తింపుకు రుజువు. ఓటరు ఐడి విషయానికొస్తే, ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 కింద అర్హత ప్రమాణాన్ని నెరవేర్చిన వ్యక్తికి వాస్తవ లేదా న్యాయపరమైనది. అంటే ఓటు హక్కు ఉన్న ఓటరు 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలిగి ఉండాలి, అతను ఆ పోలింగ్ బూత్ ప్రాంతంలోని సాధారణ నివాసి అయి ఉండాలి, అతను భారత పౌరుడు అయి ఉండాలి, అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో ధన బలం విషయంపై మాట్లాడుతూ, అనుమతించదగిన పరిమితులకు మించి నగదు తీసుకెళ్లవద్దని కుమార్ హెచ్చరించారు. వివాహం తర్వాత పేర్లను నవీకరించడానికి ఇసిఐ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న సరళీకృత ఫారమ్ 8 ప్రక్రియను కూడా ఆయన పట్టి చూపారు. రాష్ట్ర సంసిద్ధతపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, ఇటీవలి దశాబ్దంలో జరిగిన అత్యంత దోషరహిత ఎన్నికలలో బీహార్ ఒకటి. అందరు కలెక్టర్లు, ఎస్పీలు, అమలుసంస్థలు సహా మొత్తం ఎన్నికల యంత్రాంగం సహా తమిళనాడు రికార్డులు సృష్టించబోతోందని, బీహార్ కంటే చాలా మెరుగ్గా ఉంటుందని తనకు హామీ ఇచ్చారని కుమార్ చెప్పారు.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం పునఃసమతుల్యత సాధ్యమే

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఉదయం) :** పరిస్థితులు మారితే భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందాన్ని తిరిగి సమతులం చేయవచ్చని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. అమెరికా సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ఆయన ఇప్పుడు స్పష్టమైన ప్రకటన చేశారు. పరిస్థితులు మారితే ఒప్పందంలో కూడా మార్పులు వస్తాయని ఆయన ఉద్ఘాటించారు.

దేశ రాజధానిలో శుక్రవారం జరిగిన న్యూస్18 రైజింగ్ భారత్ సమ్మిట్ 2026 కు హాజరైన సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. మారుతున్న పరిస్థితుల నడుమ భారత్ తన ఆర్థిక ప్రయోజనాలను పూర్తిగా కాపాడుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ వాణిజ్య పరిస్థితి నిరంతరం పరిణామం చెందుతోందని, అమెరికా వైపు నుండి భిన్నమైన ప్రకటనలు, చర్యలు వస్తున్నాయని కేంద్ర మంత్రి అన్నారు. అమెరికా సుంకాలు, ట్రంప్ వాణిజ్య విధానాల ద్వారా ప్రయాణించడం ట్రంప్ 150 రోజుల పాటు అన్ని వాణిజ్య భాగస్వాములపై 10 శాతం సుంకంవిధించిన నేపథ్యంలో వాణిజ్య మంత్రి ఈ ప్రకటనలు చేశారు. అన్ని దిగుమతులపై పరస్పర సుంకాలు విధించాలనే ట్రంప్ 2025 ఏప్రిల్ నిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన తర్వాత ఫిబ్రవరి 24న అమెరికా తాత్కాలికంగా 10 శాతం సుంకం విధించింది. ఈ సుంకాలను 10 నుంచి 15 శాతానికి పెంచుతానని కూడా



ట్రంప్ ప్రకటించారు.

మనం గమనిస్తుండాలి. అమెరికాతో ఒప్పందాన్ని ఖరారు చేశామన్న నా ఉమ్మడి ప్రకటనను మీరు చదివి ఉండాలి. అయితే, పరిస్థితులు మారితే, ఒప్పందం సమతుల్యతను మార్చడమే కాదు అది రెండువైపులా నిర్వహించగలిగేలా ఉంటుందని అందులో స్పష్టంగా చెప్పాం అని గోయల్ అన్నారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఫిబ్రవరి 7న చేసిన భారత్, అమెరికా సంయుక్త ప్రకటనలో, రెండు దేశాలు అంగీకరించిన సుంకాలకు సంబంధించి పరిణామాలు మారితే, రెండు దేశాలు తమ నిబద్ధతలను సవరించుకోవచ్చని పేర్కొన్నారు. అప్పుడే దానికి రెండు వైపులా విలువ ఉంటుందని ఆయన అన్నారు. ఫిబ్రవరి 7న, భారత్, అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం మొదటి దశకు సంబంధించిన రూపురేఖలను ఖరారు చేసినట్లు ప్రకటించాయి. భారత ఉత్పత్తులపై పరస్పర సుంకాలను 25 శాతం నుండి 18 శాతానికి తగ్గించడానికి అమెరికా అంగీకరించింది. రష్యా ముడి చమురు కొనుగోలు చేసినందుకు భారత్‌పై విధించిన 25 శాతం శిక్షాత్మక సుంకాలను కూడా అమెరికా తొలగించింది. ఫిబ్రవరి 20న, అధ్యక్షుడు ట్రంప్ విస్తృత ప్రపంచ సుంకాలను కొట్టివేయాలని అమెరికా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇది ఒక పరిణామం చెందుతున్న పరిస్థితి. ట్రంప్ పరిపాలన కొన్ని వ్యాఖ్యలు చేసింది. వారు కొత్త సుంకాలను విధించడానికి ఉపయోగించగల అనేక ఇతర సాధనాలు వారి వద్ద ఉన్నాయి. వారు ఇప్పటికే వాటిలో ఒకటైన సెక్షన్ 122ని ఉపయోగించి 10 శాతం సుంకాన్ని విధించారు. వచ్చే వారం, వారు దానిని 150 రోజులకు 15 శాతానికి పెంచవచ్చని నేను భావిస్తున్నాను, అని గోయల్ అన్నారు. సుంకాలలో మార్పులు భారతదేశానికి ప్రోత్సాహకాలను అందిస్తుందా అనే ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, ఇది భారతీయ సంస్థలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా గుమతులను కొనసాగించడానికి అవకాశాన్ని ఇస్తుందని అన్నారు. కానీ గుర్తుంచుకోండి, ఒప్పందంలో అనేక ఇతర అంశాలు ఉన్నందున అది మెరుగ్గా ఉంది. కాబట్టి మనం దానిపై సంతకం చేసే వరకు, నేను ప్రతి వివరాలను పంచుకునే స్థితిలో లేను. అన్ని సున్నితమైన విషయాలు ఇప్పటికే స్పష్టం చేశాం. కానీనేను మీకు హామీ ఇవ్వగలను, ఒప్పందంలో ఇంకా చాలా సానుకూల అంశాలు ఉన్నాయి, పరిస్థితి ఎలా ముందుకు సాగుతుందో చూద్దాం, అని ఆయన అన్నారు.

## 'పార్లమెంట్‌కు చట్టం చేసే సంపూర్ణ అధికారం ఉంది'

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఉదయం):** పార్లమెంటుకు చట్టాన్ని రూపొందించే సంపూర్ణ హక్కు ఉందని, కేంద్రం కోర్టు ముందు ఇచ్చిన హామీకి అది కట్టుబడి ఉండదని సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొంది. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 152 చెల్లుబాటును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లను విచారిస్తున్న ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. భారతదేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతను ప్రమాదంలో పడేసే చర్యలకు సంబంధించినది బిఎన్ఎస్ లోని సెక్షన్ 152. సెక్షన్ 152 పూర్వపు భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 124ఎని తిరిగి ప్రవేశపెడుతుందని పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాదులలో ఒకరు వాదించారు. మే 2022లో, సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం, దేశద్రోహంపై వలసరాజ్యాల కాలం నాటి శిక్షా చట్టాన్ని, తగిన ప్రభుత్వ వేదిక పునఃపరిశీలించే వరకు నిలిపివేసింది. ఈ నేరాన్ని ప్రయోగిస్తూ కొత్తగా ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయవద్దని కేంద్ర, రాష్ట్రాలను ఆదేశించింది. 2022లో కేంద్రం దేశద్రోహ చట్టాన్ని సమీక్షిస్తామని సుప్రీంకోర్టు ఎదుట హామీ ఇచ్చిందని శుక్రవారం నాడు పిటిషనర్ల తరుపు న్యాయవాది చెప్పారు.



కోర్టు ముందు హామీ ఇచ్చిన తర్వాత ప్రభుత్వం బిఎన్ఎస్‌లో ఆ నిబంధనను తిరిగి ప్రవేశపెట్టలేదని న్యాయవాది వాదించారు. భారత యూనియన్ కోర్టు ముందు ఒక హామీ ఇచ్చి ఉండవచ్చు కానీ పార్లమెంటు దానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు, అని ధర్మాసనం పేర్కొంది. , ఒక చట్టాన్ని రూపొందించడానికి పార్లమెంటుకు పూర్తి అధికారం ఉంది, అని కూడా కోర్టు వ్యాఖ్యానించింది. భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్ 173ని న్యాయవాది ప్రస్తావించారు. అది లలిత కుమారి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉల్లంఘిస్తుందని అన్నారు, ఇది గుర్తించదగిన నేరం జరిగినట్లు సమాచారంవెల్లడిస్తే ఎఫ్ఐఆర్ నమోదును తప్పనిసరి చేస్తుంది. ఒక కేసులో విచారణకు ప్రాథమికంగా అవకాశం ఉందో లేదో తెలుసుకోవడానికి పోలీసులు ప్రాథమిక విచారణ జరపడానికి ఇది వీలు కల్పిస్తుందని ఆయన వాదించారు. లలిత కుమారి తీర్పును చాలా దుర్వినియోగం చేశారని పేర్కొన్న ధర్మాసనం, కొన్నిసార్లు తీర్పులు ఐవరీ టవర్లలో కూర్చొని జారీ చేస్తారని పేర్కొంది. గుర్తించదగిన నేరం జరిగిందా లేదా అని నిర్ధారించడానికి ప్రాథమిక విచారణ నిర్వహించవచ్చని లలితా కుమారి తీర్పు చెబుతుందని ధర్మాసనం పేర్కొంది. హోలీ సెలవుల తర్వాత విచారణ కోసం ఈ విషయాన్ని పోస్ట్ చేసింది. గత సంవత్సరం, బిఎన్ఎస్ సెక్షన్ 152 చెల్లుబాటుకు వ్యతిరేకంగా దాఖలైన ప్రత్యేక ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసు జారీ చేసింది.

## ఇజ్రాయెల్ చేరుకున్న అమెరికా భారీ యుద్ధనౌక

**ఫిబ్రవరి 27 (ఉదయం డెస్క్) :** ఇరాన్‌పై అమెరికా దాడికి సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఇజ్రాయెల్ ఉత్తర తీరానికి చేరుకుంది. గతంలో వెనిజులాపై అమెరికా చేపట్టిన ఆపరేషన్‌లో ఈ నౌక కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు ఇరాన్‌పై జరగబోయే దాడికి కూడా సిద్ధంగా ఉందని సమాచారం. ఇప్పటికే పశ్చిమాసియాలో మోహరించిన అమెరికా యుద్ధ నౌకలు మోహరించాయి. ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీ కలిగిన ఎఫ్22 రాప్టర్ స్టెల్త్ 12 యుద్ధ విమానాలను ఇజ్రాయెల్‌కు అమెరికా తరలించింది. ఈ యుద్ధ విమానాలు ఫిబ్రవరి 24 బ్రిటన్‌లోని లాకెన్‌హీత్ ఎయిర్‌బేస్ నుండి బయలు దేరి దక్షిణ ఇజ్రాయెల్‌లోని ఓ వైమానిక స్థావరానికి చేరుకున్నట్లు సమాచారం. ఏ క్షణంలోనైనా ఇరాన్‌పై దాడి చేయడానికి అగ్రరాజ్యం అమెరికా అన్ని విధాల సన్నద్ధమవుతున్నది. జనవరి నుంచి ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరగడంతో పశ్చిమాసియాలో అతి పెద్ద సైనిక కేంద్రమైన ఖతార్‌లోని అల్ ఉదీద్ వైమానిక స్థావరంలో ఉన్న అమెరికా దళాలు పేట్రియాట్ క్షిపణులను మొబైల్ ట్రాక్ లాంచర్లలోకి ఎక్కించి తరలించాయి. వివిధ దేశాల్లోని బేస్‌ల నుండి యుద్ధ విమానాలు కదులుతున్నాయి. ఖతార్‌లోని 'అల్‌ఉదైద్' బేస్‌కు సంబంధించి ఈ ఉదయం విడుదలైన ఫోటోల ప్రకారం.. అక్కడ ఒక్క అమెరికన్ ఇంధన నింపుకునే విమానం కూడా మిగిలి లేదు. అదే సమయంలో.. వాటిలో చాలా విమానాలు ఇజ్రాయెల్‌లోని 'బెన్ గురియన్' విమానాశ్రయంలో నిలిపి ఉంచినట్లు కనిపించాయి.


## కోల్‌కొతాలో భూకంపం



**కోల్‌కత, ఫిబ్రవరి 27 (ఉదయం):** శుక్రవారం మధ్యాహ్నం 1.22 గం.ల సమయంలో సంభవించిన భూకంపం కోల్‌కత నగరాన్ని కుదిపివేసింది. నగరవ్యాప్తంగా ప్రకంపనలు వచ్చాయని నగరవాసులు చెబుతున్నారు. ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 5.5 తీవ్రతతో నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ (ఎన్‌సిఎస్) పేర్కొంది. దాదాపు 10 కి.మీ.లోతులో సంభవించిన ఈ భూకంపం నైరుతి బంగ్లాదేశ్‌లో కేంద్రీకృతమై స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.52 గంటలకు సంభవించింది. అంతకు ముందు, యుఎస్ జియోలాజికల్ సర్వే (యుఎస్‌జిఎస్) ఈ తీవ్రతను 5.3గా నమోదు చేసింది. కాగా, దీని కేంద్రం పశ్చిమ బెంగాల్‌లోని ఆగ్నేయంగా 26 కిమీల దూరంలో ఉందని పేర్కొంది. భూకంప సంబంధిత డేటాను ఏజెన్సీలు మెరుగుపరుస్తున్నందున ప్రాథమిక తీవ్రత అంచనాలలో వ్యత్యాసాలు సర్వసాధారణం. ఈ ఘటన అనంతరం నగరవాసులు సామాజిక మాధ్యమం ఎక్స్‌పై తమ అనుభవాలను పంచుకున్నారు. ఇటువంటి భూప్రకంపనలను తన జీవితంలో అనుభవించడం మొదటిసారని ఒకరు రాయగా, కోల్‌కొతలో తీవ్రమైన ప్రకంపనలు అని మరొకరు పేర్కొన్నారు. పొరుగు జిల్లాల నుంచి కూడా అనేక వార్తలు వెలువడ్డాయి. నగరం అంతటా ప్రజలు భయంతో తమ ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో కూడా కనిపించాయి. ఇండియాబంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలోని చుట్టుపక్కల జిల్లాల్లో కూడా భూకంపం సంభవించింది.

## పాక్ మెడలు వంచగలది భారతదేశమే

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఉదయం డెస్క్) :** దశాబ్దాలుగా ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్నందుకు, ప్రమాదకరమైన అణ్వాయుధాలకు కలిగి ఉన్నందుకు పాకిస్తాన్‌ను జవాబుదారీగా చేయడంలో భారతదేశం నిర్ణయాత్మక పాత్ర పోషించాలని శుక్రవారం ప్రవాస ఆఫ్ఘన్ పార్లమెంటు సభ్యురాలు మరియం సోలైమాంఖిల్ కోరారు. అంతర్జాతీయ వేదికలపై ఇస్లామాబాద్ చర్యలను బహిర్గతంచేయడానికి, ప్రపంచ ఆంక్షల కోసం ఒత్తిడి చేయడానికి శక్తి ఉన్న దేశం భారత్ అని పేర్కొన్నారు. కాబూల్‌లోని తాలిబాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇస్లామాబాద్ బహిరంగ యుద్ధం ప్రకటించిన నేపథ్యంలో, పాకిస్తాన్‌ఆఫ్ఘనిస్తాన్ మధ్య కొత్త ఘర్షణలు చెలరేగిన నేపథ్యంలో, వార్తా సంస్థ ఎఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలోసోలైమాంఖిల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దాని నియంతృత్వ పాలనకు ఆ దేశాన్ని తప్పుపడుతూనే, పాకిస్తాన్ ఉగ్రవాద డీప్ స్టేట్ విధానాల వల్ల ప్రభావితమైన లక్షలాది మంది జీవితాలకుజవాబుదారీతనం భారత్ కోరవచ్చని ప్రవాసంలో ఉన్నఆ ఎంపీ అన్నారు. పాకిస్తాన్ వద్ద అణ్వాయుధాలు ఉండటం వల్ల అది ఎంత ప్రమాదకరమో భారత్ అంతర్జాతీయ వేదికపైకి తీసుకురావాలి. ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయం కల్పించి, డజన్ల కొద్దీ ఉగ్రవాద సంస్థలను సృష్టించి, ఆ పని అంతా చేశామనిఅనేకసార్లు అంగీకరించిన దేశం ఇప్పటికీ అణ్వాయుధాలు ఎలా కలిగి ఉండగలదు? వాటిపై ఆంక్షలు విధించాలి; వాటికి బాధ్యత వహించాలి. వాటిని వెంటనే అణ్వాయుధాలను నిర్వీర్యం చేయాలి. భారతదేశానికి ఆ పనులు చేయించగల శక్తి ఉంది అని సోలైమాంఖిల్ అన్నారు. ఉగ్రవాద బాధితులమంటూ పాకిస్తాన్ చేస్తున్న వాదనలను సోలైమాంఖిల్ ఖండిస్తూ, ఇస్లామాబాద్ సైనిక నియంతృత్వం, రావల్పిండిలోని జనరల్స్ యుద్ధాన్ని వ్యాపారం చేసుకున్నారు అని విమర్శించారు. మీడియా కథనాలను తారుమారు చేయడానికి చట్టబద్ధత ముసుగు వేసుకొని ఈ ప్రాంతంలో అస్థిరత కోసం కార్యకలాపాలను కొనసాగిస్తూ పాకిస్తాన్ చేస్తున్న ప్రయత్నాలను కూడా ఆమె విమర్శించారు.



**పాకిస్తాన్- ఆఫ్ఘనిస్తాన్ మధ్య బహిరంగ యుద్ధం**

పాకిస్తాన్ రాజధాని కాబూల్‌తో సహా ఆఫ్ఘనిస్తాన్‌లోని ప్రధాన నగరాలపై బాంబు దాడి చేసింది. కానీ, నెలల తరబడి జరిగిన ఘర్షణల తర్వాత పొరుగుదేశంతో బహిరంగ యుద్ధంలోకి దిగినట్లు ఇస్లామాబాద్ రక్షణ మంత్రి శుక్రవారం నాడు ప్రకటించారు. ఘజియాబాద్ లిల్‌హక్ అనే సంకేతనామం కలిగిన ఈ ఆపరేషన్, ఆఫ్ఘన్ రాజధానిపై పాకిస్తాన్ చేసిన అత్యంత విస్తృతమైన బాంబు దాడి, 2021లో తాలిబాన్ తిరిగిఅధికారంలోకి వచ్చిన తర్వాత వారి దక్షిణ ఇంధన స్థావరంపై దాని తొలి వైమానిక దాడి. ఎఎఫ్‌పి వార్తా సంస్థ నివేదిక ప్రకారం, పాకిస్తాన్ నుండి తిరిగి వస్తున్న ఆఫ్ఘన్లకు వసతి కల్పించే శిబిరం రాత్రిపూట జరిగిన పోరాటంలో దెబ్బతిన్నది. ఇస్లామాబాద్ గతంలో చేసిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఆఫ్ఘన్ దళాలు గురువారం రాత్రి పాకిస్తాన్ సరిహద్దు దళాలపై దాడి చేసిన తర్వాత పాకిస్తాన్ తాజా ఆపరేషన్ జరిగింది. ఇటీవలి నెలల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి, అక్టోబర్‌లో జరిగిన ఘోరమైన పోరాటంలో ఇరువైపులా 70 మందికి పైగా మరణించినప్పటి నుండి భూ సరిహద్దులు చాలావరకు మూసివేశారు. పాకిస్తాన్‌లో దాడులు చేసే ఉగ్రవాద గ్రూపులపై చర్య తీసుకోవడంలో ఆఫ్ఘనిస్తాన్ విఫలమైందని ఇస్లామాబాద్ ఆరోపించింది, దీనిని తాలిబాన్ ప్రభుత్వం ఖండించింది. ఇటీవలి సంవత్సరాలలో పాకిస్తాన్‌లో దాడులను ముమ్మరం చేసిన ఉగ్రవాద సంస్థ అయిన తెహ్రీక్‌ఇతాలిబాన్ పాకిస్తాన్ (టిటిపి) చాలా దాడులకు బాధ్యత వహించింది. పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాలిబాన్ ప్రభుత్వంతో పూర్తి స్థాయి ఘర్షణను ప్రకటించారు. ఇప్పుడు మాకు, మీకు మధ్య బహిరంగ యుద్ధం అంటూ ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌పై పోస్టు చేశారు.






"సిబిఐ తరచుగా 'దక్షిణాది గ్రూపు' అని వాడడం అత్యంత అభ్యంతరకరం. భౌగోళికంగా ప్రజలను పరిగణించే పదాలను కొన్ని ఎంపిక చేసిన సందర్భాల్లో ఉపయోగించడం అక్రమం, అవాంఛనీయం. అటువంటి పదాలకు చట్టంలో పునాది లేదు. చట్టబద్ధమైన వర్గీకరణ కిందికి అవి రావు. సిబిఐ ఇదే మాదిరిగా ఉత్తరాది గ్రూపు లేదా అటువంటి వర్గీకరణకు ఇంతవరకు పాల్పడలేదు. ప్రాంతాలవారీ పరిగణన ఆ ప్రాంతం వారిపట్ల దురభిప్రాయం కలిగించే అవకాశముంది. నేర న్యాయంలో కేవలం సాక్ష్యమే ప్రధానం. ఇతర అంశాలకు అక్కడ అవకాశమే లేదు."

- జస్టిస్ జితేంద్ర సింగ్, స్పెషల్ జడ్జి రౌస్ అవెన్యూ కోర్టు న్యూఢిల్లీ

## వే'మన'పద్యం

వాన కురియకున్న వచ్చును క్షామంబు
వాన కురిసెనేని వరదపారు
వరద కరవు రెండు వరసతో నెరుగుడీ
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# కలుపునదే ధర్మం, విడదీయునది కాదు

కేరళ స్టోరీ -2 సినిమా పై 15 రోజులుగా గల స్టే ని ఎత్తివేస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు గమనించదగినది. చిత్రాన్ని సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు అనుమతించినందున దానిని నిలిపివేయవలసిన పనిలేదని ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ అభిప్రాయపడింది. ఒక వేళ హింస తలెత్తితే దానిని అదుపు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నది తీర్పు ఉద్దేశం అనిపించడం సహజం. అంటే ప్రజల మధ్య విభజన సృష్టించి కోడి పందేలకు కత్తులు కట్టే విధంగా రెచ్చగొట్టాలానే దురుద్దేశంతో నిర్మించే చిత్రాల బాధ్యత సెన్సర్మ బోర్డుది, ప్రాభిత్వాల దేనని స్పష్టం చేసినట్లు అయింది. కేరళ స్టోరీ -2 మత సామరస్యాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తుందని, కేరళ రాష్ట్రాన్ని అప్రతిష్ఠ పాలు చేయడానికి ఉద్దేశించిందని వాదిస్తూ దాఖలైన పిటిషన్లను డివిజన్ బెంచ్ కొట్టివేసింది.ఒక సారి సెన్సర్ సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత అన్ని కోణాలలోనూ ఆలోచించి అనుమతించినట్టుగా భావించాలని అభిప్రాయపడింది. దేశంలో హిందుత్వ రాజకీయాలు శిఖర స్థాయికి చేరుకున్న తర్వాత ఇటువంటి చలన చిత్రాలు సర్వసాధారణమైపోయాయి. ఇంతకుముందు కశ్మీర్ ఫైల్స్ ,కేరళ స్టోరీ వంటివి వచ్చాయి. 2023 లో తీసిన మొదటి కేరళ స్టోరీ తీవ్ర వివాదాస్పదం అయింది.దేశంలో భారీ ఎత్తు మతాంతరీకరణలు జరుగుతున్నాయని. లవ్ జిహాద్ లు, ఉగ్రవాద సంస్థ ఐ ఎస్ ఐ ఎస్ రిక్రూట్మెంట్లు సాగుతున్నాయనే కథావ్యూహంతో మైనారిటీ మతంపై విషవిద్వేషాన్ని రెచ్చగొట్టిందనే విమర్శలు వచ్చాయి. ఆ సినిమాను బెంగాల్ లో నిషేధించారు. స్వాతంత్ర్యం తర్వాత మనం రూపొందించుకున్న రాజ్యాంగం అన్ని మతాల శాంతియుత సహజీవనానికి, సెక్యులర్ సమాజ నిర్మాణానికి, అందరూ సమాన హక్కులతో బతకాలనీ స్పష్టం చేస్తున్నది. కలిసి బతకడమనే మహత్తర ఆశయాన్ని పెంచి పోషించడం లోని గొప్పతనం అంతా ఇంతా కాదు. అయితే గత పది పన్నిండేళ్లుగా దేశ ప్రజలు హిందుత్వ శక్తులను ఎన్నుకుంటున్న మాట వాస్తవం. ఈ నేపథ్యంలో మెజారిటీ ప్రజలను మత ప్రాతిపదికన సంఘటిత పరిచే వ్యూహాలకు ప్రాధాన్యం కలుగుతున్నది. న్యాయస్థానాలు మాత్రం ఇటువంటప్పుడు సెక్యులర్ రాజ్యాంగ నిర్దేశాలకు లోబడి వ్యవహరిస్తాయని ఆశించడం సహజం. ఏమైనప్పటికీ భిన్న మతస్థులు సోదరభావంతో బతికే ఉన్నత సంస్కృతికి వందల సంవత్సరాలుగా అలవాటు పడిన ప్రజలకు ఇటువంటి సందర్భాల్లో సంయమనంతో వ్యవరించడం తెలుసు. గతంలో మతవైషమ్యాలు ఎంతటి అనర్ధాలకు దారి తీశాయో అనుభవమే. అవి తిరిగి చోటుచేసుకోకుండా చూసుకోవడమే పరిణత సామాజికుల బాధ్యత.కలుపునదే ధర్మం, విడదీయునది కాదు. సినిమాను సినిమాగా చూడడమే పౌరుల బాధ్యత.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

### నిజంగానే

# మూతపడ్డ ఈస్టిండియా కంపెనీ

భారతదేశంలో అధిక ప్రాంతాలను పాలించి, దేశంలో వలసరాజ్యానికి నాంది పలికిన ఒకనాటి శక్తిమంతమైన బ్రిటిష్ వాణిజ్య సంస్థ ఈస్ట్ ఇండియా కంపెనీ మళ్లీ ఒకసారి మూతపడింది. అయితే, ఈసారి లండన్‌లో లగ్జరీ రిటైలర్‌గా మూతపడింది. అసలు ఈస్ట్ ఇండియా కంపెనీ దాదాపు 152 సంవత్సరాల కిందటి నుంచి నిద్రాణంగా ఉంది, కానీ 2010 లో బ్రిటిష్-ఇండియన్ వ్యాపారవేత్త ఆ పేరు హక్కులను కొనుగోలు చేయడం ద్వారా దానిని పునరుద్ధరించాడు. దివాలా తీసిన తర్వాత ఆ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రాజెక్ట్ ఇప్పుడు శాశ్వతంగా ముగిసినట్టుంది.

ఈస్టిండియా కంపెనీ చేతుల నుంచి బ్రిటిష్ ప్రభుత్వానికి అధికారం మారడానికి కారణం తొలి స్వాతంత్ర్య ఉదమ్యంగా పేర్కొనే 1857 నాటి సిపాయి తిరుగుబాటు. 1858లో బ్రిటిష్ క్రౌన్ అధికారాన్ని చేపట్టి, భారతదేశంలో ప్రత్యక్షంగా బ్రిటిష్ పాలనకు నాంది పలికింది.

భారతదేశం, ఇతర ఆసియా దేశాలలో దాని భారీ దోపిడీ కారణంగా ఈస్ట్ ఇండియా కంపెనీ వారసత్వాన్ని ప్రతికూల దృష్టితోనే చూస్తారు. ఇది ప్రపంచ వాణిజ్యాన్ని మార్చివేసినప్పటికీ, హింస, 3 కోట్ల మందిని బలిగొన్న కృత్రిమంగా సృష్టించిన బెంగాల్ కరువు ద్వారా భారతీయులకు తీవ్ర వ్యధను మిగిల్చింది.



ఈస్టిండియా కంపెనీ పేరుపై భారత వ్యాపారవేత్త సంజీవ్ మెహతా 2010లో హక్కులను కొనుగోలు చేసినప్పుడు, దానిని వలసపాలనలో ఉన్నవారి ప్రతీకారంగానే చూశారు. ఒకనాడు భారతదేశాన్ని పాలించిన కంపెనీని ఒక భారతీయుడు కొనుగోలు చేశాడన్న వార్త ప్రపంచవ్యాప్తంగా శీర్షికలలోకి ఎక్కింది. అయితే, ఈ ఆధునిక వర్షెన్ మూతపడే దిశగా ప్రయాణించింది. ఈస్టిండియా కంపెనీ లిమిటెడ్ 2025 అక్టోబర్‌లో లిక్విడేటర్లను నియిమించిందని సండే టైమ్స్ పత్రిక పేర్కొంది. ఆ వార్తాపత్రిక ప్రకారం, బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్‌లో నమోదు చేసిన దాని మాతృ సంస్థకు ఇది 600,000 పౌండ్లు (రూ. 6.3 కోట్లు), పన్నుల రూపంలో 193,789 పౌండ్లు (రూ. 2.03 కోట్లు), ఉద్యోగులకు 163,105 పౌండ్లు (రూ. 1.71 కోట్లు) కంటే ఎక్కువ బకాయిపడింది. యజమాని సంజీవ్ మెహతాతో అనుసంధానమై, ఈస్ట్ ఇండియా పేరుతో ఉన్న అనేక సంబంధిత కంపెనీలు కూడా రద్దు అయ్యాయి. ఆ కంపెనీ వెబ్‌సైట్ పనిచేయడం లేదు. లండన్‌లోని మేఫెయిర్‌లోని 97 న్యూ బాండ్ స్ట్రీట్‌లోని దాని దుకాణం ఖాళీగా ఉందని, ఎవరైనా అద్దెకు తీసుకోవచ్చని సమాచారం. మరో అనుబంధ సంస్థ ఈస్ట్ ఇండియా కంపెనీ కలెక్షన్స్ లిమిటెడ్ కూడా ఇటీవల రుణదాతల నుండి వైండింగ్-అప్ పిటిషన్‌ను ఎదుర్కొంది.

ఈస్టిండియా కంపెనీని పునరుద్ధరించిన వాణిజ్యవేత్త సంజీవ్ మెహతా

ఈస్ట్ ఇండియా కంపెనీని హోల్‌సేల్ వ్యాపారంగా పునఃప్రారంభించడానికి ప్రయత్నించిన వాటాదారుల నుండి సంజీవ్ మెహతా 2000ల ప్రారంభంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పేరును పొందే ప్రక్రియను ప్రారంభించాడు. 2010లో, అతను మేఫెయిర్‌లో 2,000 చదరపు అడుగుల లగ్జరీ స్టోర్‌ను ప్రారంభించాడు. ఇది ఫోర్ట్‌నమ్ & మాసన్ వంటి ప్రసిద్ధ దుకాణాల మాదిరిగానే హై-ఎండ్ టీలు, చాక్లెట్లు, మిఠాయిలు, సుగంధ ద్రవ్యాలు, ఇతర వస్తువులను విక్రయించింది.

వలసవాద చిహ్నంగా ఉన్నదానిని సానుకూలంగా మార్చడంగా దీనిని మెహతా చూశారు. ది గార్డియన్‌కి 2017లో ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఒక భారతీయుడు ఇప్పుడు ఈస్ట్ ఇండియా కంపెనీ యజమానిగా ఉండడమంటే ప్రతికూలత సానుకూలతగా మారడమేనని ఆయన అన్నారు.

1800ల ప్రారంభంలో అది ఉచ్ఛస్థాయిలో ఉన్నప్పుడు, కంపెనీకి దాదాపు 250,000 మంది ప్రైవేట్ సైన్యాన్ని కలిగి ఉంది. ఇది అప్పటి బ్రిటిష్ సైన్యం కంటే రెండింతలు పెద్దది. దాని సాయంతో భారతదేశంలోని విస్తారమైన ప్రాంతాలను నియంత్రించింది. ఇది సుగంధ ద్రవ్యాలు, పత్తి, పట్టు, టీ, ఇండిగో, మరిన్నింటిలో ప్రపంచ వాణిజ్యాన్ని నడిపించింది. అయితే అందులో మానవీయ కోణం లోపించింది.

### అసలు ఈస్టిండియా కంపెనీ చరిత్ర

ఎలిజిబెత్ రాణి 1 జారీ చేసిన రాయల్ చార్టర్ ద్వారా స్థాపించిన ఈస్టిండియా కంపెనీ, భారతదేశం, ఆగ్నేయాసియాతో సహా తూర్పు ఇండీస్ నుంచి సుగంధ ద్రవ్యాలు, వస్తువుల కోసం పోటీ పడడానికి జాయింట్- స్టాక్ ట్రేడింగ్ సంస్థగా ప్రారంభమైంది. ప్రపంచంలోనే తొలి జాయింట్ స్టాక్ కంపెనీలలో ఇది ఒకటి. కంపెనీ 1612-1613లో తన తొలి ట్రేడింగ్ పోస్టును భారత్‌లోని సూరత్‌లో ప్రారంభించింది. క్రమేణా, అది కేప్ ఆఫ్ గుడ్ హోప్ తూర్పున బ్రిటిష్ వాణిజ్యంపై గుత్తాధిపత్య హక్కులను పొందింది. కోటల నిర్మాణం, స్థానిక పాలకులతో కూటములు, ఫ్రెంచి, స్థానిక శత్రు రాజ్యాలతో యుద్ధాలు చేయడం ద్వారా 1700 నాటికి అది ప్రధాన శక్తిగా ఎదిగింది. అది పన్నులను వసూలు చేయడం, కోర్టులను నడపడంతో పాటు, 1757లో ప్లాసీ యుద్ధానంతరం బెంగాల్ వంటి ప్రాంతాలను పాలించింది. అది ఉచ్ఛలో ఉన్న సమయంలో కొన్ని సరుకులలో ప్రపంచ వాణిజ్యంలో సగం వాటాను కలిగి ఉండి, దాదాపు భారత ప్రభుత్వంలా వ్యవహరించింది.

అయితే, దాని పాలన దోపిడీకి దారితీసింది, వాణిజ్య పంటలను బలవంతంగా పండించడమే కాదు, ఎగుమతి విధానాల వల్ల కరువులు మరింత తీవ్రమయ్యాయి. ఈ క్రమంలో చోటు చేసుకున్న 1857 తిరుగుబాటు దాని పాలనను ముగించింది. బ్రిటిష్ పార్లమెంట్ 1874లో అధికారాన్ని రాచరికానికి బదిలీ చేసిన తర్వాత దానిని పూర్తిగా రద్దు చేసింది.

అనేకానేక అన్యాయాలకు, దుర్మార్గపు విధానాలకూ కారణమై, అంతిమంగా భారత్‌ను వదిలిన ఈస్టిండియా కంపెనీ ఊసు 152 ఏళ్ల తర్వాత ప్రచారంలోకి రావడం, మరో పాతికేళ్ల తర్వాత పూర్తిగా మూతపడడం విచిత్రమే.

మన సమాజంలో వాస్తు, జ్యోతిష్యం, పూజల పేరుతో జరుగుతున్న ఆర్థిక దోపిడీపై ఈ వ్యాసం తీవ్రంగా విశ్లేషిస్తోంది. నేటి ఆధునిక భారతీయ సమాజంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో, చదువుకున్న వారు, కోటీశ్వరులు అనే తేడా లేకుండా అందరూ ఈ భయాల వలలో చిక్కుకుపోతున్నారు. పక్కింటి వారు ఇల్లు కట్టుకుంటూ వాస్తు కోసం లక్షలు ఖర్చు చేయడం, సహోద్యోగులు రత్నాల ఉంగరాలు మార్చడం నిత్యకృత్యమైపోయింది. ఈ పరిహారాల పరిశ్రమ ఏటా లక్షల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోందని ఆర్థిక నిపుణుల అంచనా. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే, ఈ మూఢనమ్మకాల పేరిట ఏటా వేల కోట్ల రూపాయలు సామాన్యుల

# గ్రహాల గుప్పిట్లో మన జీవితాలా?

జేబుల నుండి అక్రమార్కుల అకౌంట్లలోకి చేరుతున్నాయి. ఒక పాపులర్ జ్యోతిష్యుడి నెలవారీ సంపాదన ఐదు నుండి పది లక్షల రూపాయలు ఉండటం గమనార్హం. టీవీ ఛానెళ్లలో సాగే కార్యక్రమాలు వేల మందిని కట్టిపడేస్తున్నాయి మరియు ఒక్క ఫోన్ కాల్‌కే వందల రూపాయలు వసూలు చేస్తున్నా జనం క్యూ కడుతున్నారు. ఇంట్లో చిన్న సమస్య వచ్చినా, ఉద్యోగంలో ఇబ్బందులు ఎదురైనా, పిల్లల పెళ్లి సంబంధం తప్పినా జనం జ్యోతిష్యుల దగ్గరికే పరుగులు తీస్తున్నారు. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల ప్రకారం, ఈ మొత్తం తతంగం వెనుక ఉన్న అసలు కారణం భయం . రేపు ఏమవుతుందో తెలియని అనిశ్చితి, భవిష్యత్తుపై పట్టు కోల్పోతామేమో నన్న ఆందోళన మనిషిని ఇలాంటి వాటి వైపు నడిపిస్తున్నాయి. మానవ మెదడుకు సమస్య ఎదురైనప్పుడు తక్షణ కారణం కావాలి, నీ రాశిపై శని దృష్టి ఉంది అని జ్యోతిష్యుడు అనగానే బాధితుడికి తాత్కాలిక ఊరట కలుగుతుంది. ఇది వాస్తవమా కాదా అన్నది పక్కన పెడితే, ఆ తాత్కాలిక ఉపశమనం కోసం సామాన్యుడు తన కష్టార్జితాన్ని ధారపోస్తున్నాడు. మనస్తత్వ శాస్త్రంలో దీనిని లోకస్ ఆఫ్ కంట్రోల్ (Locus of Control) అని పిలుస్తారు. జీవితం మన చేతుల్లో లేదనే భయం వేసినప్పుడు, మెదడు బాహ్య శక్తులను (గ్రహాలు, వాస్తు, దేవుడి శాపం) వెతుక్కుంటుంది. తప్పు తనదే అని ఒప్పుకోవడం కంటే, గ్రహచారం బాలేదని చెప్పుకోవడంలో ఒక సౌకర్యం ఉంటుంది, ఇది తాత్కాలికంగా అపరాధ భావాన్ని (Guilt) మాయం చేస్తుంది. పరిష్కారం దొరుకుతుందనే ఆశతో మునిగిపోతున్న వాడికి గడ్డిపోచ దొరికినట్లు, సామాన్యుడు వేలల్లో, సంపన్నుడు కోట్లలో వెచ్చించడానికి వెనుకాడటం లేదు. వాస్తవానికి మనం కొంటున్నది పరిహారాలను కాదు, మన బలహీనతలకు దొరికే ఒక చిన్న సమర్థనను మాత్రమే.

మీ పూర్వీకుల ఆత్మలు శాంతించలేదు, ఏదో పెద్ద అనర్థం జరగబోతోంది! వంటి మాటలు విన్నప్పుడు ఏ సామాన్య మనిషికైనా భయంతో గుండె గుభేల్మనడం సహజం. ఆ క్షణంలో, పరిష్కారం చెప్పే వ్యక్తి అడిగినంత సమర్పించుకోవడానికి వెనుకాడరు. దీనికి కారణం మానవ మెదడులోని బలహీనత, దాన్నే సైకాలజీలో లాస్ ఎవర్షన్ (Loss Aversion) అంటారు. లాభం వస్తుందన్న ఆశ కంటే, ఉన్నది పోతుందన్న భయమే మనిషిని పది రెట్లు వేగంగా ప్రేరేపిస్తుంది. ఈ మానసిక బలహీనతనే కొందరు తెలివైన వ్యక్తులు లాభసాటి బిజినెస్ మోడల్‌గా మార్చుకున్నారు. ముందుగా భయాన్ని నరనరాన ఎక్కించడం, ఆపై పరిహారం అమ్ముకోవడం, ఇదే నేటి కార్పొరేట్ స్థాయి ఆధ్యాత్మిక వ్యాపారం. ముఖ్యంగా ఆర్థిక కష్టాలు, అనారోగ్యం, పిల్లల పెళ్లిళ్లు వంటి అభద్రతా భావ సమయంలో జనం ఇలాంటి మాయగాళ్ల దగ్గరకు పరుగులు తీస్తున్నారు.వాస్తు విషయానికొస్తే, సూర్యకాంతి, గాలి వంటి శాస్త్రీయ పునాదులు ఉన్నప్పటికీ, నేడు అది కేవలం డబ్బులు దండుకునే సాధనంగా మారింది. వాస్తు నిపుణులు చెప్పే సమస్యలు, ఇంట్లో ఉన్న సమస్యలతో సరిపోలినట్లు అనిపించడం వెనుక కన్ఫర్మేషన్ బయాస్ (Confirmation Bias) అనే అంశం ఉంది. మెదడు మనకు నచ్చిన ఆధారాలను మాత్రమే వెతుక్కుంటుంది. అలాగే, వాస్తు మార్పులు చేశాక బాగుంది అనిపించడం వెనుక ఉన్నది ప్లేసిబో ఎఫెక్ట్ (Placebo Effect) - అంటే మార్పు చేశాం కాబట్టి అంతా మంచే జరుగుతుంది అని బలంగా నమ్మడం వల్ల కలిగే తాత్కాలిక మానసిక సంతృప్తి మాత్రమే. చదువుకున్న వారు, ఐఏఎస్ అధికారులు, ఐటీ నిపుణులు కూడా జ్యోతిష్యుల గడప తొక్కడం ఆశ్చర్యం కలిగిస్తుంది. విద్యావంతులకు వైజ్ఞానిక జ్ఞానం ఉన్నా, అది భావోద్వేగ పరిపక్వతను ఇస్తుందని గ్యారెంటీ లేదు. జీవితంలోని అనిశ్చితి, భయం పండితులకైనా, పామరులకైనా ఒక్కటే. ఇక్కడ కాగ్నిటివ్ డిసోనెన్స్ (Cognitive Dis-sonance) అనే మానసిక స్థితి వల్ల, ఇవన్నీ మూఢనమ్మకాలని తెలుసు, కానీ ఒక్కసారి చేసి చూస్తే పోయేదేముంది? అని తర్కించుకుంటారు. జ్యోతిష్యులు కోల్డ్ రీడింగ్ (Cold Reading) అనే అస్త్రాన్ని ఉపయోగించి, మీ గురించి ఏమీ తెలియకపోయినా సాధారణ విషయాలను మాట్లాడుతూ మిమ్మల్ని ఆశ్చర్యపోయేలా చేస్తారు. ఉదాహరణకు, ఈ మధ్యే ఏదో కష్టం జరిగింది కదా! అని అడగడం, ఇలాంటి సాధారణ విషయాలు అందరికీ వర్తిస్తాయి (దీన్నే "బార్నమ్ ఎఫెక్ట్" అంటారు). సోషల్ మీడియా, యూట్యూబ్ రాశిఫలాల వీడియోలతో ఈ వ్యాపారం మరింత విస్తరించింది. ఈ సమస్యకు పరిష్కారం సులభం కాదు, ఎందుకంటే ఇది మనిషి యొక్క మానసిక అవసరాలకు సంబంధించినది.మానసిక ఆరోగ్య సేవల (Mental Health Services) పట్ల ఉన్న చులకన భావం పోవాలి.విద్యా వ్యవస్థలో చిన్నతనం నుండే వైజ్ఞానిక దృక్పథాన్ని, తార్కిక ఆలోచనను పెంపొందించాలి. మాంత్రిక విద్యల పేరుతో మోసం చేయడం చట్టరీత్యా నేరం. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల మాదిరిగా, తెలుగు రాష్ట్రాల్లో కూడా మూఢనమ్మకాల వ్యతిరేక కఠిన చట్టాల అవసరం ఉంది. వ్యక్తిగతంగా, ఎవరైనా భయపెట్టి పరిహారం అమ్ముతున్నారంటే, నేను వివేచనతో ఆలోచిస్తున్నానా? లేక భయంతో నిర్ణయం తీసుకుంటున్నానా? అని ప్రశ్నించుకోవాలి. నమ్మకం జీవితానికి ఊపిరి పోయాలి కానీ, జేబులకు చిల్లులు వేయకూడదు. గ్రహాలు, వాస్తు మన విధిని మార్చవు, మన ఆలోచనల పదును, నిర్ణయాలే మన జీవితాన్ని మారుస్తాయి.





డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

# దేశాభివృద్ధిలో ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యం

సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న లాభాపేక్ష లేని నిస్వార్థ స్వచ్ఛంద పౌర సమూహాలను "ప్రభుత్వేతర సంస్థలు" లేదా "నాన్-గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ (ఎన్జీవోస్)" అని పిలుస్తారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న పేదరికం, అసమానతలు, పరివారం కాలుష్యం, మానవీయ సమస్యలకు తగు పరిష్కారాలు చూపడానికి, సమాజాభివృద్ధి, సానుకూల మార్పులకు కృషి చేయడం, మానవ హక్కుల పరిరక్షణ, ఎన్జీవోల పట్ల అవగాహన పెంచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రభుత్వేతర సంస్థలు ప్రపంచవ్యాప్తంగా నిరంతరం కృషి చేస్తున్నాయి. మెరుగైన పౌరసమాజ నిర్మాణానికి ఎన్జీవోలు చేస్తున్న కృషిని ఏకరువు పెట్టడానికి, వాటి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి సామాజిక కార్యకర్త "మార్కస్ లియర్స్ స్కద్మనిస్" నేతృత్వంలో 2009 నుంచి ప్రతి ఏట 27 ఫిబ్రవరి రోజున "ప్రపంచ ప్రభుత్వేతర సంస్థల దినోత్సవం (వరల్డ్ ఎన్జీవో డే)" వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

### ప్రపంచ ఎన్జీవోల దినోత్సవం - 2026 ఇతివృత్తం

ప్రతి వ్యక్తి తమకు తోచినట్లుగా విరాళాలు, శ్రమ దానాలు, నిధులు సమకూర్చుకునే కార్యకలాపాలు, చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ వేదిక కోరుకుంటున్నది. ప్రపంచ ఎన్జీవోల దినోత్సవం-2026 ఇతివృత్తంగా "సమ్మిళిత మూల సూత్రంతో సుస్థిరాభివృద్ధి" అనే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతున్నది. ఈ రోజున ఎన్జీవోల



ప్రాధాన్యాన్ని వివరించడానికి, ప్రోత్సహించడానికి తగు సదస్సులు, వెబినార్స్, కార్యశాలలు, శిక్షణ కార్యక్రమాలు, అవార్డుల ప్రదానాలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, సంఘటిత కార్యక్రమాలు, పాలసీ వివరణలు, నిధుల సేకరణలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు లాంటివి నిర్వహించవచ్చు.

### భారత్‌లో ఎన్జీవోల ఉద్యమాలు


నేటి ప్రజా సమస్యల సకారాత్మక పరిష్కారానికి ప్రభుత్వాలు చేస్తున్న కృషితో పాటు ప్రభుత్వేతర సంస్థల సహాయ సహకారాలు కూడా దోహదపడుతున్నాయి. ఆర్య సమాజ్, నేషనల్ కౌన్సిల్ ఫర్ వూమన్, సంకల్ప్ తరు ఫౌండేషన్ లాంటి స్వచ్ఛంద సంస్థల రాకతో భారత్‌లో ఎన్జీవోల ఉద్యమాలు ఊపందుకున్నాయి. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, బాలల సంక్షేమం, ప్రజారోగ్యం, విపత్తుల నిర్వహణ, మానవ హక్కుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ లాంటి సమస్యలను ఎన్జీవోలు పరిష్కరించడానికి ప్రయత్నాలు చేయడం కొనసాగుతున్నది. నిధుల కొరత, సుస్థిరత, జవాబుదారీతనం, ప్రభుత్వ నిర్లక్ష్యం లాంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ఎన్జీవోల ఉద్యమాలు కొనసాగుతున్నాయి. గివ్ ఇండియా, స్మైల్ ఫౌండేషన్, గూంజ్, హెల్పేజ్ ఇండియా, ఆక్షన్‌ఎయిడ్, చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్ లాంటి ప్రముఖ ఎన్జీవోలు భారత దేశాభివృద్ధికి నిస్వార్థంగా సేవలు అందిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 మిలియన్ల ఎన్జీవోల ద్వారా 50 మిలియన్ల స్వచ్ఛంద కార్యకర్తలు సేవలు అందిస్తున్నారు. ఇలాంటి ఎన్జీవో సంస్థలతో మనం కూడా కలిసి నిర్భాగ్యుల ముఖాల్లో ఆనంద భాష్యాలను చూద్దాం, బాధలే లేని భారతిని నిర్మిద్దాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

# అంతర్ముఖ పవిత్ర విప్లవం

ఉషోదయపు ధవళకాంతి
విప్పారక ముందే
సహెరీ ముగింపు సైరన్ ఈల పాట
పాడింది
చంద్రవంక గుండెలపై కొత్త నెల జెండా
ఎగిరింది.



ఎండిన మనసుల నేలపై
దైవ కరుణ మొదటి చినుకై జారింది -
అదే రమజాన్.

ఆకలికి అర్థం చెప్పే ఉపవాసం,
అహంకారానికి అద్దం చూపే నిశ్శబ్దం.

గడియారపు ముల్లు కాదు,
హృదయ స్పందనే సమయాన్ని
కొలుస్తుంది ఈ నెలలో.

ఒక గ్లాసు నీటిలో
అఖండ కృతజ్ఞతా సముద్రం
ఉప్పొంగుతుంది.

అస్తమయం అజాన్‌గా మారిన వేళ
సూర్యుడు కూడా సజ్దాలో తలవంచి
కనిపిస్తాడు.

ఖర్జూరం ముక్క పంచుకున్న చేతిలో
మానవత్వం మళ్లీ పరిమళిస్తుంది.

పాపాల పొగమంచును
ఒకే ఒక్క దుఆ అగ్నిలా దహిస్తుంది.

రాత్రి తహజ్జుద్ దీపాలు
ఆకాశపు నక్షత్రాలకు వన్నెలద్దుతాయి.

రమజాన్ -
శరీరాన్ని కాదు,
మనసును ఉపవాసం ఉంచే పవిత్ర
విప్లవం.



యండి. ఉస్మాన్ ఖాన్

# పేదల ఇండ్లు కూల్చడం దుర్మార్గం





**రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చివేస్తారు**
**కూల్చివేతలు తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందేమి లేదు**
**కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు రెండూ ఒక్కటే**
**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

**కరీంనగర్, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి):**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పేదలందరికీ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్లు నిర్మించి ఇచ్చే విషయంలో పోటీ పడుతుంటే, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చే విషయంలో పోటీ పడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. నానా కష్టాలు పడి పేదలు అప్పోసప్పో చేసి బతకడానికి ఇండ్లు కట్టుకుంటే వాటిని కూల్చడం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పనితీరు మారకపోతే రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చివేస్తారని చెప్పారు. తక్షణమే పేదల ఇళ్ల కూల్చివేతను ఆపాలని, లేనిపక్షంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం కరీంనగర్ లోని 51వ డివిజన్ లో రూ.16 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ భండారి వేణుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ లోని 51వ డివిజన్ లో రూ.16 లక్షల నిధులతో అభివృద్ధి పనులను చేపడుతామని, ఈ డివిజన్ లో వర్షం వస్తే ఇబ్బందులు ఏర్పడుతున్న దృష్ట్యా ఈ నిధులతో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ బండారి వేణుపై నమ్మకంతో భారీ మెజారిటీ గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇచ్చిన మాట ప్రకారం కేంద్రం నుంచి పెద్ద ఎత్తు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులను చేపడుతామని, అట్లాగే రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను కాంగ్రెస్ పెద్దలపై ఒత్తిడి తెచ్చి తీసుకువస్తామన్నారు. రాజకీయాలకు తావివ్వకుండా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని, ఇతర పార్టీల నేతలు కూడా తమతో కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కలిసి కట్టుగా పనిచేస్తూ నిధులు తీసుకొచ్చి కరీంనగర్ ను ఆదర్శంగా అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు అభివృద్ధి మాత్రమే కోరుకుంటున్నారే తప్ప రాజకీయ విమర్శలను పట్టించుకోరని విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట తప్పారని, మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా వేస్తామని ఫిబ్రవరి 4న మిర్యాలగూడలో సభలో రేవంత్‌రెడ్డే ప్రకటించారని, ఇట్లాంటి హామీలు ఇచ్చి మాట తప్పారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నోటి నుంచి ఏ మాట వచ్చినా శాసనం కావాలి, కానీ రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రులు కేసీఆర్ దగ్గర ట్రైనింగ్ తీసుకుంటున్నారన్నారు. హామీలు గుప్పించి, నమ్మించి ఓట్లేయించుకుని హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నారని చేస్తున్నారన్నారు. రైతు భరోసా ఇస్తామని చెప్పి, రూ.9 వేల కోట్లు సిద్ధంగా ఉన్నాయని పదేపదే చెబుతూ వార్తలు రాయించుకున్నారు తప్ప ఇప్పటి వరకు రైతు బంధు ఊసే లేదన్నారు. అధికారంలోకి వచ్చాక రైతు భరోసా ఒక దఫా ఎగ్గొట్టారని, ఎన్నికలొస్తే ఏదో ఒక హామీని తూతూ మంత్రంగా అమలు చేసినట్లు నటించి వార్తలు రాయించుకోవడం, ఎన్నికలై పోగానే వాటిని మర్చిపోవడం వాళ్లకు అలవాటైందన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలొచ్చే టైంలో మళ్లీ ఏదో ఒక డ్రామాకు తెరతీస్తారని, రాష్ట్ర ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో 6 గ్యారంటీలను అమలు చేయకపోయినా, డీఏలు, ఫీజు రీయంబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోయినా ఓట్లేశారనే అహంకారం కాంగ్రెస్ నేతల్లో పెరిగిపోయిందన్నారు. ఏ హామీని అమలు చేయకపోయినా ఓట్లేస్తున్నారని, అందుకే ఈసారి ప్రజలంతా కాంగ్రెస్ కు కర్రు కాల్చివాత పెట్టాలన్నారు.

రైతు భరోసా గురించి కేబినెట్‌లో ఎందుకు చర్చించలేదో, ఆ పైసలు రైతుల ఖాతాల్లో వేసే ఆలోచన సీఎంకు ఉందో లేదో స్పష్టం చేయాలన్నారు. రైతు భరోసా మూడు వాయిదాలు కలిపితే రూ.27 వేల కోట్లు, కానీ ఒక రైతు భరోసా వాయిదాను చెల్లించి చేతులు దులుపుకోవాలని చూస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తెలివైన వాళ్లని, తక్షణమే రైతు భరోసాను చెల్లించాలని కోరుతూ ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాయడం జరిగిందని తెలిపారు. తక్షణమే రైతు భరోసా చెల్లించకపోతే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతలు తప్ప సాధించింది ఏముంది? నానా కష్టాలుపడి పేదలు ఇండ్లు నిర్మించుకుంటే, అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు ఎందుకని ఆయన ప్రశ్నించారు. పేదల ఇండ్లను కూల్చడానికి వారికి మనసెలా వచ్చిందని, పేదలు ఇండ్లు కట్టుకోవడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్లు నిర్మిస్తూ మోదీ ప్రభుత్వం పేదలకు ఇండ్లు కట్టడానికి ముందుకు వస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పేదల ఇండ్లను కూల్చే విషయంలో పోటీ పడుతోందని ఆయన దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి పనితీరు మారకపోతే ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చివేస్తారన్నారు. తాము వాస్తవాలు మాట్లాడితే కేంద్రం ఏమిచ్చిందని ఎదురుదాడి చేయడం సీఎం, మంత్రులకు అలవాటైందని, కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలన్నీ ఆధారాలతో సహా ప్రజల ముందుంచామని తెలిపారు. మరి 6 గ్యారంటీల పేరుతో హామీలిచ్చారని ఇచ్చిన హామీలు కేంద్రానికి చెప్పి మేనిఫెస్టోలో పెట్టారా అని ఆయన ప్రశ్నించారు. హామీలు ఇచ్చింది వారేనని అమలు చేయాల్సింది కూడా వారేనని డిమాండ్ చేశారు. ఇండ్ల కూల్చివేతపై బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, మున్సిపల్ ఎన్నికల్లోనూ కలిసే పోటీ చేశాయి. కలిసే పదవులు పంచుకున్నాయి. ఇప్పుడు ఒకరికి ఒకరు పడనట్లు డ్రామాలాడుతున్నారు. మరి వాళ్లిద్దరికి ఎక్కడ చెడిందో వాళ్లే చెప్పాలన్నారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు గత ఎన్నికల్లో మాట్లాడారు. తాము కూడా అదే చెప్పామని, ఈ అంశంపై విచారణ జరిపే దమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి లేదని రేవంత్‌రెడ్డి ఒప్పుకుంటే మేం విచారణ చేపట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఆ మేరకు లేఖ రాయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.



## తాగునీటి సరఫరాపై దృష్టి సారించండి

- **హన్మకొండ జిల్లా కలెక్టర్/ జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**
- **ధర్మసాగర్ ఫిల్టర్ బెడ్ ను క్షేత్రస్థాయిలో సందర్శన**

**ధర్మసాగర్, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి) :**

వేసవి కాలం లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ధర్మసాగర్ లో గల 60 ఎం.ఎల్.డి , 20 ఎం ఎల్ డి నీటి శుద్ధీకరణ కేంద్రాలలో పర్యటించి వరంగల్ మహా నగరానికి మరియు హన్మకొండ జిల్లాలోని గ్రామీణ ఆవాసాలకు తాగునీరు సరఫరా చేసే తీరును పరిశీలించి నిర్వహణ తీరును ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా రా వాటర్ లభ్యత ను గురించి అధికారులను అడుగగా 7.9 టి ఎం సి ల నీరు ఎల్ ఎం డి కరీంనగర్ నుండి అందుబాటులో ఉందని, సహజంగా 1 టిఎంసి నీటి నిల్వలు అందుబాటులో ఉంటే కనీసం 3 నెలల పాటు నగర అవసరాలకు సరిపోతాయని, రిజర్వాయర్ లో గల వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ను పరిశీలించిన కలెక్టర్ నగర పరిధిలో పునరుద్ధరించడానికి గల అవకాశాలను పరిశీలించాలని జిడబ్ల్యుఎంసి ఇంజినీరింగ్ అధికారులను సూచించారు. ఇరిగేషన్ ఫేజ్ 3 లో భాగం గా దేవాదుల నుండి ధర్మసాగర్ వచ్చే నీటి సరఫరా తీరును పరిశీలించి అక్కడి నుండి చేరే నీటి పరిమాణాన్ని అడిగి తెలుసుకున్నారు. నగరం లో గల ఫిల్టర్ బెడ్ లలో తాగునీటి సామర్థ్యం, రోజు పంపింగ్ అవుతున్న నీటి పరిమాణం, శుద్ధీకరణ జరుగుతున్న రా వాటర్ తో పాటు నీటి సరఫరా జరుగుతున్న పద్ధతి అడిగి తెలుసుకొని నీటి నాణ్యత ను నిర్ధారించే విధానాలను పరిశీలించి ల్యాబ్ లో ప్రత్యక్షం గా పర్యటించి నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ రామాంజనేయులు, ఎన్ ఐ టి మాజీ ప్రొఫెసర్ డా.పాండురంగారావు ఇరిగేషన్ ఈ ఈ మంగీ లాల్ బల్దియా ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.



## ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అభినందనలు

- **కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
- **సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో రాణించిన విద్యార్థులకు సన్మానం**

**పెద్దపల్లి, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి):**

సీఎం కప్ 2026 రాష్ట్రస్థాయి క్రీడ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణించిన క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక అభినందనలు తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో రాణించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. సీఎంకప్ రాష్ట్రస్థాయి పోటీలలో పెద్దపల్లి జిల్లా నుంచి వెళ్లిన 22 మంది విద్యార్థులు 4 బంగారు పతకాలు, 8 వెండి పతకాలు, 10 కంచు పతకాలు గెలుచుకున్నారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్, పేట ప్రెసిడెంట్ సురేందర్, పేట రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శోభరాణి, ఆర్చరీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సెక్రటరీ శ్రీనివాస్, వివిధ క్రీడల కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతం

**కరీంనగర్, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి) :**





రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా డ్రైవర్ల కోసం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం అత్యంత విజయవంతమైంది. పోలీస్ శాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ మెగా శిబిరంలో 448 మంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారు. నగరంలోని ప్రముఖ కంటి ఆసుపత్రుల వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని డ్రైవర్లకు అత్యాధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ వైద్యులు 85 మందికి, వాసన్ ఐ కేర్ కంటి వైద్య నిపుణులు 96 మందికి, లయన్స్ డాక్టర్ మాదేకర్ ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది 85 మందికి, శరత్ మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ వైద్యులు 95 మందికి, డాక్టర్ రాకేష్ ఐ హాస్పిటల్ వైద్యులు 87 మందికి అవసరమైన కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన డ్రైవర్లకు లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ తరఫున 200 కళ్లద్దాలు, కంటి చుక్కల మందులను ఉచితంగా అందజేశారు. అలాగే, రేకుర్తి హాస్పిటల్ వారు సుమారు 50 మందికి ఉచిత సర్జరీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ సురక్షిత చూపు సురక్షిత డ్రైవింగ్ సురక్షిత గమ్యం" అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. డ్రైవర్లకు కంటి చూపు సరిగ్గా ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అడిషనల్ డీసీపీ భీం రావు, ఏసీపీ లు వెంకటస్వామి, విజయకుమార్ ఇన్స్పెక్టర్లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ తరఫున ప్రెసిడెంట్ లయన్ ఏ.రవీందర్ రెడ్డి, వి. రాధాకృష్ణ రెడ్డి, వెంకట రమణ రెడ్డి, గౌతమ్ మరియు హెచ్.రాజిరెడ్డి పాల్గొన్నారు.

## పెండింగ్ పనుల త్వరగా పూర్తి చేయాలి

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**
**ఇందిరమ్మ ఇండ్ల పనుల పరిశీలన**

**సూర్యాపేట, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి) :**



ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం హుజూర్నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైతే ఎక్కువ మంది లేబర్ తీసుకొని పనులు పూర్తి చేసి మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించడానికి సిద్ధం చేయాలని అన్నారు. బ్లాక్ లో మధ్య గల అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, మొక్కలు నాటడం, పెయింటింగ్ పనులు, స్ట్రీట్ లైట్స్ మొదలైన అన్ని రకముల పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పిడి సిద్ధార్థ, మిషన్ భగీరథ ఇ.ఇ. కరుణాకర్‌రెడ్డి, తాసిల్దార్ కవిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి



**ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి**
**కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలి**
**10 వేల ఇందిరమ్మ ఇళ్లకు స్లాబింగ్ పూర్తి**
**ఖమ్మం జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం**
**కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్ష**



**ఖమ్మం, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి) :**

ప్రజలకు లబ్ది చేకూరేలా కేంద్ర ప్రాయోజిత పథకాలను జిల్లాలో పూర్తి స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలనీ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ సభ్యులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, రాందాస్ నాయక్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాలస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి పాల్గొన్నారు. దిశ సమావేశంలో ప్రస్తుతం వారి శాఖల పరిధిలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలపై జిల్లా సంక్షేమ అధికారి, జీఎం పరిశ్రమలు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, జిల్లా విద్యా శాఖ అధికారి, మున్సిపల్ కమీషనర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, పీ.డీ జాతీయ రహదారులు, పి.డి. హౌసింగ్, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ అధికారులు నివేదికలు వివరించారు. పార్లమెంట్ సభ్యుడు రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం స్థానంలో నూతనంగా వచ్చిన వికసిత్ భారత్ జి రామ్ జి పథకం మార్గదర్శకాలు ప్రతి ప్రజా ప్రతినిధికి అందేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను రెగ్యులర్ గా మానిటర్ చేయాలని అన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ద్వారా నడిచే వివిధ వైద్య సేవలలో ఉన్న ఖాళీలను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీకి చర్యలు తీసుకోవాలని, ఖమ్మం ఆసుపత్రి మరమ్మత్తు, క్రిటికల్ కేర్ బ్లాక్, ఇతర మౌలిక వసతుల పనుల పురోగతి వివరాలు అందించాలని అన్నారు. నిర్వహించాలని అన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి పనులపై రిపోర్ట్ అందించాలని, సంబంధిత మంత్రితో సమావేశమై నూతనంగా నిర్మించిన ఎన్‌హెచ్ త్వరగా ఓపెన్ అయ్యేలా చూస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలోని ఐటీఐ, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు పెద్ద ఎత్తున ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో ఉన్న సెంట్రల్ టూల్ డిజైన్ సెంటర్ కు కేంద్రం నుంచి నిధులు సాధించేలా ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రాబోయే రబీ సీజన్ లో ధాన్యం కొనుగోలు రవాణా కోసం వినియోగించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్నం భోజన నాణ్యతను జిల్లా అధికారులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని, రూ.45 లక్షలతో ప్రతి ప్రభుత్వ పాఠశాలకు గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో 3 వారాల వ్యవధిలో చెరువు పక్కన వేస్తున్న డంప్ తొలగించాలని, రోడ్డు పక్కన చెత్త డంప్ చేయరాదని అన్నారు.

జిల్లాలో పోడు పట్టాలలో బోర్లు వేసుకునేందుకు కొన్ని చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వీటిని పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అవసరమైన వసతుల అంశాలకు సంబంధించి తయారు చేసిన సంక్షిప్త నివేదిక ప్రజాప్రతినిధులకు అందించాలని, వీటిని ప్రభుత్వం ద్వారా మంజూరు అయ్యేలా ప్రజాప్రతినిధులు తమ వంతు ప్రయత్నం చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో 9 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ చేపట్టేందుకు పటిష్ట కార్యాచరణ చేపట్టామని, దీని వల్ల మహిళల్లో సర్వైవల్ క్యాన్సర్ రాకుండా చేయవచ్చని తెలిపారు. ఆర్.ఓ.బీ పనులు, టోల్ టెండరింగ్ పనులు సమాంతరంగా జరగాలని అన్నారు. మార్చి 20 నాటికి జిల్లాలో అత్యధికంగా ప్రమాదాలు జరిగే 30 జంక్షన్ లలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కు అవసరమైన చర్యలు పూర్తి చేస్తామని తెలిపారు. జాతీయ రహదారులకు సంబంధించి భూ సేకరణ చివరి దశకు చేరుకుందని, భూ సేకరణ అంశం కోర్టులో పెండింగ్ ఉన్న వాటిపై రైతులతో చర్చిస్తూ సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 10 వేల ఇందిరమ్మ ఇండ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయని, వీటిని 2 నెలల్లో పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసేలా పనిచేస్తున్నామని అన్నారు. ధంసలాపురం వద్ద అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్దిదారులకు కేటాయించి పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. వైరా పట్టణ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయింపుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం స్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ జి రాంజీ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ కూలీలకు పని వేళలు ఏమైనా తగ్గాయా స్టడీ చేసి రిపోర్ట్ అందించాలని కోరారు. జిల్లాలో మంజూరు అయిన ఉపాధి హామీ పనులు, వాటి పురోగతి మనకు ఇంకా రావాల్సిన పెండింగ్ బకాయిల అంశం ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేయాలని అన్నారు. విద్యాశాఖ పరిధిలో అనీమియా బారిన పడే పిల్లలను గుర్తించి అవసరమైన పోషకాహారం అందేలా చూడాలని అన్నారు. ఆసుపత్రులలో సి సెక్షన్ డెలివరీ తక్కువ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖమ్మం దేవరపల్లి ఎన్.హెచ్ ఎప్పటి వరకు ఓపెనింగ్ అవుతుందో చెప్పాలని, ఎన్.హెచ్ ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టాలు పొందిన రైతులు బోర్లు వేసేందుకు, కరెంట్ పెట్టుకునేందుకు ఇబ్బందులకు గురి కాకుండా చూడాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు కొంత మందికి నిర్మాణం మధ్యలో ఎల్ 1 నుంచి ఎల్ 3 మార్చడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని, మొదటి దశలో మంజూరు చేసిన ఇండ్లు వర్షాకాలం రాకముందే పూర్తయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ సత్తుపల్లి ఆసుపత్రి సెక్యూరిటీ గార్డ్స్ డిప్యూటేషన్ పై మరో చోట పని చేయడం వల్ల చాలా ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. సత్తుపల్లి ఆసుపత్రికి కేటాయించిన అంబులెన్స్ డ్రైవర్ పోస్ట్ శాంక్షన్ చేయాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, మున్సిపల్ చైర్ పర్సన్లు, సర్పంచులు, జిల్లా అధికారులు, దిశ కమిటీ సభ్యులు, మునిసిపల్ కమిషనర్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## విశ్వహిందుపరిషత్ భజరంగ్‌దళ్ నూతన కమిటీ ఏర్పాటు

**నిజాంసాగర్, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి):**

నిజాంసాగర్ మండలంలోని గొర్గల్ గ్రామ శివారులో గల శ్రీ బెడల మైసమ్మ ఆలయం వద్ద విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశ్వహిందూ పరిషత్ కామారెడ్డి జిల్లా త్రి ప్రఖండ సంఘటన మంత్రి వినోద్ కుమార్ మాట్లాడుతూ హిందూ ధర్మంలో ఉన్నటువంటి సంస్కృతులను సంప్రదాయాలను హిందూ ధర్మ విలువలని కాపాడడానికి హిందూ దేవాలయాల పైన దాడులను అరికట్టడానికి హిందూ అమ్మాయిలను లవ్ జిహాద్ నుండి హిందువులను మతమార్పిడుల నుండి కాపాడడానికి, గోమ తల పైన జరుగుతున్నటువంటి అక్రమ రవాణాని నిలిపివేయడానికి, హైందవ ధర్మాన్ని కాపాడే ధర్మ రక్షకులుగా ప్రతి గ్రామంలో హనుమాన్ చాలీసా పారాయణం తో భక్తిని శక్తిని నింపి గ్రామ గ్రామాన హిందువులను ఏకీకృతం చేయడం కోసం ధర్మ రక్షణే ధ్యేయంగా విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షులుగా నారాయణ, ఉపాధ్యక్షులు: శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి కుమార్, సహకార్యదర్శి రాకేష్ నాయక్, సత్సంగ్ ప్రముక్ లక్ష్మన్ దాస్, సహ ప్రముక్ రాకేష్, బజరంగ్దళ్ సంయోజక్ సందీప్ కుమార్, సాహ సంయోజక్ నవీన్ గౌడ్, గోరక్ష ప్రముక్ యోగేశ్వర్, సహ ప్రముక్ హరికృష్ణ, విద్యార్థి ప్రముక్, రాకేష్ నాయక్, సహ ప్రముక్ మహేష్ భజరంగ్‌దళ్ కార్యకర్తలు తదితరులతు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శ్రీకారం

**నిజాంసాగర్, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి):**

నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో గ్రామ సర్పంచు గుర్రపు సుమిత్ర శ్రీనివాస్ కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శుక్రవారం ముగ్గుపోశారు. ఇందిరమ్మ ఇంటి కమిటీ సభ్యులతో కలిసి గ్రామానికి చెందిన లబ్దిదారులు, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు గుర్రపు వెంకటేశం, కమ్మరికత సాయిలు, మామిళ్ళ నారాయణ, సుదర్శన్, మెంగారం సాయిలు, లక్ష్మయ్య, చింతకింది అనిత సాయిలు, చిన్నోళ్ళ జగన్, వడ్ల పండరి, ఖాసీం, బాలరాజ్, గ్రామపంచాయతీ కార్యదర్శి భారతి గ్రామపెద్దలు తదితరులలు పాల్గొన్నారు.

## భూదాన్ భూముల ఆక్రమణలో తొలగించిన ఇండ్ల సర్వే


- **కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **అర్హులైన పేదవారికి అండగా ప్రభుత్వం**
- **తొలగించబడిన ఇండ్లకు సంబంధించిన వారు సర్వేకు సహకరించాలి**

**ఖమ్మం, ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి) :**

ఈ నెల 24న ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామ భూదాన్ భూముల ఆక్రమణలో తొలగించబడిన ఇండ్లకు సంబంధించి, వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వేను వెంటనే చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలగించబడిన ఇండ్లకు సంబంధించిన వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టుటకు జిల్లాలోని 14 మంది తహాశీల్దార్లకు ఆదేశాలు జారీచేసినట్టు కలెక్టర్ అన్నారు. ఈ సర్వే అత్యంత త్వరితగతిన పూర్తిచేయుటకు తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. సామాజిక, ఆర్థిక సర్వే పూర్తయిన తర్వాత అర్హులైన వారికి ప్రభుత్వాదేశానుసారం నివాస స్థల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుకు చర్యలు చేపడతామన్నారు. తొలగింపబడిన ఇండ్లకు సంబంధించిన వ్యక్తులు, వారి వారి గ్రామాల్లో అందుబాటులో ఉండి, సర్వేకు సహకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ టాలెంట్ టెస్ట్

**ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో**
**పది పరీక్షల్లో ప్రతిభ కనబరచాలి**



**పరకాల ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి):**

ఎస్ఎఫ్ఐ పరకాల మండల కమిటీ మడికొండ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ శారద స్కూల్ మరియు గర్ల్స్ హై స్కూల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరకాల ఆర్డిఓ నారాయణ విచ్చేసి విద్యార్థులకు క్వషన్ పేపర్ విడుదల చేసి టాలెంట్ టెస్ట్ పరీక్షను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పరకాల ఆర్డిఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకొని తల్లిదండ్రులకు మరియు గురువులకు పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థుల చేతుల్లో ఈ దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. పదో తరగతి ఎగ్జామ్ రాస్తున్న ప్రతి ఒక్కరూ ఇది మీకు మొదటి మెట్టు అన్నారు. విద్యార్థుల వల్లే ఈ దేశం మంచి మార్గంలో నడుస్తుందని మార్చిలో జరగబోయే టెన్త్ ఫైనల్ ఎగ్జామ్స్ లో ప్రతి ఒక్కరూ వారి ప్రతిభను కనపరచలన్నారు. ఈ కార్యక్రమంలో శారద స్కూల్ సంతోష్ సార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్ జిల్లా కమిటీ సభ్యుడు సాల్మన్ రాజ్. జిల్లా కమిటీ సభ్యుడు హేమంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కోదాడ ప్రజల గుండె చప్పుడు

## ఎర్నేని కుసుమ బాబు

● పారిశుద్ధ్యం నుంచి ప్రజా సమస్యల దాకా నిత్యం ప్రజల్లోనే మున్సిపల్ చైర్‌పర్సన్

**కోదాడ, ఫిబ్రవరి 27(వుదయం)**



పట్టణ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న పేరు ఎర్నేని కుసుమ వెంకట్‌రత్నం బాబు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కోదాడ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకురాలిగా, సమస్యలపై వెంటనే స్పందించే ప్రజాప్రతినిధిగా ఆమెకు మంచి పేరు ఏర్పడింది.పట్టణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన కుసుమ బాబు, "పారిశుద్ధ్యంలో కోదాడను అగ్రస్థానంలో నిలపాలి" అన్న సంకల్పంతో వార్డు వార్డుకు పర్యటిస్తున్నారు. దోమల నివారణ పిచికారీలు, డ్రైనేజీ శుభ్రత, చెత్త సేకరణపై ప్రత్యేక చర్యలు చేపడుతూ మున్సిపల్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడటం తమ ప్రధాన బాధ్యత అని పలుమార్లు పేర్కొన్నారు.కేవలం పారిశుద్ధ్యమే కాదు, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, మౌలిక వసతుల అభివృద్ధి విషయాల్లోనూ జిల్లా కలెక్టర్‌ను కలిసి నిధుల కోసం విజ్ఞప్తి చేయడం ఆమె చురుకుదనానికి నిదర్శనం. సమస్యల పరిష్కారంలో ఆలస్యం కాకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపే నాయకురాలిగా కుసుమ బాబు పేరు పొందారు. "ప్రజల నమ్మకమే నా బలం" అని చెప్పే ఆమె, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు స్పష్టం చేస్తున్నారు.
సామాన్య కుటుంబం నుంచి వచ్చి ప్రజాసేవలో అడుగుపెట్టిన కుసుమ బాబు, తన సాదాసీదా స్వభావం, అందరితో కలిసిమెలిసి ఉండే తీరు వల్ల కోదాడ ప్రజల గుండె చప్పుడుగా మారారు. పట్టణాభివృద్ధి పథంలో కోదాడను ముందుకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ఆమె చేస్తున్న కృషి పట్ల ప్రజల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది.

# మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పరిశీలన

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ సత్య శారద

**వరంగల్, ఫిబ్రవరి**

**(వుదయం జిల్లా ప్రతినిధి) :**

వరంగల్ నగరంలో నిర్మాణంలో ఉన్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సత్య శారద గారితో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి పనులపై ఎంజీఎం సూపరింటెండెంట్, ఎల్ టీ అధికారులు, ఆర్ బీ, విద్యుత్ శాఖ, జీడబ్ల్యూఎంసీ, ఫైర్ శాఖ అధికారులతో ఎంపీ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆసుపత్రి నిర్మాణ పురోగతిని అధికారులు ఎంపీకి వివరించారు.ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మిస్తున్నారని తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేసి, ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని, రోగులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. .ఉత్తర తెలంగాణ ప్రజల వైద్య అవసరాల కోసం నిర్మిస్తున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ త్వరలోనే అందుబాటులోకి రానుందని తెలిపారు. ఉత్తర తెలంగాణకు తలమానికంగా నిలిచే ఈ ఆసుపత్రి ద్వారా వరంగల్‌తో పాటు పలు జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. త్వరలోనే ఓపీ, ఐపీ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ఆసుపత్రికి సరిపడ డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ సిబ్బంది సేవలందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వయంగా 24 అంతస్తుల భవనంలోని అన్ని ఫ్లోర్‌లలో తిరిగి జరుగుతున్న పనులను పరిశీలించారు. హైదరాబాద్ స్థాయి వైద్య సేవలు వరంగల్‌లోనే అందుబాటులోకి రానున్నాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు .ఈ కార్యక్రమంలో ఆర్&బి SE రాఘవరెడ్డి, ఆర్ & బి EE రాజేందర్, L&T ప్రాజెక్టు మేనేజర్ శ్రవణ్ కుమార్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్ చంద్రారెడ్డి, RMO అశ్విన్ కుమార్, జిల్లా ఫైర్ అధికారి శ్రీధర్ రెడ్డి, NPDCL – SE గీతం రెడ్డి, ఆర్ & బి E E ఎలక్ట్రికల్ నర్సయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మున్సిపల్ కార్పొరేషన్ రవికుమార్, MRO శ్రీకాంత్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్లకు 9 నెలల జీతాలు చెల్లించాలి

సిపిఐఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కే కాశీనాథ్

**నారాయణపేట టౌన్ ,ఫిబ్రవరి 27(వుదయం ప్రతినిధి)**



నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సుమారు 70 మంది వర్కర్లకు గత తొమ్మిది నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అత్యంత అన్యాయమని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కే కాశీనాథ్ తీవ్రంగా ఖండించారు.నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి జిల్లా కేంద్రానికి దాదాపు 10 కిలోమీటర్ల దూరంలో అప్పక్‌పల్లి గ్రామంలో ఉంది.
అక్కడ విధులు నిర్వహిస్తున్న వర్కర్లు ప్రతిరోజూ ప్రయాణ ఖర్చులు భరించాల్సి వస్తోంది,అయితే నెలల తరబడి జీతాలు రాకపోవడంతో, వారు బస్ ఛార్జీలు కూడా చెల్లించలేని దుస్థితికి చేరుకున్నారు. కుటుంబాలను పోషించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులు వంటి ప్రాథమిక అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి నెలకొంది అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రోజూ సమయానికి డ్యూటీకి హాజరు కాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేసే అధికారులు, అదే విధంగా తొమ్మిది నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంపై మాత్రం బాధ్యత వహించడం లేదన్నారు. ఇది కార్మికుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని, అమానవీయ వైఖరిని ప్రభుత్వ అధికారులు అవలంబిస్తున్నారని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే ఈ వర్కర్లు ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. శుభ్రత, భద్రత, సహాయక సేవలు వంటి రంగాల్లో వారు నిరంతరం శ్రమిస్తున్నారు. అలాంటి కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం ప్రజా ఆరోగ్య వ్యవస్థ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల జీతాలను వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని ఈ సమస్యపై జిల్లా కలెక్టర్

, స్థానిక ఎమ్మెల్యే , జిల్లా మంత్రి వాకిటి శ్రీహరి తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ డిమాండ్ చేస్తుందని లేనిపక్షంలో బాధిత వర్కర్లతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

# పేదలకు ఆపన్న హస్తం లాంటిది సీఎం సహాయనిధి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**వెల్దండ , ఫిబ్రవరి 27 (వు దయం ప్రతినిధి)**

సీఎం సహాయ నిధి 0 పేద ప్రజలకు ఆపన్న హస్తం లాంటిదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వెల్దండ మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన ఖర్చులకు గాను మంజూరైన 22 వేల రూపాయల సీఎం సహాయనిధి చెక్కును మరియు ఉప్పు సాయమ్మకు మంజూరు
అయిన 60 వేల రూపాయల చెక్కు లబ్ధిదారునికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి అనేది పేద ప్రజలకు మృత సంజీవని లాంటిదని ఆపద సమయంలో ఆదుకునే ఆపన్న హస్తం అని అన్నారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు జరుపుల శ్రీను నాయక్, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, దినేష్ సాగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన కోదాడ చైర్‌పర్సన్



మున్సిపాలిటీ అభివృద్ధికి నిధుల మంజూరుపై విజ్ఞప్తి

**సూర్యాపేట, ఫిబ్రవరి 27(వుదయం)**

కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.
కోదాడ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.పట్టణంలో తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కోదాడను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు జిల్లా పరిపాలన పూర్తి సహకారం అందించాలని కోరారు.సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్నేని వెంకట్‌రత్నం బాబు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు విడుదల చేసి, అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలి

## తెలంగాణ సీఎస్ రామకృష్ణ రావుకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే విజయుడు

**అలంపూర్ ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి)**



అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధి, ముఖ్యంగా పాఠశాలల ఆధునీకరణ పనులపై అలంపూర్ శాసనసభ్యులు విజయుడు శుక్రవారం రోజు హైదరాబాద్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుని కలిశారు. నియోజకవర్గంలోని పలు పెండింగ్ అంశాలపై చర్చించి, వారికి అధికారికంగా వినతి పత్రం సమర్పించారు.నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల్లో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. నిధుల కొరత లేదా ఇతర కారణాలతో ఆగిపోయిన పాఠశాలల పనులను త్వరితగతిన పునఃప్రారంభించి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని విన్నవించారు. విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తూ, అలంపూర్ నియోజకవర్గం లోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మెరుగు పరచడానికి ప్రభుత్వం నుండి పూర్తి సహకారం కావాలని ఎమ్మెల్యే కోరారు. వినతిపై సీఎస్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, పెండింగ్ బిల్లుల విడుదల, అసంపూర్తి పనుల పూర్తికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు డా.కురువ విజయ్ కుమార్, వెంకట్రాముడు, రఘురెడ్డి, రవీందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.


# మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ సర్పంచ్ అబ్దుల్ రషీద్

**ఊర్కొండ, ఫిబ్రవరి 27(వుదయం)**



నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఈరోజు ఊర్కొండపేట గ్రామంలో శుక్రవారం మహిళా సంఘం భవన నిర్మాణానికి ఘనంగా భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ అబ్దుల్ రషీద్, ఉప సర్పంచ్ రేపాని శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై, శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ.. "మహిళా సంఘాల సభ్యులు తమ సమావేశాలను మరియు ఇతర కార్యకలాపాలను సొంత భవనంలో నిర్వహించుకోవడం వల్ల వారి ఆర్థిక, సామాజిక సాధికారత మరింత మెరుగుపడుతుంది. గ్రామ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉంది, ఈ భవనం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు.అలాగే, నియోజకవర్గ శాసనసభ్యులు అనిరుధ్ రెడ్డి సహకారంతో ఊర్కొండపేట గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని, ప్రజలందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ మహేందర్, పంచాయతీ కార్యదర్శి ఇబ్రాహీం, వార్డు సభ్యులు రామాంజనేయులు, సహదేవ్, గ్రామ నాయకులు అజహర్, జహీర్, చంద్రయ్య, హరీష్, లైన్మెన్ వల్య నాయక్, సంజన్న, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గద్వాలలో వీధి కుక్కల బీభత్సం




: మూడు గేదెలు మృతి

**గద్వాల ,ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని 3వ వార్డులో గురువారం రాత్రి వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. స్థానిక రైతు సురేష్‌కు చెందిన గేదెలపై కుక్కలు దాడి చేయడంతో, తీవ్ర గాయాలపాలై మూడు గేదెలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ నాగులు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు రంజిత్ కుమార్, అఖిల్ రెడ్డి బాధిత రైతును పరామర్శించారు.
పట్టణంలో వీధి కుక్కల బెడద పెరిగిపోతోందని, తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను తరలించాలని వారు డిమాండ్ చేశారు.

# కుకునూర్‌పల్లి పాఠశాలలో బాలికల సాధికారతపై అవగాహనా సమావేశం

**కుకునూరు పల్లి/ కొండపాక ఫిబ్రవరి 27(వుదయం)**




బాలికలు నేటి సమాజంలో ఎలా నడుచుకోవాలి, జీవితంలో ఎలా స్థిరపడాలి, సమాజానికి ఆదర్శప్రాయంగా నిలవడానికి ఎంచుకోవాల్సిన దారుల గురించి అవగాహన కల్పించడానికి గాను శుక్రవారం రోజు కుకునూరు పల్లి జిల్లా పరిషత్ స్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫిజియోథెరపీ డాక్టర్ భవ్య మాట్లాడుతూ బాలికలు విద్య, క్రీడలు, సాంకేతిక రంగాల్లో ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు.సమాజంలో ఉన్న అడ్డంకులను అధిగమించి తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం, ఉన్నత విద్యావకాశాలు, ప్రభుత్వ పథకాల వినియోగం వంటి అంశాలపై మార్గదర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.ఎంఈఓ బచ్చలి సత్తయ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని తెలిపారు. బాలికలు తమ ప్రతిభను వెలికితీసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# కునారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి (ఆర్.ఓ.బీ) అప్రోచ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి కూనారం ఆర్.ఓ.బీ పనులు పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, ఫిబ్రవరి-27**

**(వుదయం ప్రతినిధి)**



కూనరం రైల్వే ఓవర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి కూనారం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి కూనారం ఆర్.ఓ.బీ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసి సంబంధిత శాఖకు బదలాయించామని,
అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైన నేపథ్యంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని అన్నారు.
అండర్ పాస్ పనులు నెల రోజుల లోపు పూర్తి చేయాలని, ఆర్.ఓ.బి పూర్తయ్యే లోపు అప్రోచ్ రోడ్డును కూడా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకుని రావాలని రైల్వే శాఖ అధికారులను, ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఆర్ &బీ భావ్ సింగ్,పెద్ద పల్లి ఆర్డిఓ బి.గంగయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పోలీసు కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా



**కరీంనగర్, ఫిబ్రవరి 27**

**(వుదయం ప్రతినిధి):**

కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన చిత్ర మిశ్రా, గురువారం నాడు జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందజేశారు. జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, జిల్లా యంత్రాంగం మరియు పోలీస్ శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకోవడంలో భాగంగా ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, తాజా పరిస్థితులు మరియు ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై కలెక్టర్, సీపీలు క్లుప్తంగా చర్చించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా భద్రత కోసం రెవెన్యూ మరియు పోలీస్ శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

# వాహన దారులు నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్

**జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 27**

**(వుదయం జిల్లా ప్రతినిధి):**

వాహన దారులు హెల్మెట్ వినియోగం తప్పని సరి చేసుకోవాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.శుక్రవారం గణపురం పోలీస్ స్టేషన్‌లో చక్రవర్తి హాస్పిటల్ వరంగల్, శ్రీకాంత్ మిత్ర బృందం, జర్నలిస్టుల సంయుక్త ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ల ఉచిత పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ దరించకుండా వాహన దారులు
నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్ని నియమ నిబంధనలు విధించినా ప్రజలు వాటిని కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత ఉందని అపుడే ప్రమాదాలు నివారించగలమని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తో పాటు హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రాణం పోయిన తర్వాత బాధపడినా ఉపయోగం లేదని, ముందస్తు జాగ్రత్తలే ప్రాణాలను కాపాడుతాయని తెలిపారు.వాహనం నడిపేవారితో పాటు వెనుక కూర్చునేవారు కూడా విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎక్కడైనా వాహనాలు పట్టుకున్నప్పుడు తన పేరు చెప్పినా విడిచిపెట్టవద్దని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. సింగరేణి, ఎఎంఆర్, జెన్కో, మెగా తదితర సంస్థల ద్వారా మరిన్ని హెల్మెట్లు పంపిణీ చేయాలని కోరారు. చక్రవర్తి హాస్పిటల్ అధినేత డా తరుణ్ రెడ్డి 200 హెల్మెట్స్ వితరణ చేయాలని కోరగా ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారు. వ్యాపారవేత్తలు హెల్మెట్స్ వితరణ చేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జనవరి మాసం మొత్తం రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడం అత్యంత ముఖ్యమని, ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్ అనే సిద్ధాంతాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఒక వ్యక్తి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం మొత్తం తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. వేగ నియంత్రణ పాటించాలని, చలానా వేస్తారనే భయంతో కాకుండా ప్రాణ భద్రత కోసం హెల్మెట్ ధరించాలన్నారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించని వారికి పెట్రోల్ బంకుల్లో ఇంధనం ఇవ్వకూడదని సూచించారు. గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 6500 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించినట్లు తెలిపారు. రహదారి భద్రతను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు.

# అఖిల భారత మహిళల టోర్నమెంట్‌లో తెలంగాణ టెన్నిస్ క్రీడాకారిణుల ప్రతిభ



**హైదరాబాద్ ఫిబ్రవరి 27**

**(వుదయం ప్రతినిధి):**

;హర్యానా పానిపట్‌లో జరిగిన అఖిల భారత మహిళల 2.5 లక్షల టోర్నమెంట్‌లో తెలంగాణ టెన్నిస్ క్రీడాకారిణులు సింగిల్స్ (టిఎస్) హాసిని యాదవ్ బిటి (టిఎస్) సంజన శ్రీమల్లా 7–5; 7–5 ,డబుల్స్ (TS)ఓమ్నా & సంజన బిటి (GT)సెల్వీ & దేవాన్షి 6–1; 6–2 లు పతకాలు సాదించారు.కోచ్ గా – గురునాథ్ డామే అకాడమీ NSTA ఇరిసెట్ క్లబ్ సికింద్రాబాద్ వ్యవహరించారు.

# ఆయిల్ ఫెడ్ సహకారంతో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే జారే



**దమ్మపేట ఫిబ్రవరి 27 (వుదయం ప్రతినిధి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేట గ్రామంలో టీజీ ఆయిల్ ఫెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను సర్పంచ్ శ్రీమతి రాధా చలపతిరావు, ఉప సర్పంచ్ కోనేశ్వరరావు, గ్రామ పెద్దలు రావు గంగాధర్ ఆధ్వర్యంలో గౌరవ శాసనసభ్యులు శ్రీ జారే ఆదినారాయణ మినీ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రావు పండు, ప్రధాన కార్యదర్శి జేపీ,కార్యదర్శి దుర్గారావు , కారుమంచి పుల్లారావు , కారుమంచి శ్రీకాంత్, బుద్ధ రాజు, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

# వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవ్యాలయంలో అన్న ప్రసాద వితరణ



**మధిర, వుదయం**

మధిర శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవ్యాలయంలో ప్రతి శుక్రవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం లో భాగంగా శుక్రవారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవ్యాలయంలో వందనపు శ్రీనివాసరావు మెడికల్,వందనపు షర్మిల పెళ్లిరోజు సందర్భంగా భవిరిశెట్టి సాంబశివ రావు,లలిత ఆర్థిక సహకారంతో అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేయడం జరిగినది.అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి ములుగుమాడు గ్రామం వైస్ ప్రెసిడెంట్ మైలవరపు సత్యనారాయణ మాట్లాడుతూ అన్నిదానాలలో కెల్లా అన్నదానం మిన్న అని,అన్నం పరబ్రహ్మ స్వరూపమని ప్రతి ఒక్కరూ పుట్టినరోజు,పెళ్లిరోజుల సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని,అన్నదాతలను ప్రోత్సహించాలని కోరారు.శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవ్యాలయంలో ప్రతి శుక్రవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల దేవాలయ కమిటీని అభినందించారు.ఈ కార్యక్రమంలో పల్లపోతు ప్రసాదరావు,రంగాహనుమంతరావు,వనమావేణుగోపాలరావు,కురువెళ్ళవెంకటపురుషోత్తమరావు,పుల్లఖండంసత్యానారాయణమూర్తి,గుండెల ముత్తయ్య,వంగవీటి రాజశేఖర్,దాచేపల్లి రాము తదితరులుపాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

**మధిర, వుదయం**



మధిర శ్రీ వాసవి కన్యాకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఎరుపాలెం మండలం ములుగుమాడు గ్రామ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన మైలవరపు సత్యనారాయణని సత్కరించడం జరిగినది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా మరింతగా ఎదిగి ప్రజాక్షేత్రంలో తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. సమాజం లో ఉన్న పేద ఆర్యవైశ్యులను ప్రతి ఒక్కరూ ఆదుకుని అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుండి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఐక్యతతో ముందుకు సాగితే ఆర్యవైశ్యుల శక్తి మరింత బలపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పల్లపోతు ప్రసాదరావు,వనమావేణుగోపాలరావు, కురువెళ్ళవెంకటపురుషోత్తమరావు, పుల్లఖండంసత్యనారాయణమూర్తి,గుండెలముత్తయ్య, వంగవేటిరాజశేఖర్, దాచేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ పెద్ద గడియారం వద్ద ధర్నా కార్యక్రమం



ఈరోజు రాజ్యసభ సభ్యులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణన్న ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ్ అన్న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిరసనలు పిలుపుమేరకు నల్లగొండ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ పెద్ద గడియారం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది నాగ కర్నూల్ జిల్లా గ్రామం కొమ్మెర నాలుగు రోజుల క్రితం జరిగినటువంటి రజక సోదరుడు బిడ్డ రెండు నెలల పసికందుని అతికిరాతకంగా తొక్కి చంపడం జరిగింది ఈ కంప్యూటర్ యుగంలో కూడా ఇలా చేయడం చాలా దారుణం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి జిల్లా అధ్యక్షులు దుదుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నాగర్ కర్నూలు జిల్లా కొమ్మెర గ్రామానికి చెందిన మౌనిక రెండు నెలల పసికందుని అని చూడకుండా అతికిరాతకంగా కింద పడేసి తొక్కి చంపడం చాలా దారుణం ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆ నిందితులను అదుపులో తీసుకొని శిక్ష విధించి ఆ కుటుంబానికి కోటి రూపాయలు నష్ట పర్యాయం ఒక ఉద్యోగం మరియు ప్రభుత్వం పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఇలాంటి దారుణం ఇంకా ఎక్కడ జరగకుండా చర్యలు తీసుకొని ఈ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలని నలగొండ బీసీ సంక్షేమ సంఘం నుంచి డిమాండ్ చేస్తా ఉన్న నుఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ రాందేవ్ మోడీ బీసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కట్ట హరిబాబు బీసీ సంక్షేమ సంఘం టౌన్ ప్రెసిడెంట్ పుట్టా వెంకన్న జిల్లా కార్యదర్శి నాగరాజ్ గౌడ్ బిసి యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెబోయిన సతీష్ యాదవ్ ఎడ్ల మహాలింగం విద్యార్థులు విద్యార్థిని పెద్ద ఎత్తున పాల్గొని ఆ కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

# గ్రామస్తుల సమస్యలపై తహసిల్దార్ కు వినతి పత్రం..



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, వుదయం**

చుంచుపల్లి మండలం ధన్బాద్ గ్రామ పంచాయతీ పరిధిలో గల ఫైవ్ ఇంక్లైన్ మాయాబజార్ గ్రామస్తులు చుంచుపల్లి మండల తహసిల్దార్ కి తమకు ఉన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సింగరేణి ప్రభావిత ప్రాంతమైన ఫైవ్ ఇంక్లైన్ మాయాబజార్ లో ఇండ్లు కోలిపోయిన అర్హులందరికీ ఇండ్ల స్థలాలు ఇళ్ల పట్టాలు అందించాలని,ఇండ్లు కోల్పోయిన వారికి స్థలాలు ఇచ్చిన ప్రదేశంలో రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీరు, స్ట్రీట్ లైట్లు వంటి సమస్యలను తక్షణమే స్పందించి పరిష్కరించాలని కోరారు. నిరుద్యోగులకు డిఎల్ఆర్ గా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. గ్రామస్తుల సమస్యలపై చుంచుపల్లి మండల తహసిల్దార్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తామని అన్నారు.

# ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా విద్యా కమిషన్ నివేదిక – ఉపాధ్యాయుల హక్కులపై గొడ్డలి పెట్టు

తెలంగాణ విద్యా కమిషన్ (ఆకునూరి మురళి కమిటీ) సమర్పించిన "తెలంగాణ విద్యా విధానం 2026" నివేదిక ప్రభుత్వ విద్యా వ్యవస్థ పునాదులను దెబ్బతీసేలా ఉందని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (TRTF) తీవ్రంగా ఆక్షేపిస్తోంది. ఈ నివేదిక ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కించపరచడమే కాకుండా, విద్యార్థుల విద్యా హక్కును కాలరాసేలా ఉందని TRTF నల్లగొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మనగోటి జనార్ధన్, తరాల పరమేశ్ యాదవ్ లు పేర్కొన్నారు.1. విద్యాహక్కు చట్టానికి (RTE-2009) తూట్లు: కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన విద్యా హక్కు చట్టం ప్రకారం.. ప్రతి కిలోమీటర్ పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల ఉండాలి. అప్పుడే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందుబాటులో ఉంటుంది. కానీ, కమిషన్ ప్రతిపాదించిన "మూడు గ్రామాలకు ఒక పాఠశాల" అనే విధానం గ్రామీణ ప్రాంతాల్లోని పేద పిల్లలను చదువుకు దూరం చేయడమే. ఇది రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కును ఉల్లంఘించడమే.2. ప్రభుత్వ బడులు ప్రయోగశాలలా?: ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొత్త పేర్లతో వ్యవస్థను గందరగోళానికి గురిచేస్తున్నారు. గతంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు 'సక్సెస్' పాఠశాలలను, కిరణ్ కుమార్ రెడ్డి గారు 'మోడల్ స్కూల్స్'ను, కేసీఆర్ ప్రభుత్వం 'గురుకులాలను' తీసుకొచ్చాయి. ఇప్పుడు ఈ ప్రభుత్వం 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (TPS)' పేరుతో ఉన్న వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. ఉన్న పాఠశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, కేవలం పేర్లు మారుస్తూ ప్రయోగాలు చేయడం వల్ల క్షేత్రస్థాయిలో విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోంది.3. వేతనాలపై అసంబద్ధ వ్యాఖ్యలు – ఉపాధ్యాయుల శ్రమకు అవమానం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులను నియంత్రించాల్సిన కమిషన్.. ఆ బాధ్యతను విస్మరించి ఉపాధ్యాయుల వేతనాలు "మార్కెట్ రేట్ల కంటే ఎక్కువగా ఉన్నాయి" అని వ్యాఖ్యానించడం అత్యంత దారుణం. ఇది వేతన సవరణ కమిటీ (PRC) కాదు అన్న విషయాన్ని కమిషన్ గుర్తించాలి. రెగ్యులర్ నియామకాల కంటే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతులకు పెద్దపీట వేయడం విద్యా నాణ్యతను దెబ్బతీయడమే.4. పదోన్నతులపై గొడ్డలి పెట్టు (HM మరియు MEO వ్యవస్థ):హెడ్ మాస్టర్ నియామకాలు: హైస్కూల్ హెడ్ మాస్టర్ పోస్టుల్లో 50% నేరుగా నియామకాలు చేపట్టాలని, భవిష్యత్తులో 100% డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేయాలన్న సిఫార్సు సర్వీసులో ఉన్న స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతి అవకాశాలను అంధకారం చేస్తుంది.MEO మరియు సీనియారిటీ: మండల విద్యాధికారుల నియామకంలో మరియు ఉపాధ్యాయ పదోన్నతుల్లో దశాబ్దాలుగా ఉన్న సీనియారిటీ పద్ధతిని రద్దు చేసి, రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు పెట్టడం అశాస్త్రీయం. ఇది పదోన్నతుల్లో రాజకీయ జోక్యానికి, అవినీతికి దారితీస్తుంది.5. ఆర్థిక ఆంక్షలు – ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (AAS): ఉపాధ్యాయులకు ఆర్థిక భరోసా ఇచ్చే 6/12/18/24 ఏళ్ల స్కేళ్లను బడ్జెట్ భారంగా భావించడం విచారకరం. వీటిని పనితీరుతో ముడిపెట్టడం వల్ల ఉపాధ్యాయులలో అభద్రతా భావం ఏర్పడుతుంది. గడిచిన దశాబ్ద కాలంలో విద్య బడ్జెట్ 10% నుండి 5.9%కి పడిపోయిన విషయాన్ని అంగీకరించిన కమిషన్, నిధుల సేకరణకు స్పష్టమైన కార్యాచరణ చూపకుండా ఉపాధ్యాయుల ప్రయోజనాలపై దాడి చేస్తోంది. 6. జవాబుదారీతనం లేని సంస్కరణలు – పనివేళలు: ఉపాధ్యాయులు పనిచేసే గ్రామం లేదా 15 కి.మీ పరిధిలోనే నివాసం ఉండాలన్న నిబంధనలు ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేస్తాయి. మౌలిక వసతులు కల్పించకుండా కేవలం నిబంధనలు రుద్దడం వల్ల విద్యా నాణ్యత పెరగదు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఫోటోలు, విగ్రహాలపై ఆంక్షలు విధించాలనే ప్రతిపాదన అనవసరమైన వివాదాలకు దారితీస్తుంది. TRTF డిమాండ్: తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ ఉపాధ్యాయ వ్యతిరేక నివేదికను పక్కన పెట్టాలి. ప్రైవేట్ రంగ నియంత్రణ మరియు ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి సారించాలి.

# ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లు కూల్చడమేనా...!

**ఖమ్మం, వుదయం**



ఇందిరమ్మ రాజ్యం అంటే కూలీ పనులు చేసుకుంటూ గూడు ఏర్పరుచుకున్న నిరుపేదల ఇళ్లను కూల్చి వారిని మెడ పట్టి గెంటి టివేయడమే ఇందిరమ్మ రాజ్యమా అని పలువురు వామ పక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ళ కూల్చి వేత సందర్భంగా ఎటువంటి నోటిసులు లేకుండా వారి సామాన్లు కూడా తీసుకోనివ్వకుండా 2వేల మంది పోలీసులను,వందలాది మంది అధికారులను ఏర్పాటు చేసి తెల్లవారు జామునుంచే కూల్చి వేయడం గాజ్రాయిల్ పై ఇజ్రాయిల్ చేసిన దమన కాండను గుర్తు చేసిందన్నారు.ఖమ్మం నగరంలోని సిపిఐ ఎం ఖమ్మం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు .ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో గల భూదాన్ భూముల్లో గత 10 సంవత్సరాల క్రితం నుంచి నిరు పేదలు పట్టాలు పొంది 600మంది నివసిస్తు న్నారని తెలిపారు.వారి అందరి ఇళ్లు కూల్చి వేయడం వల్ల వారు రోడ్డున పడ్డారని,విద్యార్థులు ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలను కూడా రాయ లేదన్నారు. 2014 నుంచి బడా బాబుల భూములను క్రమ బద్ధీకరణ చేస్తున్న ప్రభుత్వం పేదల ఇళ్లను ఎందుకు క్రమ బద్దీ కరించడం లేదని ధ్వజమెత్తారు.ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఆక్రమణలు చోటు చేసుకున్నాయనే అక్కడ వున్న నిరుపేదల ఇళ్లను కూల్చివేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు.మొత్తం 62 ఎకరాలలోని 32 ఎకరాలలో ఇళ్ళ ను కూల్చి 250 కోట్ల ఆస్తిని స్వాదీనం చేసుకొన్నామని గొప్పలు చెప్పుకుంటున్న వారు మిగతా స్థలం ఏమైనదో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. నిరు పేదలు ఆక్రమణ దారులు కాదని, కూలీ పనులు చేసుకుని అప్పులు తెచ్చుకొని ఇళ్ల నిర్మించుకునే వారన్నారు. అటువంటి వారి ఇళ్లను కూల్చివేసి ప్రభుత్వ ఆస్తిని కాపాడమని అధికారులు చెప్పడం సిగ్గు చేటన్నారు. జిల్లా కలెక్టర్ ప్రజల అధికారా లేక రియల్ ఎస్టేట్ వ్యాపార అని ప్రశ్నించారు.ఆయన సంఘటన పై చెప్పిన వివరాల ను పరిశీలిస్తే ఆ భూమి నీ ప్రభుత్వం బడా బాబులకు కమ్యూనిస్టుల చరిత్ర పిల్లకాకులకు ఎం తెలుసు తెలంగాణ సాయుధ పోరాటం లాంటి,ముదిగొండ భూపోరాటం వంటి మహత్తర పోరాటాల ద్వారా పేదలకు ఇళ్ళు, స్థలాలు,భూములు సాధించినటువంటి కమ్యూనిస్టు పార్టీల చరిత్ర యూ ట్యూబ్ వెబ్ పెయిడ్ బ్యాచ్ కు ఏం తెలుస్తుందని వామ పక్ష నేతలు మండి పడ్డారు.వామ పక్షాల పోరాటాలు లేకుండా వాళ్ళు మరణించకుండా,దెబ్బలు తినకుండా,నిర్బంధింప పడకుండా ఖమ్మం నగరంలో నీ పేదలు నివసించే రామనగుట్ట,దానవాయిగూడెం, రామ న్నపేట , అగ్రహారం,దంస లాపురం, వై ఎస్ ఆర్ కాలనీ వంటి కాలనీలు ఏర్పడ లేదని తెలిపారు వచ్చిందన్నారు.అటువంటి వామపక్ష పార్టీలపై యూట్యూబ్ వెబ్ ఛానల్ ఎల్లో జర్నలిస్టులు కొంత మంది కారుకూతలు తమ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. చరిత్ర తెలియక పోతే తెలుసుకొని ప్రచారం చేయాలని, అంతేకాని ప్యాకేజీ లు తీసుకొని జర్నలిజం విలువలు దిగజార్చ వద్దన్నారు. లేనియెడల ప్రజలే తగిన గుణపాఠం జేబుతారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా పేదప్రజల ఇళ్లు నిర్మించి ఇస్తాం. మాది ఇందిరమ్మ రాజ్యం అంటూ ప్రభాల్గాలు పలికే జిల్లా మంత్రులు సంఘటన పై ఎందుకు మౌనంగా ఉన్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.మంత్రులు నిర్వాసితుల పక్షాన నిలిచి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు వారు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎటువంటి చర్యలు తీసుకున్నా నిర్వాసితులకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో ఆయా పార్టీల తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా ఆరోపణల్లో వాస్తవం లేదు: తహశీల్దార్ రాములు




**గట్టుప్పల్, వుదయం**

గట్టుప్పల్ మండల రెవెన్యూ కార్యాలయంపై సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని తహశీల్దార్ రాములు స్పష్టం చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అన్ని రిజిస్ట్రేషన్లు మరియు రెవెన్యూ సంబంధిత ప్రక్రియలు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని తెలిపారు.తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించిన ఆయన, ఏవైనా అనుమానాలు ఉంటే అధికారికంగా ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యాలయ పారదర్శకతపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

# ప్రోటోకాల్ పాటించకుండా శంకుస్థాపన చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

## మార్కెట్ కమిటీ డైరెక్టర్:భూతరాజు ఆంజనేయులు

**చండూరు, వుదయం**



చండూరు మండలం గుండ్రపల్లి గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం నుండి రూ.20 లక్షలు మంజూరు చేయబడిన నేపథ్యంలో, శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించబడింది. అయితే ఈ కార్యక్రమం నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు, ప్రోటోకాల్ పాటించలేదని మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూతరాజు ఆంజనేయులు ఆవేదన చేశారు.ఈ కార్యక్రమానికి సంబంధిత గ్రామమైన గుండ్రపల్లి సర్పంచ్‌తో పాటు పరిధిలోని కస్తాల, ఉడుతలపల్లి, పడమటితాళ్ల గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు మరియు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు హాజరు కాకుండా, కేవలం మెడికల్ అధికారి, తహశీల్దారు మరియు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడు అనిల్ రావుతో కలిసి శంకుస్థాపన నిర్వహించడం సముచితం కాదని పేర్కొన్నారు.ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రజాపనుల్లో ప్రజాప్రతినిధులకు సరైన సమాచారం ఇవ్వకుండా, ప్రోటోకాల్‌ను విస్మరించడం ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధమని విమర్శించారు. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేందుకు, బాధ్యులైన అధికారులపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి న్యాయం చేయాలని ఆయన కోరారు.

# మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వటం చట్టరీత్యా నేరం

**మేళ్లచెరువు, వుదయం:**



అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత మహా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా ఈరోజు జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్ పిల్లలు వాహనాల తోలటం పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మేళ్లచెరువు మండల కేంద్రంలో మేళ్లచెరువు పోలీసుల ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్ పై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై పరమేష్ మాట్లాడుతూ పిల్లలకు వాహనాలు ఇవ్వడం అనేది చట్టరీత్యా నేరమని పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పిల్లలకు ఇతరులకు కూడా ఇది ప్రమాదకరమని సూచించారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మైనర్ డ్రైవింగ్ చేస్తూ ఒకసారి పట్టుబడి కేసు నమోదు అయినట్లయితే మైనర్ వ్యక్తికి 25 సంవత్సరాలు వచ్చే వరకు లైసెన్స్ ఇవ్వడానికి కుదరదని స్పష్టం చేశారు. పిల్లలకు అవగాహన లేక వాహనాలు వేగంగా నడుపుతూ ప్రమాదాలు బారిన పడుతున్నారని ఇతరులను కూడా ప్రమాదాలకు గురి చేస్తున్నారని అన్నారు. కావున తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# జి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి: నారీ ఐలయ్య

**గట్టుప్పల్, వుదయం**



బీవీజీ రాంజీ చట్టాన్ని రద్దు చేసి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్ చేశారు.శుక్రవారం గట్టుప్పల్ మండలం వెలమకన్నె గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన, కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. జి రాంజీ చట్టం వల్ల కార్మికులకు నష్టం జరుగుతుందని పేర్కొంటూ, పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 కూలి, సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్లు వంటి వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు.కార్యక్రమంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఖురాన్ తోనే క్రమశిక్షణ అలవడుతుంది

## ఇస్లాం పండితుడు అబ్దుల్ ఖవీ

**ఖమ్మం, వుదయం:**



పవిత్ర ఖురాన్ గ్రంథం మనిషి పరిపూర్ణ జీవన విధానానికి దిక్సూచి వంటిదని, దాన్ని చదివి ఎవరైతే అమలు చేస్తారో వారి జీవితంలో చక్కని క్రమశిక్షణ అలవడుతుందని ప్రముఖ ఇస్లాం ఆధ్యాత్మిక పండితుడు మహ్మద్ అబ్దుల్ ఖవి అన్నారు. అందుకే ప్రతి ఒక్క ముస్లిం ఖురాన్ గ్రంధాన్ని ప్రేమించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. నగర శివారు గొల్లగూడెం లోని తాలిముల్ ఇస్లాం మదర్సాలో రంజాన్ మాస తొమ్మిది రోజుల్లో తరవిహ్ నమాజ్ నందు ఖురాన్ పఠనం పూర్తయిన సందర్భంగా ఖత్మే ఖురాన్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్సా ఆవరణలోని మసీదు ప్రాంగణంలో ఆధ్యాత్మిక సభ జరిగింది. ఈ సభ కు ముఖ్య అతిధిగా విచ్చేసిన అబ్దుల్ ఖవి మాట్లాడుతూ.. ఎంత పెద్ద బాధల్లో ఉన్న వ్యక్తి అయినా.. అంతటి గొప్ప శక్తి ఉన్న గ్రంథం ఖురాన్ ను.. రంజాన్ మాసంలో ప్రత్యేకంగా రోజుకొకసారైన చదవడం అలవార్చుకోవాలని సూచించారు. తరావిహ్ నమాజ్ రంజాన్ నెలంతా చదవాల్సిందేనని.. దానికి ఎటువంటి మినహాయింపు ఉండదనే విషయం గ్రహించాలని అబ్దుల్ ఖవి సూచించారు. ఖత్మే ఖురాన్ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్ధన చేశారు. అనంతరం మదర్సా ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నగర ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**రాయపర్తి, వుదయం:**

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డాక్టర్ సుష్మిత కంటి హాస్పిటల్ ,రవి నర్సింగ్ హోమ్, కాజీపేట వారి ఆధ్వర్యంలో కాటపల్లి గ్రామ ప్రజల సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ రాపాక పద్మ బ్రహ్మాచారి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆరోగ్యమే తన ఆరోగ్యం అని భావించి మళ్ళీ గ్రామ ప్రజల కోసం మరోసారి గ్రామపంచాయతీ ఆవరణంలో ఉదయం 8:00 గంటల నుండి 1:00 గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించబడును కావున కంటి సమస్యలు ఉన్నవారు తమ ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకొని రాగలరని కోరారు.

# రోడ్డు ప్రమాదాల నివారాణే ధ్యేయంగా డ్రైవర్లకు కంటి పరీక్షలు.. పరకాల సిఐ క్రాంతి కుమార్

**పరకాల వుదయం:**

రోడ్డు ప్రమాదాల నివారిణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అరైవ్ –ఆలైవ్ రెండో విడతలో భాగంగా పరకాల పోలీస్ వారి చొరవతో పరకాల సిఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో స్థానిక భారీ వివాహన డ్రైవర్లకు మరియు ఆటో డ్రైవర్లకు కంటి వైద్య నిపుణులు రంజిత్ కుమార్ గౌడ్ పర్యవేక్షణలో ఉచిత కంటి పరీక్షలు నిర్వ హించి అవసరమైన వారికి కళ్లద్దాలను ఉచితంగా అందజేశా రు. ఈ సందర్భంగా సిఐ కాంత్ కుమార్ మాట్లాడుతూ.. కంటి చూపు మందగించిన డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన డ్రైవర్ సోదరులకు ఉచితంగా అద్దాలు పంపిణీ చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చనె ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఈ సదవకాశాన్ని పరకాల పట్టణంలో భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు మరియు ఆటో డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.




# 2వ వార్డులో మార్నింగ్ వాక్ – ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

**చండూరు, వుదయం**



చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మార్నింగ్ వాక్ నిర్వహించి స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు, తాగునీటి సరఫరా లోపాలు, సీసీ రోడ్ల దుస్థితి వంటి అంశాలపై ప్రజలు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీ లైన్ల శుభ్రత, నీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు త్వరలో చేపడతామని తెలిపారు.మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఎప్పుడూ ప్రజల మధ్యే ఉండి సమస్యలు పరిష్కరించడం తమ లక్ష్యమని చెప్పారు. వార్డు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు మండలిలో ప్రవేశ పెట్టి ఆమోదం పొందేలా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ బుషిపాక వాసు, ఏకాల ఆంజనేయులు, పలువురు స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్‌లోనూ యూపీఐ సేవలు..




దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) సేవలు ఇజ్రాయెల్‌కూ విస్తరించాయి. ఇది డిజిటల్ ఫైనాన్స్ సహకారంలో ప్రధాన మైలురాయిగా నిలువనుంది.ఆ దేశ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యూపీఐ పేమెంట్స్ విషయంలో ఒప్పందం కుదిరిందని చెప్పారు. ఈ సందర్భంగా ఉమ్మడి విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ పరిణామంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్‌లో యూపీఐ వినియోగం కోసం ఒప్పందం కుదరడం ఆనందంగా ఉంది. పరస్పర విశ్వాసం, ప్రజాస్వామ్య విలువలపై ఏర్పడిన ఇరు దేశాల బంధం మరింత బలపడుతోందని చెప్పారు.




# వార్నర్ బ్రదర్స్ డీల్ నుంచి నెట్‌ఫ్లిక్స్ ఔట్




గత కొన్ని నెలలుగా హాలీవుడ్ స్టూడియోల అమ్మకం విషయంలో నెట్‌ఫ్లిక్స్, పారామౌంట్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. మొదట వార్నర్ బ్రదర్స్‌ను సుమారు 83 బిలియన్ డాలర్లకు దక్కించుకోవాలని నెట్‌ఫ్లిక్స్ భావించింది. అంతలోనే పారామౌంట్ స్కైడాన్స్ తన ఆఫర్‌ను షేరుకు 31 డాలర్లకు పెంచుతూ, మొత్తం డీల్ విలువను 111 బిలియన్ డాలర్లకు చేర్చింది. ఈ భారీ మొత్తాన్ని మ్యాచ్ చేయలేక, నెట్‌ఫ్లిక్స్ కో-సీఈఓలు టెడ్ సారండోస్, గ్రెగ్ పీటర్స్ తాము ఈ డీల్ నుండి తప్పుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు. "సరైన ధర వద్ద ఈ డీల్ మాకు లాభదాయకంగా ఉండేది, కానీ ప్రస్తుత రేటు వద్ద ఇది ఆర్థికంగా మాకు పొసగదు'' అని వారు స్పష్టం చేశారు. నెట్‌ఫ్లిక్స్ ఈ డీల్ నుండి తప్పుకోవడానికి కేవలం డబ్బు మాత్రమే కారణం కాదు. రాజకీయ పరిణామాలు కూడా ప్రధాన పాత్ర పోషించాయి. వాషింగ్టన్ వర్గాల్లో నెట్‌ఫ్లిక్స్ పట్ల కొంత వ్యతిరేకత వ్యక్తమైంది. నెట్‌ఫ్లిక్స్ వంటి పెద్ద సంస్థ హాలీవుడ్ స్టూడియోలను కొనుగోలు చేస్తే మార్కెట్‌లో పోటీ తగ్గుతుందని అమెరికా ప్రభుత్వం ఆందోళన చెందింది. అదే సమయంలో.. పారామౌంట్ యజమాని ఎల్లిసన్ కుటుంబానికి ప్రస్తుత రాజకీయ నాయకత్వంతో ఉన్న సాన్నిహిత్యం వారి డీల్‌కు మార్గం సుగమం చేసింది. నెట్‌ఫ్లిక్స్ బోర్డ్ మెంబర్ సుసాన్ రైస్ చేసిన ప్రభుత్వ వ్యతిరేక వ్యాఖ్యలు కూడా నెట్‌ఫ్లిక్స్ ను రేసు నుంచి దూరం చేశాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు పారామౌంట్ స్కైడాన్స్ వార్నర్ బ్రదర్స్‌ను దక్కించుకోవడంతో, ప్రపంచ మీడియా రంగంలో ఒక అతిపెద్ద శక్తి ఆవిర్భవించనుంది. హ్యారీ పోటర్, బ్యాట్‌మ్యాన్ వంటి ఐకానిక్ బ్రాండ్‌లు, ఊః, అఔఔ, డిస్కవరీ ఛానెల్‌లు ఇప్పుడు పారామౌంట్ నియంత్రణలోకి వెళ్లనున్నాయి. భవిష్యత్తులో మాక్స్ మరియు పారామౌంట్ స్ట్రీమింగ్ సర్వీసులు ఒకే ప్లాట్‌ఫామ్‌గా మారే అవకాశం ఉంది. నెట్‌ఫ్లిక్స్‌లో వార్నర్ బ్రదర్స్ సినిమాలను చూడాలనుకున్న అభిమానుల ఆశలు అడియాశలయ్యాయి.

## ఆన్‌లైన్ కంటెంట్, పిల్లల భద్రతకు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లదే బాధ్యత



డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు తాము హోస్ట్ చేసే కంటెంట్‌కు బాధ్యత వహించాలని, పిల్లలు, పౌరుల ఆన్‌లైన్ భద్రతకు జవాబుదారీ వారిదేనని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. జరిగిన డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్(డీఎన్‌పీఏ) కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగానికి సంబంధించి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏ ఒక్క యూజర్ అనుమతి లేకుండా వారి వాయిస్, ఫేస్, పర్సనాలిటీని వాడుకోవడానికి వీల్లేదు. ఇంటర్నెట్ స్వభావం ఇప్పుడు మారిపోయింది, ఏఐ-జనరేటెడ్ కంటెంట్ వినియోగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. వేల సంవత్సరాలుగా నిర్మించిన సంస్థలపై నమ్మకాన్ని బలోపేతం చేయడంలోని ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి. నమ్మకంపైనే ఈ సమాజం ఏర్పడింది. కుటుంబం, న్యాయవ్యవస్థ, డియా, శాసన వ్యవస్థలు కూడా దీనిపై ఆధారపడే కొనసాగుతున్నాయి. డియా ఎల్లప్పుడు ధృవీకరించిన సమాచారాన్నే పబ్లిష్ చేస్తోంది, ఆ కంటెంట్‌కు బాధ్యత వహిస్తోందన్నారు. ఇదే తరహాలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు కూడా బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇదే సమయంలో డీప్‌ఫేక్ కారణంగా డిజిటల్ వినియోగంపై సందేహాలు నెలకొన్నాయి. లేని విషయాలను కూడా జరిగినట్టు వీడియోలు పుట్టుకొస్తున్నాయి. వాటిని చాలామంది ప్రజలు నమ్ముతున్నారు. ఎప్పుడూ జరగని సంఘటనలను ప్రజలు నమ్మే స్థాయిలో ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

# మణికొండలో 'చిటికి లూమ్స్' ప్రారంభం

తెలంగాణ చేనేత కళా వైభవాన్ని, ఆధునిక డిజైన్లను మేళవిస్తూ వైషూస్ హ్యాండ్లూమ్స్ హ్యాండిక్రాఫ్టస్ అండ్ ఆర్గానిక్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'చిటికి లూమ్స్' నూతన షోరూమ్ ను తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మణికొండలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కంపెనీ ఓనర్ వైష్ణవి నిఫ్ట్ స్టూడెంట్ కావడం, ప్రధాన మంత్రి గారి 'లఖ్ పతి దీదీ' ప్రోగ్రాం కింద శిక్షణ



పొందడం చాలా గొప్ప విషయమన్నారు. ఇది కేవలం అమ్మకాల కోసమే కాదని, ఒక 'డెమో లూమ్' (మగ్గం) కూడా ఇక్కడ చేయడం జరిగిందని తెలిపారు. పవర్ లూమ్ ద యంత్రం చేసే పని గంటల్లో అయిపోవచ్చు కానీ, చేనేత మగ్గం ద అదే పని చేయడానికి కనీసం ఐదు రోజుల సమయం పడుతుందని చెప్పారు. ఆ కష్టాన్ని, ఆ కళను కస్టమర్లు నేరుగా చూసి అర్థం చేసుకున్నప్పుడే, మన చేనేత ఉత్పత్తులకు విలువ పెరుగుతుందన్నారు. పాశ్చాత్య దేశాల్లో చేతి పనికి ఎంత డిమాండ్ ఉందో మనందరికి తెలుసన్నారు. ఇక్కడ ఒకే చోట పెయింటింగ్, ఎంబ్రాయిడరీ కలయికతో కూడిన ఇక్కత్, గద్వాల్, కంచి, ధర్మవరం వంటి సౌత్ సిల్కస్ అన్నీ ఒక అందమైన 'బొకే' లాగా కొలువుదీరాయన్నారు. కస్టమర్ల అభిరుచికి తగ్గట్టు డిజైన్లను అందించడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వం ఎన్ని ప్రోత్సాహకాలు అందించినా యువత ఈ రంగంలోకి ముందుకు రానంత కాలం చేనేత కళకు భవిష్యత్తు ఉండదన్నారు. యువతరం కొత్త టెక్నాలజీతో, ఆధునిక ఆలోచనలతో ముందుకు వస్తేనే ఈరంగం నిలబడుతుందని చెప్పారు. అందుకే ప్రభుత్వం కూడా ఎంఎస్ ఎంఈ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచడానికి కృషి చేస్తోందన్నారు. చేనేతకమ్యూనిటీ నుంచి యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా చేనేత అభివృద్ధి కమిషనర్ డాక్టర్ ఎస్ అరుణ్ కుమార్ 'చిటికి లూమ్స్' షోరూమ్ ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా ఈ సంస్థ సీఈఓ వైష్ణవి కేవలం ఒక వ్యాపారవేత్త మాత్రమే కాదని, చేనేత రంగంపై అవగాహనఉన్న నిఫ్ట్ విద్యార్థిని అన్నారు. భారత ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి రకరకాల పథకాలను అమలుచేస్తోందన్నారు. అందులో భాగంగా ఒక ప్రోగ్రాం ద్వారా ఆమె చెన్నైలో అత్యున్నత స్థాయి శిక్షణ పొందారన్నారు. ఆమె సొంతంగా చేనేత కమ్యూనిటీకి చెందిన వ్యక్తి కావడం, దానికి తోడు నిఫ్ట్‌లో డిజైనింగ్ నేర్చుకోవడం లఖ్ పతి దీదీగా ఎంపికవ్వడం ఇవన్నీ అద్భుతమైన ప్రొడ్యూసర్ కంపెనీ ఏర్పాటుకు దారితీశాయన్నారు. యువత ఇలాంటి బాధ్యతను తీసుకున్నప్పుడే మన చేనేత కళ అంతర్జాతీయ స్థాయికి చేరుతుందన్నారు.

## కొత్త సిరీస్ జీడీపీ లెక్కింపునకు జీఎస్‌టీ, ఇవాహన్ వివరాలు




2022-23 ఆధార సంవత్సరంతో, కొత్త సిరీస్‌లో విడుదలయ్యే జీడీపీ వృద్ధి గణాంకాల్లో జీఎస్‌టీ, ఇ-వాహన్ గణాంకాల వివరాలనూ చేర్చనున్నారు. వంట మనిషి, డ్రైవరు సహా ఇంట్లో పనివాళ్లు అందించే సేవలను కూడా జీడీపీ లెక్కింపునకు పరిగణనలోకి తీసుకున్నారు. తద్వారా ఆర్థిక వ్యవస్థ వృద్ధిపై మరింత కచ్చితత్వంతో కూడిన గణాంకాలు ఇవ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి (2025 అక్టోబరు- డిసెంబరు) కొత్త సిరీస్‌లో జీడీపీ గణాంకాలను ప్రభుత్వం విడుదల చేయనుంది. కొత్త సిరీస్ గణాంకాలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాల (ఎఫ్ఏక్యూ) ప్రకారం.. సంవత్సరాల పాటు ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పుల ప్రకారం, ఎప్పటికప్పుడు ఆధార సంవత్సరాన్ని మారుస్తుంటారు. ఇంతకు ముందు జీడీపీ గణాంకాల లెక్కింపునకు 2011-2012 ఆధార సంవత్సరంగా ఉండేది. ఇప్పుడు దీనిని 2022-23కు సవరించారు. అయిదేళ్లకోసారి ఆధార సంవత్సరాన్ని మార్చాల్సి ఉన్నా.. కొవిడ్ పరిణామాలు, జీఎస్‌టీ అమలు కారణంగా.. ఇంతకుమునుపు ఆ పని ప్రభుత్వం చేయలేదు. పాత సిరీస్ గణాంకాలను 2026 డిసెంబరు కల్లా విడుదల చేస్తామని కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గణనకు కూడా ఆధార సంవత్సర సవరణపై కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే రిటెయిల్ ద్రవ్యోల్బణ గణాంకాలను కొత్త సిరీస్‌లో విడుదల చేశారు.

# పేమెంట్ సేవల కోసం భారతీయ బ్యాంకులతో యాపిల్ చర్చలు




డిజిటల్ చెల్లింపులకు సంబంధించి ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న భారత మార్కెట్లో ఇప్పటికీ ఫోన్‌పే, పేటీఎమ్, భారత్‌పే లాంటి దేశీయ చెల్లింపుల యాప్‌లదే హవా. ఈ నేపథ్యంలో గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ కూడా భారత డిజిటల్ చెల్లింపుల మార్కెట్లోకి అడుగుపెట్టాలని భావిస్తోంది. ఇప్పటివరకు దీనికి సంబంధించి రూమర్లు ఉన్నప్పటికీ, తాజాగా కంపెనీ యాపిల్‌పేను ప్రారంభించేందుకు భారతీయ బ్యాంకులతో చర్చలు జరపడంతో విషయం నిర్ధారణకు వచ్చింది. ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంకులతో యాపిల్ సంస్థ చర్చలు జరుపుతోంది. యాపిల్ గ్లోబల్ కార్డ్ కంపెనీలు మాస్టర్ కార్డ్, వీసా కంపెనీలతో కూడా చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఈ ప్రారంభం 2026 మధ్యలో జరగవచ్చు, కానీ తేదీ ఇంకా ఫైనల్ కాలేదు. యాపిల్‌పే మొదట డెబిట్, క్రెడిట్ కార్డులకు అనుమతించాలని భావిస్తోంది. ఆ తర్వాత ప్రభుత్వ ఆమోదం పొందిన తర్వాత యూపీఐ చెల్లింపులను యాడ్ చేసే అవకాశం ఉంది. అన్ని ప్రక్రియలు విజయవంతమైతే ఈ ఏడాది మధ్య నాటికి డిజిటల్ చెల్లింపుల సేవలను ప్రారంభించాలని కంపెనీ భావిస్తోంది. అయితే, ప్రస్తుతానికి ఎలాంటి ఖచ్చితమైన తేదీని ఖరారు చేయలేదు. దేశంలో కార్డ్ ఆధారిత చెల్లింపులతో పాటు, ప్రభుత్వ మద్దతున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) విధానంలో లావాదేవీలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మనదేశంలో యూపీఐ అత్యంత కీలకమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ. యాపిల్‌పే ద్వారా ఇప్పటికే దేశీయంగా ఆధిపత్యం ఉన్న గూగుల్‌పే, ఫోన్‌పే, అమెజాన్, పేటీఎం లాంటి దిగ్గజాలకు పోటీ తప్పదని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.




## టి20 లో అర్షదీప్ సరికొత్త రికార్డు



భారత ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్‌సరికొత్త చరిత్ర సృష్టించాడు. డేంజర్ బౌలర్ బుమ్రా రికార్డును బద్దలు కొట్టి, టీ20 వరల్డ్ కప్ చరిత్రలో సరికొత్త హిస్టరీ క్రియేట్ చేశాడు అర్షదీప్ సింగ్.సూపర్ 8 లో భాగంగా భారత్, జింబాబ్వేతో తలపడిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ సందర్భంగా జింబాబ్వేకు సంబంధించిన మూడు కీలక వికెట్లు పడగొట్టాడు అర్షదీప్ సింగ్. ఈ నేపథ్యంలోనే బుమ్రా రికార్డును బ్రేక్ చేశాడు అర్షదీప్.33 వికెట్లు సాధించిన భారత బౌలర్ బుమ్రా రికార్డును, 35 వికెట్లతో అధిగమించి మొదటి స్థానానికి చేరుకున్నాడు. 19 మ్యాచ్‌లలోనే అర్షదీప్ సింగ్ ఈ ఘనత సాధించి చరిత్ర సృష్టించాడు. ఈ రికార్డు టీ20 వరల్డ్ కప్ చరిత్రలో అర్షదీప్ క్రియేట్ చేయగా... అంతర్జాతీయ క్రికెట్ లో 150 వికెట్ల మైలురాయిని కూడా దాటేశాడు. దీంతో అర్షదీప్ సింగ్ పై ప్రశంసల వర్షం కురుస్తోంది. సూపర్ 8 లో ఖచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్ ను భారత జట్టు సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్ లో జింబాబ్వేపై ఏకంగా 72 పరుగులు తేడాతో విజయం సాధించింది భారత జట్టు.

# ఒకే ఓవర్ లో 26 పరుగులు, శివం దూబేను ఉతికారేసిన పసికూన



భారత ఆల్ రౌండర్ శివం దూబే, మంచినీళ్లు తాగినంత సులభంగా సిక్సులు కొడతాడు. అయితే అలాంటి డేంజర్ ఆల్ రౌండర్ శివం దుబే బౌలింగ్ లో పసికూన జింబాబ్వే ఆటగాడు బ్రియాన్ బెన్నెట్ విధ్వంసం సృష్టించాడు. శివం దూబే బౌలింగ్‌లో ఊచకోత కోశాడు బ్రియాన్ బెన్నెట్. శివం దూబే వేసిన 15వ ఓవర్ లో ఏకంగా 26 పరుగులు దండుకున్నారు జింబాబ్వే ఆటగాడు బ్రియాన్ బెన్నెట్. భారత విధించిన 257 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, జింబాబ్వే ఆటగాడు బ్రియాన్ బెన్నెట్ విధ్వంసం సృష్టించాడు. చివరి వరకు జింబాబ్వేను గెలిపించేందుకు చాలా కష్టపడ్డాడు. కానీ తాను సెంచరీ సాధించలేక, జింబాబ్వేను గెలిపించలేదు బ్రియాన్ బెన్నెట్. భారత్ పై గెలవాలన్న కసితో అద్భుతంగా రాణించిన జింబాబ్వే ప్లేయర్ బ్రియాన్ బెన్నెట్ ఆది నుంచి బౌలర్లపై అటాక్ చేశాడు. అతని మరో బ్యాటర్ తోడైతే, ఇండియాను సులభంగా ఓడించేవాడే. ఇక ఈ తరుణలంఓనే శివం దూబే బౌలింగ్ లో విధ్వంసం సృష్టించాడు బ్రియాన్ బెన్నెట్. అతడు వేసిన 15వ ఓవర్ లో ఏకంగా 26 పరుగులు పిండుకున్నాడు. అయితే ఇందులో రెండు సిక్సర్లు, రెండు బౌండరీలు ఉన్నాయి. ఒక టూడి కూడా సాధించారు. మిగిలినవన్నీ ఎక్స్ ట్రాలే కావ డం గమనార్హం. ఇందులో వైడ్స్, నో బాల్స్ కూడా ఉన్నాయి. ఈనేపథ్యంలోనే 6 బంతులు వేయాల్సిన ఈ ఓవర్ లో మొత్తం పది బంతులు సంధించా డు శివం దూబే. దీంతో శివం దూబే పరువు గంగలో కలిసింది. దీంతో దూబేను దారుణంగా ఫాన్స్ ట్రోలింగ్ కూడా చేస్తున్నా రు. ఆల్ రౌండర్ కు ఉన్న లక్షణాలు శివం దూబేకు లేవని.. ఇతడు కేవలం బ్యాటింగ్ మాత్రమే చేయగలరని దారుణంగా ఆడుకుంటున్నారు. ఇది ఇలాఉండగా సూపర్ 8 లో చెన్నై వేదికగా జరిగిన జింబాబ్వే, భారత్ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ సేన విక్టరీ కొట్టింది. జింబాబ్వే పైన ఏకంగా 72 పరుగుల తేడాతో విజయం సాధించింది భారత్. ఇందులో ఇండి యా మొదట బ్యాటిం గ్ చేసి 256 పరుగులు సాధించింది. సూర్య కుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా ఇలా అందరూ సమిష్టిగా రాణించిన నేపథ్యం లో భారీస్కూర చేయగలిగింది భారత్. ఇక ఈ లక్ష్యాన్ని జింబాబ్వే ఛేదించలేక ఓటమిపాలైంది. 6 వికెట్ల నష్టా నికి 184 పరుగులు చేసిన జింబాబ్వే, 72 పరుగులుతేడాతో ఓడిపోయిం ది. ఈ మ్యాచ్‌లో భారత్ జట్టుచేతిలో ఓడిపోయి న జింబాబ్వే ఇంటి దారి పట్టింది. భారత్ సెస్‌కు మరింత దగ్గరైంది.

## టీ20 వరల్డ్‌కప్‌లో పెద్ద మలుపు

ముంబయిలో ఈ నెల 23న జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు పరుగుల పండుగ చేసింది. వారి బ్యాటర్లు వరుస బౌండరీలు, సిక్సర్లతో స్టేడియాన్ని కదిలించారు. భారత అభిమానులు ఆ ఆటను ఆస్వాదించినప్పటికీ, ఆ భారీ స్కోరు టీమిండియా సెమిఫైనల్ ఆశలపై ప్రభావం చూపుతుందని చాలామంది ఊహించలేదు.ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. ఇది చరిత్రలో రెండో అత్యధిక స్కోరు. 2007లో కెన్యాపై శ్రీలంక సాధించిన 260 పరుగులు ఇప్పటికీ అత్యధిక స్కోరుగా కొనసాగుతున్నాయి. జింబాబ్వేపై 107 పరుగుల తేడాతో గెలిచిన వెస్టిండీస్ గ్రూప్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకోగా, భారత్ సెస్ సకరణాలు క్లిష్టంగా మారాయి.సూపర్ 8 దశలో గ్రూప్ 1లో భారత్, దక్షిణాఫ్రికా, జింబాబ్వే, వెస్టిండీస్ జట్లు పోటీపడుతున్నాయి. ప్రతి జట్టు ఒక్కో మ్యాచ్ ఆడగా, భారత్‌పై దక్షిణాఫ్రికా విజయం సాధించింది. మరోవైపు జింబాబ్వేపై వెస్టిండీస్ భారీ గెలుపు నమోదు చేసింది. ప్రస్తుతం 5.35 నెట్ రన్‌రేట్‌తో వెస్టిండీస్ అగ్రస్థానంలో ఉండగా, 3.80 నెట్ రన్‌రేట్‌తో దక్షిణాఫ్రికా రెండో స్థానంలో ఉంది. భారత్ -3.80 నెట్ రన్‌రేట్‌తో మూడో స్థానంలో ఉండగా, జింబాబ్వే -5.35తో చివరి స్థానంలో నిలిచింది.భారత్ సెమిఫైనల్ చేరాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించడం తప్పనిసరి. అయితే అది మాత్రమే సరిపోదు; ఇతర మ్యాచ్‌ల ఫలితాలు కూడా అనుకూలంగా రావాలి. మూడు జట్లు చెరో రెండు మ్యాచ్‌లు గెలిచే పరిస్థితి వస్తే, నెట్ రన్‌రేట్‌లో భారత్ వెనుకబడే ప్రమాదం ఉంది. స్పోర్ట్స్ జర్నలిస్ట్ *తి*తీజీనిబి ఉబీజూబిజీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన ప్రకారం, భారత్ మిగిలిన మ్యాచ్‌లు గెలిచినా, వెస్టిండీస్-దక్షిణాఫ్రికా మ్యాచ్ ఫలితం కీలకంగా మారుతుంది.మొదటి సూపర్ 8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేత భారత్ 76



పరుగుల తేడాతో ఓడిపోవడం జట్టుకు భారీ దెబ్బగా మారింది. ఆ ఓటమి కారణంగా నెట్ రన్‌రేట్ -3.80కు పడిపోవడంతో, ప్రస్తుతం సెస్ ఆశలు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉన్నాయి.

## కర్నాటక తడబాటు మయాంక్ అజేయ సెంచరీ

ఎనిమిది సార్లు రంజీ ట్రోఫీ చాంపియన్ కర్నాటక సొంతగడ్డపై అనూహ్య తడబాటుకు గురవుతోంది. జమ్మూ కశ్మీర్ పేసర్ అకిబ్ నబి (3/32) వరుస బంతుల్లో కరుణ్ నాయర్ (0), రవిచంద్రన్ స్మరణ్ (0)లను సాగనంపటంతో పాటు కెఎల్ రాహుల్ (13)ను సైతం అవుట్ చేయటంతో కర్నాటక కష్టాల్లో కూరుకుంది. దేవదత్ పడిక్కల్ (11), శ్రేయాస్ గోపాల్ (27) నిరాశపరిచారు. 57/4తో కర్నాటక పీకల్లోతు కష్టాల్లో కూరుకున్న వేళ ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (123 నాటౌట్, 189 బంతుల్లో 17 ఫోర్లు) అజేయ సెంచరీతో ఒంటరి పోరాటం చేస్తున్నాడు. మూడో రోజు ఆట ముగిసేసరికి కృతుక్ కృష్ణ (18 నాటౌట్) తోడుగా మయాంక్



అగర్వాల్ క్రీజులో కొనసాగుతున్నాడు. కర్నాటక తొలి ఇన్నింగ్స్‌లో 62 ఓవర్లలో 204/5తో నిలువగా.. తొలి ఇన్నింగ్స్‌లో మరో 380 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది. జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 173.1 ఓవర్లలో 584/10 పరుగుల భారీ స్కోరు చేసిన సంగతి తెలిసిందే. జమ్మూ కశ్మీర్ బ్యాటర్లలో శుభమ్ (121), యావర్ హసన్ (88), పరాస్ (70), అబ్దుల్ సమద్ (61), కన్హయ్య (70), సాహిల్ (72) సమిష్టిగా రాణించారు.

# విమర్శలకు చెక్ పెట్టిన అభిషేక్ శర్మ

టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ ఎట్టకేలకు ఫామ్ అందుకున్నాడు. జింబాబ్వేతో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో ఈ ఎడమచేతి బ్యాటర్ దుమ్మురేపాడు. కేవలం 26 బంతుల్లోనే అర్ధశతకం సాధించి తన ప్రతిభను చాటిచెప్పాడు.టీ20 ప్రపంచకప్-2026లో అభిషేక్ ప్రారంభం నుంచే తీవ్ర నిరాశ కలిగించిన విషయం తెలిసిందే. లీగ్ దశలో అమెరికాతో మ్యాచ్‌లో గోల్డెన్‌డక్‌గా వెనుదిరిగిన అతడు.. అనంతరం కడుపునొప్పి కారణంగా నబియాతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. తర్వాత జట్టులోకి తిరిగి వచ్చినప్పటికీ పరిస్థితి మారలేదు. పాకిస్తాన్, నెదర్లాండ్స్‌లతో జరిగిన మ్యాచ్‌ల్లోనూ డకౌట్‌గా నిలిచాడు. అయినా జట్టు యాజమాన్యం అతడిపై విశ్వాసం కోల్పోలేదు. సూపర్-8 దశలో సౌతాఫ్రికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో 12 బంతుల్లో 15 పరుగులు చేసి మరోసారి నిరాశపరిచాడు.దీంతో అభిషేక్ శర్మ ఫామ్‌పై విమర్శలు గట్టిగా వినిపించాయి. తుది జట్టులో నుంచి తప్పించి కొంత



విశ్రాంతి ఇవ్వాలన్న సూచనలు మాజీ క్రికెటర్ల నుంచి వచ్చాయి. మేనేజ్‌మెంట్ మాత్రం అతడిపై నమ్మకం ఉంచింది. ఆ విశ్వాసానికి తగ్గట్టే జింబాబ్వేతో మ్యాచ్‌లో అభిషేక్ మెరుపు ఇన్నింగ్స్‌తో సమాధానం ఇచ్చాడు.

# ఎదురులేని దక్షిణాఫ్రికా




దక్షిణాఫ్రికా దంచికొట్టింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో అజేయ జోరు కొనసాగిస్తోంది. అహ్మదాబాద్‌లో జరిగిన సూపర్8 గ్రూప్-1 మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా ఘన విజయం సాధించింది. ఓపెనర్ ఎడెన్ మార్‌క్రామ్ (82 నాటౌట్, 46 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సులు) అజేయ అర్థ సెంచరీకి తోడు క్వింటన్ డికాక్ (47, 24 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు), రియాన్ రికెల్టన్ (45 నాటౌట్, 28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) రాణించటంతో 177 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 16.1 ఓవర్లలోనే ఊదేసింది. మరో 23 బంతులు మిగిలి ఉండగానే 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. సూపర్8దశలో వరుసగా రెండో విజయం సాధించిన దక్షిణాఫ్రికా సెమిఫైనల్ బెర్త్ లాంఛనం చేసుకుంది. అంతకముందు, తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 176 పరుగులు చేసింది. రొమారియో షెఫర్డ్ (52 నాటౌట్, 37 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు), జేసన్ హోల్డర్ (49, 31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) కరీబియన్లను ఆదుకున్నారు. సఫారీ పేసర్లు లుంగి ఎంగిడి (3/30), కగిసో రబాడ (2/22), కార్బిన్ బాష్ (2/31) రాణించారు. ఛేదనలో అజేయ అర్థ సెంచరీ సాధించిన ఎడెన్ మార్‌క్రామ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సూపర్8 దశ చివరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఆదివారం జింబాబ్వేతో తలపడనుంది.

# వుదయం సినిమా



# తారల అసలు పేర్లు



## మురళీ మోహన్

నటుడు, నిర్మాత మురళీ మోహన్ అసలు పేరు మాగంటి రాజా రామ్ మోహన్ రాయ్. ఏలూరు దగ్గర చాటపర్రులో 24 61940 లో మాధవరావు వసుమతి దంపతులకు పుట్టారు. ఏలూరు సి.ఆర్.ఆర్ కాలేజీలో కృష్ణతో బాటు ఇంటర్ చదివారు. తండ్రి నిర్వహించిన చెట్ల వ్యాపారం చేసి, తరువాత బాబాయి బెజవాడలో రైతులు వుపయోగించే ఆయిల్ ఇంజన్లు, మోటార్ల వ్యాపారంలో ₹100/ జీతం, కమిషన్కి 1963లో మేనేజరై నాటకాల్లో నటించేవారు. తరువాత ఆ వ్యాపార భాగస్వామయ్యారు. 'జగమే మాయ' లో1973లో అయనకు అవకాశం వచ్చినపుడు అట్లూరి పూర్ణ చంద్రరావు సినిమాలో హాస్య నటుడు రాజబాబు వున్నాడు.నీది రాజబాబు అంటే గందరగోళమవుతుంది అని పూర్తి పేరులోని మోహన్ అని పేరు పెట్టి, కొందరి సూచనతో మురళీ మోహన్ గా మార్చారు. తిరుపతి ముద్దబంతి పువ్వు, కల్పన,మనవూరి పాండవులు ఇలా కొన్నిటిలో హీరో, సెకండ్ హీరోగా చేసి తరువాత కేరక్టర్ ఆర్టిస్టుయ్యారు. సుమారు 370 సినిమాల్లో నటించి ఇంకా నటిస్తూ వున్నారు. తమ్ముడు కిషోర్ తో కలిసి జయభేరి నిర్మాణ సంస్థ 1980లో ప్రారంభించి హీరోగా వారాలబ్బాయి తొలుత తీసి హిట్ కొట్టారు. 1981లోసినిమా నిర్మిస్తూ "పంతులు పిచ్చియ్య, పిచ్చి పంతులు, పిచ్చయ్య పంతులు టైటిల్స్ లో ఏది బాగుంది" అని అడిగితే నేను పిచ్చి పంతులు అని చెబితే అది ఖరారు చేసారు."నేను రాసిన 'మంచి రోజు' కథల సంపుటి ఆయన కొనడం ఒక తీపి అనుభూతి "! పెళ్ళాం చెబితే వినాలి, శ్రావణ మేఘాలు, వారసుడు, నిర్ణయం, అతడు ఇలా పలు సినిమాలు నిర్మించారు. ఓ తండ్రి తీర్పు, ప్రేమించు, వేగు చుక్కలు, చిత్రాలకు నంది అవార్డు లొచ్చాయి .ఈ ఏడాది పద్మశ్రీ అందుకున్నారు, ఎన్.టి.ఆర్. పిలుపుతో తెలుగు దేశం పార్టీలో చేరారు. తెలుగు దేశం తరుపున రాజమండ్రి నుంచి ఎం.పి.గా 2014లో గెలిచారు. శోభన్ బాబు సలహాతో భూములు కొనుగోలు చేసి జయభేరి నిర్మాణ సంస్థ నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ పూర్వపు ఆకృతితోనే ఉండడం పలకరించడం విశేషం !

## సరిత




గుంటూరు దగ్గర మునిపల్లిలో పుట్టిన సరిత అసలు పేరు అభిలాష. బాలచందర్ ఈమెకు సరిత అని పేరు పెట్టారు. వరంగల్ నిర్మాత ఆకుల సంజీవ్ కుమార్ నిర్మించిన మంచికి స్థానం లేదు సినిమా ద్వారా 1978లో పరిచయమైంది. గాని ఇది 671979లో విడుదలై సరిగా ఆడలేదు. బాలచందర్ దర్శకత్వంలో కమల్ హసన్ సరసన తెలుగు అమ్మాయి తమిళ యువకుడు మధ్య జరిగిన ప్రేమ కథా చిత్రం 'మరో చరిత్ర ' ముందుగా అంటే 19 51978న విడుదలై హిట్ కాగా మంచి పేరొచ్చింది. అలా బాలచందర్ దర్శకత్వంలో తమిళంలో తెలుగులో తప్పు తాలంగల్, ఇది కథ కాదు, 47:రోజులు ఇలా పలు సిన్మాల్లో నటించ రెండు భాషల్లోనూ గుర్తింపొచ్చింది. తొలి కోడి కూసింది, శ్రీరస్తు శుభమస్తు,రామ దండు, అత్తగారి పెత్తనం, గుప్పెడు మనసు విజయ, కోకిలమ్మ, కాంచన గంగ ఇలాటి చిత్రాల్లో మంచి నటిగా పేరొచ్చినా తన ట్రాక్ మార్చి హీరోయిన్లకు డబ్బింగ్ చెప్పే వైపు తిరిగింది. ఈమె నటించిన శ్రీరస్తు శుభమస్తు, కోకిల మ్మ , కలహాల కాపురం సినిమా సన్నివేశాల షూటింగులు మద్రాసులో కవర్ చేసాను. తెలుగు,తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విజయశాంతి, రమ్య కృష్ణ, సౌందర్య, నగ్మా, మున్నగు తారల పాత్రలకు డబ్బింగ్ చెప్పి గుర్తింపు తెచ్చుకుంది. 6 నంది అవార్డులు, 4 తమిళ రాష్ట్ర, కర్ణాటక రాష్ట్ర అవార్డులు ఇంకా పలు సంస్థల అవార్డులు లభించాయి. 2004లో అర్జున్ తెలుగు సిన్మాలో నటించింది.

## అంజలి

ఏమో నాకన్నీ అలా తెలిసి పోతాయంతే... అని తరుచు అనడం వెంకటేష్ అంటే ఇష్టమైనా కంగారు, బెదురు చూపించడం, భద్రాచలం వెడితే అంతా మంచి జరుగు తుందని అందరినీ ప్రేరేపించిన అంజలి అసలు పేరు బాలా త్రిపుర సుందరి. రాజోలులో 1661986న పుట్టి, మద్రాసు వెళ్ళాక డిగ్రీ హోల్డరయింది. శతమిందు ముదమిడు సినిమాలో 2002లో దర్శకుడు కలాంజియమ్ ఈమెతో సుందరి అని అసలు పేరు చిన్నగా చేసి అవకాశమిచ్చినా మరో రెండు సినిమాలు ఆమెతోనే చేయాలని తీవ్రంగా ప్రయత్నించినా పని జరగలేదు. శివ నాగేశ్వరరావు 2006లో 'ఫోటో ' కులశేఖర్ 2007లో 'ప్రేమ లేఖ రాసా ' సినిమాల్లో అవకాశం ఇచ్చినా ఫలితం లేదు. 2008లో చేసిన 'కత్రాదు తమిళ ' సినిమా చేస్తే నటిగా మంచి గుర్తింపొచ్చింది.అదే ఏడాది కన్నడ సినిమా కూడా చేసింది.రెండేళ్లు తరువాత విడుదలైన 'అంగాడి తెరు 'లో సేల్స్ గళ్ పాత్రతో మంచి పేరొచ్చింది. ఎంగేయం ఎప్పోదుమ్, కలాకాలప్పు సినిమాల్లోని నటనతో ఒక మాదిరి గుర్తింపు వచ్చింది. సీతమ్మ వాకిట్లో సిరిమల్లి చెట్టు సినిమాలో పల్లెటూరు సీతగా అమాయకత్వం, అణుకువ, పెద్దల పట్ల ప్రేమ అభిమానం, భయం సన్నివేశపరంగా తన ప్రత్యేక డైలాగ్ ద్వారా మంచి పేరు తెచ్చుకుంది. బలుపు, మసాలా సినిమాల్లో నటనతో బాగుందని పించింది. హర్రర్ కామెడీ చిత్రం 'గీతాంజలి' లో ఉత్తమ నటిగా నంది అవార్డు 2014లో గెలుచుకుంది. డిక్టేటర్ లో నటనకు వకీల్ సాబ్ లోపాత్రకు గేంగ్స్ ఆఫ్ గోదావరి లో కూడా నటిగా అంజలి పేరు తెచ్చుకుని కన్నడ మలయాళ చిత్రాల్లోనూ నటిస్తోంది.

## నిమ్మీ


హిందీ నటి నిమ్మీ అసలు పేరు నవాబ్ బానో. నటి గాయని వహీదన్ బాయ్, మిల టరీ కాంట్రాక్టర్ అబ్దుల్ హకిమ్ దంపతులకు ఆగ్రా లో 182 1932న పుట్టింది. 11వ ఏట తల్లి మరణంతో అమ్మమ్మ దగ్గర పెరిగి ఆమెతో తరువాత 1947లో పిన్ని జ్యోతి ఇంటికి చేరింది.నవాబ్ బానో తల్లితో సినిమాలు చేసిన మెహబూబ్ ఖాన్ అందాజ్ సినిమా షూటింగుకి రమ్మంటే 1948 లో అక్కడ అమాయకంగా సిగ్గుతో మెలికలు తిరుగుతూ తచ్చాడే నవాబ్ బానోని రాజ్ కపూర్ చూసాడు. తను నర్గీస్ తో నటిస్తూ డైరెక్ట్ చేసే 'బర్సాత్ ' లో 1949లో ప్రేమ్ నాథ్ కి నాయికగా ఎంపిక చేసాడు. నవాబ్ బానో పేరు నిమ్మీ గా మార్చి ఆమెతో రెండు పాటలు చిత్రీకరిస్తే పాటలు సినిమా సూపర్ హిట్ అయ్యాయి. వెంటనే దిలీప్ కుమార్ తో దీదార్, ఆన్, చిత్రాలు చేసింది.'ఆన్ ' 17భాషల్లో సబ్ టైటిల్స్ తో 28 దేశాల్లో విడుదలై ఆమె నటనతో అఖండ విజయం సాధించింది. బ్రిటిష్ ప్రధాని అట్లీతో బాటు పలువురు ప్రముఖులు లండన్ లో హాజరైన 'ఆన్' ప్రీమియర్ షోలో నటుడు ఎర్రోల్ ఫ్లిన్ నిమ్మీని ముద్దు పెట్టుకోబోతే తను భారతీయ యువతినని అలా చేయకూడదని సున్నితంగా చెప్పడం అక్కడ పత్రికలకు ప్రధాన వార్త అయింది. తరువాత ప్రముఖ దర్శకుల, హీరోల నటి అయింది. దాగ్, అమర్, సజా, కుందన్, బసంత్ బహార్, రాజ్ ధాని, అంజలి ఆకాశ్ దీప్,మేరే మెహబూబ్, పూజా కె ఫూల్ సినిమాలు మంచి పేరు తేవడమే కాదు తెలుగు వారు కూడా తమ అమ్మాయిలను నిమ్మీ అని పిలిచేంత ఖ్యాతి పొందింది.1954లో తను నటిస్తూ డంకా సినిమా నిర్మించింది. ఆన్ సినిమాకి రచన చేసిన రచయత దర్శకుడు అలీ రజాని 1965లో పెళ్లి చేసుకుంది. 'లవ్ అండ్ గాడ్ 'నిమ్మీ నటిం చిన చివరి సినిమా దర్శకుని మరణం మరి కొన్ని అవాంతరాలతో అసంపూర్తిగా 1986లో విడుదలైంది. 2532020 నిమ్మీ మృతి చెందింది.



**( ఇంకా వున్నారు )**



వి.ఎస్.ఆర్.కేశవరావు



పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా కల్ట్ కెప్టెన్ హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. ఇప్పుడు ఆ అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్ళేలా కొత్త పోస్టర్ విడుదలైంది. పవన్ కళ్యాణ్ హ్యాట్ ధరించి స్టైలిష్ గా కనిపిస్తున్న పోస్టర్, సోషల్ మీడియాలో సంచలనం సృష్టి స్తోం ది . విడుదలైన తక్షణమే పోస్టర్ వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రియులు పవన్ కళ్యాణ్ అద్భుతమైన లుక్ కి ఫిదా అవుతున్నారు. ఈ భారీ స్పందన

## ఉస్తాద్ భగత్ సింగ్ కొత్త పోస్టర్

మరోసారి ఈ చిత్రంపై ఉన్న అపారమైన క్రేజ్‌ను నిరూపించింది.

ప్రారంభం నుంచే 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ప్రచార చిత్రాలు సంచలనంగా మారి, అన్ని సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతూ భారీ బజ్ సృష్టించాయి. 'దేఖ్ లేంగే సాలా', 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. పవన్ కళ్యాణ్ స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్‌కు విశేష ప్రశంసలు లభిస్తున్నాయి. ప్రతి పాట పవర్ స్టార్ ఆరాను మరింతగా ఆవిష్కరిస్తూ, అభిమానులను ఆకట్టుకుంటుంది. అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్న ప్రేమాభిమానాలతో చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. తాజా పోస్టర్ అందరినీ విశేషంగా ఆకట్టుకొని, అంచనాలను తారాస్థాయికి తీసుకెళ్లింది. ఈ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ, త్వరలోనే చిత్రానికి సంబంధించిన పవర్‌ప్యాక్డ్ 40 సెకన్ల గ్లింప్స్‌ను విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమవుతున్నారు. ఈ ప్రత్యేక వీడియో ద్వారా చిత్రంలోని స్థాయి, తీవ్రత, మాస్ ఎలిమెంట్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ గ్లింప్స్ అభిమానులకు అసలు సిసలైన మాస్ విందుని అందించనుంది. గతంలో 'గబ్బర్ సింగ్'తో సంచలనాలు సృష్టించిన బ్లాక్‌బస్టర్ దర్శకుడు హరీష్ శంకర్, 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్‌ను మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో చూపించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు. అన్ని అంశాల మేళవింపుతో సంపూర్ణ వినోదభరిత చిత్రంగా ఇది రూపుదిద్దుకుంటోంది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ తన సంగీతంతో చిత్రానికి మరింత హై వోల్టేజ్ ఎనర్జీని అందిస్తున్నారు. అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, ఉత్సాహం రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో, 'ఉస్తాద్ భగత్ సింగ్' మరోసారి మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం 2026, మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.

## వివిఎస్ క్రియేషన్ బ్యానర్‌లో టైటిల్ ఆవిష్కరణ



వివిఎస్ క్రియేషన్ బ్యానర్‌లో శ్రీరంగం సతీష్ కుమార్ సమర్పణలో సంయుక్తంగా నేడు ఫిల్మ్ ఛాంబర్ నందు ప్రముఖ దర్శక నిర్మాతల సారధ్యంలో టైటిల్ లోగోను ఆవిష్కరించడం జరిగింది. గతంలో తెలుగు, తమిళం, కన్నడ, చిత్రాలకు, దర్శక నిర్మాతగా చేసి, ఇప్పుడు వివిఎస్ క్రియేషన్స్ లో దర్శకుడు నానిరాజ్ చెప్పినటువంటి కథాంశం నచ్చి, ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమానికి తుమ్మలప్రసన్న కుమార్ (తెలుగు చలనచిత్ర నిర్మాత మండలి కార్యదర్శి), ప్రతాని రామకృష్ణ గౌడ్ (తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు & తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు) ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నానిరాజ్ గత 9 సంవత్సరాలుగా అసిస్టెంట్ డైరెక్టర్, రైటర్ గా, కొన్ని మూవీస్ కి ఘోస్ట్ రైటర్ గా, షార్ట్ ఫిల్మ్స్ కూడా డైరెక్ట్ చేశారు. ఈ చిత్రాన్ని కాలేజీ బ్యాక్‌డ్రాప్‌తో ఒక మంచి కామెడీ యూత్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టోరీ తీసుకోని, నానిరాజ్ కథాంశం కొత్తగా రూపొందిస్తున్నారు. ఇంకో విశేషమేమిటంటే, సంగీతం మీద అవగాహనతో ఈ చిత్రానికీ సంగీత దర్శకుడిగా కూడా చేస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ షెడ్యూల్స్ మార్చి మొదటి వారం నుండి ఏప్రిల్, మే, జూన్ సమయానికి షెడ్యూల్ పూర్తి చేయడనికి సన్నహాలలో ఉంది. ఈ చిత్రానికి మంచి ప్రతిభ, నటన ఉన్న హీరో, హీరోయిన్లని పరిచయం చేస్తున్నారు. అన్వేష్, సిరి, శ్రీదేవి, సుమన్, జీవా, అజఘోష్, ,LB శ్రీరామ్, చిత్రమ్ శ్రీను, చత్రపతి శేఖర్, జబర్దాష్ అప్పారావు, షేకింగ్ శేషు,రవి కుమార్, శ్రీకాంత్, హరీష్, రాజు, G నారాయణ రావు, సైనిక, హర్ష వర్ధిని, మమత, స్నేహ, జగదీశ్వరి, ధనలక్ష్మి రెడ్డి తదితరులు కీలకపాత్రలు పోషించనున్నారు. సురేష్ ఆత్రేయ డిఓపిగా చేస్తున్న ఈ చిత్రానికి శ్రీను ఎడిటర్ గా, రాక్ నాని, మున్నా కొరియోగ్రాఫర్ గా అలాగే దేవరాజ్ ఫైట్ మాస్టర్ గా పనిచేస్తున్నారు.

## రుక్మిణి టీజర్ లాంఛ్

నిరంజన్, గ్రీష్మ నేత్రికా , ప్రియ జస్పర్, దీప్తి శ్రీరంగం హీరో హీరోయిన్స్ గా జి సినిమా బ్యానర్ పై నేలబల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, కట్టా గంగాధర రావు నిర్మిస్తున్న సినిమా "రుక్మిణి". ఈ చిత్రానికి శ్రీమతి నేలబల్లి కుమారి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. సరికొత్త హారర్ కామెడీ కథతో దర్శకుడు సింహాచలం గుడుపూరి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ రోజు రాకింగ్ స్టార్ మంచు మనోజ్ చేతుల మీదుగా "రుక్మిణి" మూవీ టీజర్ విడుదల చేశారు. అనంతరం రాకింగ్ స్టార్ మంచు మనోజ్ మాట్లాడుతూ రుక్మిణి సినిమా టీజర్ అద్భుతంగా ఉంది. ఈ సినిమాతో నిరంజన్ హీరోగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమా అతనికి మంచి సక్సెస్ ఇవ్వాలి. టీజర్ చూస్తుంటే డైరెక్షన్, డీవోపీ వర్క్, మ్యూజిక్ అన్నీ చాలా బాగున్నట్లు తెలుస్తోంది. "రుక్మిణి" సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్ అందరికీ నా బెస్ట్ విశెస్ అందిస్తున్నా అన్నారు.

హీరో నిరంజన్ మాట్లాడుతూ మా "రుక్మిణి" మూవీ టీజర్ లాంఛ్ చేసిన మనోజ్ గారికి చాలా థ్యాంక్స్. ఆయన మా సినిమా టీజర్ బాగుందని చెప్పడం సంతోషంగా ఉంది. నాకు ఈ చిత్రంలో హీరోగా నటించే అవకాశం కల్పించిన డైరెక్టర్, ప్రొడ్యూసర్స్ కు థ్యాంక్స్ చెబుతున్నా. ఒక డిఫరెంట్ హారర్ కామెడీ మూవీగా రుక్మిణి మీ అందరినీ ఆకట్టుకుంటుంది అన్నారు

హీరోయిన్ గ్రీష్మ నేత్రికా మాట్లాడుతూ మేమంతా ఎంతో ప్యాషనేట్ గా చేస్తున్న చిత్రమిది. మా సినిమాకు మీ అందరి సపోర్ట్ ఉండాలి. మీరు సపోర్ట్ చేస్తే ఇలాంటి మరిన్ని మంచి మూవీస్ చేస్తాం. మా మూవీ టీజర్ రిలీజ్ చేసి బెస్ట్ విశెస్ అందించిన మనోజ్ గారికి థ్యాంక్స్ అన్నారు.

హీరోయిన్ ప్రియ జాస్పర్ మాట్లాడుతూ



రుక్మిణి మూవీ టీజర్ లాంఛ్ చేసిన మనోజ్ గారికి థ్యాంక్స్ చెబుతున్నా. మీ అందరి లవ్ అండ్ సపోర్ట్ మా మూవీకి ఉండాలి. వీలైనంత త్వరలో మీ ముందుకు రుక్మిణి చిత్రంతో రాబోతున్నాం అన్నారు.

యాక్టర్ జయంత్ మాట్లాడుతూ రుక్మిణి టీజర్ మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం. ఈ సినిమాలోని స్ట్రాంగ్ కంటెంట్ మిమ్మల్ని ఆద్యంతం ఎంగేజ్ చేసేలా ఉంటుంది. కథా బలమున్న మా సినిమాను మీరు తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతున్నాం అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ సుభాష్ ఆనంద్ మాట్లాడుతూ రుక్మిణి సినిమాకు మ్యూజిక్ చేసే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. ఈ సినిమా సాంగ్స్, బీజీ ఎం మిమ్మల్ని బాగా ఆకట్టుకుంటాయి. టీజర్ మిమ్మల్ని ఇంప్రెస్ చేస్తుంది అన్నారు.

నిర్మాత కట్టా గంగాధర్ రావు మాట్లాడుతూ మా రుక్మిణి మూవీ టీజర్ ను మంచు మనోజ్ గారు రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది. మోహన్ బాబుగారి సినిమాలకు అప్రెంటిస్ గా వర్క్ చేయడంతో నా కెరీర్ మొదలైంది. ఈ మూవీ కథను దర్శకుడు సింహాచలం చాలా బాగా చెప్పారు. అంతే బాగా రూపొందిస్తున్నారు. మా మూవీకి డీవోపీ వర్క్, అలాగే మ్యూజిక్ చాలా బాగుంటాయి. బీజీఎం మిమ్మల్ని ఆకట్టుకుంటంది.

డైరెక్టర్ సింహాచలం గుడుపూరి మాట్లాడుతూ కొత్త వారిని ఎంకరేజ్ చేయడంలో మంచు మనోజ్ గారు ఎప్పుడూ ముందుంటారు. మా మూవీ టీజర్ రిలీజ్ చేసి సపోర్ట్ చేసినందుకు ఆయనకు మా టీమ్ అందరి తరుపున థ్యాంక్స్ చెబుతున్నాం.

## నేడు భావ రస నాట్యోత్సవం సీజన్ 2



'మదాలస స్పేస్ ఫర్ డివైన్ ఆర్ట్' ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగిన 'భావ రస నాట్యోత్సవం సీజన్ 1', అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. ఈ ఏడాది జనవరి 4న హైదరాబాద్‌లోని ఫీనిక్స్ అరేనాలో కన్నుల పం డు వ గా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత శాస్త్రీయ నృత్య కళాకారులు సౌజన్య శ్రీనివాస్ గారు, మంజు వి. నాయర్ గారు, స్వప్న రాజేంద్రకుమార్ గారు తమ అసాధారణ నృత్య ప్రతిభతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.

ఇప్పుడు 'భావ రస నాట్యోత్సవం సీజన్ 2'కు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరి 28, 2026 సాయంత్రం 6:30 గంటల నుండి హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో ఈ కార్యక్రమం జరగనుంది. ప్రఖ్యాత శాస్త్రీయ నృత్య కళాకారులచే భరతనాట్యం, కూచిపూడి ప్రత్యేక ప్రదర్శనలకు ఈ కార్యక్రమం వేదిక కానుంది.

**వేదిక:**
రవీంద్ర భారతి, లక్డీకాపూల్, హైదరాబాద్, తెలంగాణ - 500004

**తేదీ & సమయం:**
ఫిబ్రవరి 28, 2026 | శనివారం సాయంత్రం 06:30 గంటల నుండి..

**ప్రత్యేక అతిథులు:**
రవి పాడి గారు IRTS, చీఫ్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే శ్రీ అనుగు నర్సింహా రెడ్డి గారు, డైరెక్టర్, భాషా మరియు సాంస్కృతిక శాఖ, వీర్నాల బాలాజీ గారు,చైర్మన్ వీర్నాల ఫౌండేషన్, వ్యాఖ్యాత వాచస్పతి శ్రీ అంబడిపూడి మురళీకృష్ణ గారు ప్రముఖ తెలుగు యాంకర్, ప్రసిద్ధ వక్త మరియు సాంస్కృతిక వ్యాఖ్యాత శాస్త్రీయ కళా వైభవానికి అద్దం పట్టేలా ఘనంగా ఈ కార్యక్రమం జరగనుంది.

**ప్రదర్శనల వివరాలు:**
- ★ కళారత్న సౌజన్య శ్రీనివాస్ గారు – భరతనాట్యం, కూచిపూడి (హైదరాబాద్)
- ★ ప్రమోద్ రెడ్డి గారు & అభినేత్రి ఎన్‌సెంబుల్ - భరతనాట్యం (హైదరాబాద్)
- ★ ఎం. సురేంద్ర నాథ్ గారు (ఎస్ఎన్ఏ యువ పురస్కార్ అవార్డు గ్రహీత) & డా. బిజినా సురేంద్ర నాథ్ గారు - కూచిపూడి (హైదరాబాద్)

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.